# మనం

జనం కోసం అక్షర యజ్ఞం..

Hyderabad | Karimnagar | Nizamabad | Nallagonda | Mahaboobnagar | Warangal | Khammam | Amaravathi | Tirupathi | Kurnool | Eluru | Visakhapatnam | Ananthapuramu | Kadapa

హైదరాబాద్
బుధవారం
25-09-2024
వెల. రూ.5
• సంపుటి : 8 • సంచిక: 275
పేజీలు : 8




## భారత్‌కు ప్రధాని మోదీ

**అమెరికాలో ముగిసిన మోదీ టూర్..**

**జెలెన్‌స్కీతో భేటీ, ట్రంప్‌తో చర్చల్లేవ్**

**వాషింగ్టన్/న్యూఢిల్లీ, సెప్టెంబర్ 24 :** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ.. 3 రోజుల అమెరికా పర్యటన ముగిసింది. క్వాడ్ దేశాధినేతల సమ్మిట్‌కు హాజరైన ప్రధాని మోదీ.. ఇదే పర్యటనలో వేర్వేరు దేశాల అధినేతలతో ద్వైపాక్షిక చర్చలు జరిపారు. న్యూయార్క్‌లోని భారతీయ ప్రవాసులతో 'మోదీ అండ్ యూఎస్' కార్యక్రమంలో పాల్గొని వారిని ఉద్దేశించి ప్రసంగించారు. ఆ తర్వాత ఐక్యరాజ్య సమితి జనరల్ అసెంబ్లీ

మిగతా 7లో...



## చైనా, భారత్ మధ్య నలిగిపోం

**మేము స్వతంత్రంగా ఉండాలనుకుంటున్నాం**

**ఎవరో ఒకరి పక్షంలో చేరదల్చుకోలేదు**

**శ్రీలంక అధ్యక్షుడు దిశనాయకే వ్యాఖ్య**

**ప్రధానిగా హరిణి అమరసూర్య ప్రమాణం**



**కొలంబో, సెప్టెంబరు 24 :** చైనా, భారత్ మధ్య నలిగిపోదలుచుకోలేదని శ్రీలంక నూతన అధ్యక్షుడు అనుర కుమార దిశనాయకే అన్నారు. భౌగోళిక రాజకీయ వైరాల్లోకి శ్రీలంకను లాగకుండా తటస్థ విదేశాంగ విధానం అవలంబిస్తామని ఓ మ్యాగజీన్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో చెప్పారు. తమ నేషనల్ పీపుల్స్ పవర్ (ఎన్పీపీ) కూటమి ప్రభుత్వం ఏ అధికార కేంద్రంతోనూ చేతులు కలపదన్నారు. చైనా, భారత్‌ల రెండూ శ్రీలంకకు విలువైన స్నేహితులేనని, ఇరు దేశాలతోనూ సత్సంబంధాలు కొనసాగిస్తామన్నారు. భౌగోళిక రాజకీయ శత్రుత్వాల మధ్య చిక్కుకోనే పరిస్థితులకు కొలంబో వీలైనంత దూరంగా ఉంటుందని తేల్చిచెప్పారు. తాము ఓ వర్గం పక్షం వహించమన్నారు. భారత్‌చైనాతో సంబంధాలను ఎన్‌పీపీ ప్రభుత్వం బ్యాలెన్స్ చేసుకొంటూ వెళ్లాలని నిర్ణయించింది. భౌగోళిక రాజకీయ యుద్ధంలో మేము పోటీదారులం కాదు. భవిష్యత్తులో వాటిల్లో భాగస్వామి కాబోము. వీటిల్లో శాండ్‌విచ్ వలే నలిగి పోవాలనుకోవడం లేదు. ముఖ్యంగా భారత్‌చైనా మధ్య ఇబ్బంది పడాలనుకోవడంలేద. ఇరు దేశాలు

మిగతా 7లో...

## కర్ణాటక సీఎంకు షాక్

**ముడా స్కాంలో సిద్దరామయ్య ప్రాసిక్యూషన్‌కు రాష్ట్ర హైకోర్టు ఓకే**

**గవర్నర్ అనుమతిని సవాల్ చేస్తూ ముఖ్యమంత్రి వేసిన పిటిషన్ కొట్టివేత**

**సిద్దూ రాజీనామాకు బీజేపీ డిమాండ్**

**హైకోర్టు తీర్పుపై సుప్రీంలో సవాల్?**

**నేడు కాంగ్రెస్ శాసనసభాపక్ష భేటీ**



**బెంగళూరు, సెప్టెంబరు 24 :** కర్ణాటక సీఎం సిద్దరామయ్యకు హైకోర్టు షాక్ ఇచ్చింది. మైసూర్ పట్టణాభివృద్ధి సంస్థ(ముడా) ఇంటి స్థలాల కేటాయింపు కుంభకోణంలో సీఎంను ప్రాసిక్యూట్ చేసేందుకు గవర్నర్ అనుమతి ఇవ్వడాన్ని రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం సమర్థించింది. గవర్నర్ ఇచ్చిన అనుమతిని సవాల్ చేస్తూ సిద్దరామయ్య వేసిన పిటిషన్ను హైకోర్టు కొట్టివేసింది. సిద్దరామయ్య భార్య పార్వతి అక్రమ మార్గంలో ముడా నుంచి 14 ఇంటి స్థలాలు పొందారని, ఆమె నుంచి ముడా

మిగతా 7లో...

## అప్పనంగా రూ.159 కోట్లు

**సర్కారుకు చెప్పకుండానే బ్యాంకు గ్యారెంటీల విడుదల**

**మహదేవ్‌పూర్ ఈఈ-1 తిరుపతిరావు ఇచ్చేశారు**

**నిర్మాణ సంస్థ నుంచి అండర్ టేకింగ్**

**తీసుకున్నారో లేదో కూడా ఈఎన్సీకి సమాచారం లేదు**

**వరద ప్రవాహ వేగాన్ని అంచనా వేయలేకపోయాం**

**సెకనుకు 4.25 మీటర్లు వస్తుందనుకుంటే 12-14 మీటర్లు**

**జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ ఎదుట ఇంజనీర్ల స్పష్టీకరణ**

**నేడు ఇరిగేషన్ కార్పొరేషన్ అధికారుల క్రాస్ ఎగ్జామినేషన్**



వివరాలు 7లో..

## మూసీ నిర్వాసితులకు డబుల్ ఇళ్లు

**ఉత్తర్వులు జారీ.. చెరువులు, నాలాల నిర్వాసితుల గుర్తింపు**

**మూసీ రివర్ బెడ్‌లోని 1600 ఇళ్ల తొలగింపు షురూ**

**ఆ తర్వాత బఫర్ జోన్‌లోని నిర్మాణాలు కూడా..**

**నిర్వాసిత కుటుంబాలు 16 వేలు ఉంటాయని అంచనా**

**అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఇల్లు కేటాయింపు**

**నేటి నుంచి ఇంటింటికీ అధికారుల బృందం**

**ఔటర్ లోపల చెరువులు, కుంటల ఎఫ్టీఎల్ నిర్ధారణ**

**శంషాబాద్ నుంచి ఫ్యూచర్ సిటీకి మెట్రోపై రూట్ మ్యాప్**

**దసరా వరకు మెట్రో విస్తరణపై డీపీఆర్ రూపకల్పన**

**మూసీ రివర్ ఫ్రంట్, మెట్రో విస్తరణపై సీఎం సమీక్ష**



**హైదరాబాద్, సెప్టెంబరు 24 (మనం న్యూస్):** మూసీ రివర్ ఫ్రంట్ ప్రాజెక్ట్ అభివృద్ధిలో భాగంగా అక్కడ ఆక్రమణలు తొలగించాలని నిర్ణయించిన క్రమంలో నిర్వాసిత కుటుంబాలకు డబుల్ బెడ్రూమ్ ఇళ్లను కేటాయిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటి వరకు మూసీ పరీవాహక ప్రాంతంలో పదివేల కుటుంబాలున్నట్లు అధికారులు గుర్తించారు. ఈ సంఖ్య మరింతగా ఉంటుందని.. సుమారు 16 వేల కుటుంబాలుండొచ్చని అంచనా వేస్తున్నారు. వీళ్లందరికీ డబుల్ బెడ్రూమ్ ఇళ్లను కేటాయించాలన్న సీఎం ఆదేశాల మేరకు ఉత్తర్వులు జారీ అయ్యాయి. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల కలెక్టర్లు, అధికారుల బృందం బుధవారం నుంచి ఇంటింటికీ వెళ్లి వివరాలు సేకరిస్తారు. తొలి విడతలో రివర్ బెడ్‌లోని 16,000 ఇళ్లను తొలగించే ప్రక్రియ వెంటనే మొదలవుతుందని చెప్పారు. తర్వాత బఫర్ జోన్లోని నిర్మాణాలను తొలగిస్తామన్నారు. కాగా మూసీ పరీవాహక ప్రాంతంలో నివసించే పేదల ఇళ్లతో పాటు చెరువులు, నాలాల వద్ద ఉంటున్న పేద కుటుంబాల వివరాలను కూడా సేకరించాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. అర్హులైన పేదలందరికీ భరోసా కల్పించే ప్రయత్నం చేయాలన్నారు. ఒక్క పేద కుటుంబం కూడా రోడ్డున పడకూడదని, అర్హులందరికీ డబుల్ బెడ్రూమ్ ఇళ్లు కేటాయించాలని ఆదేశించారు. మంగళవారం సీఎం రేవంత్ రెడ్డి జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్, హైదరాబాద్ మెట్రో రైలు అధికారులతో సమీక్ష

మిగతా 2లో...



## రేవంత్ కుటుంబం దోపిడీ

**కాంగ్రెస్ పార్టీకి ఓటు వెయ్యలేదనే కక్షతో పేదల ఇళ్ల కూల్చివేత**

**కేసీఆర్ రావాలని ప్రజలు కోరుతున్నారు**

**అరికెపూడి గాంధీకి కండువా కప్పిన సన్నాసెవరు?**

**ఏపీలో బాబు.. వారంలోనే పింఛన్ల పెంపు**

**ఇక్కడ పది నెలలైనా రేవంత్‌కు చేతకాలే**

**వైద్య ప్రవేశాలపై మొద్దునిద్ర వీడేదెప్పుడు?**

**రాష్ట్ర సర్కారుపై కేటీఆర్ ధ్వజం**

**హైదరాబాద్, సెప్టెంబరు 24 (మనం న్యూస్):** తెలంగాణ రాష్ట్రాన్ని సీఎం రేవంత్‌రెడ్డి కుటుంబం దోచుకుంటోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. రేవంత్‌రెడ్డి సోదరుడు

మిగతా 2లో...

## జాతీయ రహదారులతో ఖమ్మం నగరానికి రింగ్ రోడ్డు ఏర్పాటు

**ప్రకాష్‌నగర్ బ్రిడ్జి పునరుద్ధరణకు 100రోజుల సమయం**

**నిపుణుల కమిటీ ఆధ్వర్యంలో రిటైనింగ్ వాల్ నిర్మాణానికి నూతన డిజైన్ రూపకల్పన**

**ఖమ్మం నగర ఓఆర్ఆర్‌కు అవసరమైన సర్వీస్ రోడ్ల ఏర్పాటుకు చర్యలు**

**వరద ప్రభావిత ప్రాంతాల్లో పునరుద్ధరణ చర్యలు**

**ఖమ్మం ఓఆర్ఆర్, సర్వీస్ రోడ్ల నిర్మాణంపై మంత్రి తుమ్మల మీడియా సమావేశం**



వివరాలు 4లో..

## రేవంత్‌రెడ్డి.. కోర్టుకు రండి!

**వచ్చే నెల 16న ఖచ్చితంగా రావాలి.. ఇతర నిందితులు కూడా**

**ఓటుకు నోటు కేసులో నాంపల్లి సెషన్స్ కోర్టు**




**హైదరాబాద్, సెప్టెంబరు 24 (మనం న్యూస్):** ఓటుకు నోటు ఈడీ కేసులో నిందితులందరూ తదుపరి విచారణకు తప్పనిసరిగా హాజరుకావాలని నాంపల్లి మెట్రోపాలిటన్ సెషన్స్ కోర్టు ఆదేశించింది. మంగళవారం ఈ కేసు విచారణకు జెరూసలేం మత్తయ్య మినహా మిగిలిన వారెవరూ హాజరు కాకపోవడంతో జడ్జి ఆగ్రహం వ్యక్తం చేశారు. సీఎం రేవంత్ రెడ్డి సహా ఈ కేసులో నిందితులు విచారణకు ఎందుకు రావడం లేదని వారి తరపు న్యాయవాదులను జడ్జి ప్రశ్నించారు. రేవంత్‌తో పాటు

మిగతా 2లో...

## నగరంలో పలుచోట్ల భారీ వర్షం



**అవసరమైతే తప్ప ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావొద్దు**

**జీహెచ్ఎంసీ అధికారుల సూచిన**

**అప్రమత్తంగా ఉండాలని హెచ్చరిక**

**హైదరాబాద్, సెప్టెంబర్ 24 (మనం న్యూస్):** నగరంలో పలుచోట్ల భారీ వర్షం కురిసింది. మియాపూర్, కొండాపూర్, మాదాపూర్, అమీర్‌పేట, జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, ఉప్పల్, తదితర ప్రాంతాల్లో ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. ఈదురు గాలుల తాకిడికి వివిధ ప్రాంతాల్లో విరిగిపడిన చెట్లను డీఆర్ఎఫ్ సిబ్బంది తొలగిస్తున్నారు. రోడ్లపై వర్షం నీరు చేరడంతో వాహనదారులు ఇబ్బంది పడ్డారు. ఐటీ కారిడార్, బంజారాహిల్స్ తదితర ప్రాంతాల్లో ట్రాఫిక్ స్తంభించింది. అవసరమైతే తప్ప ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావొద్దని జీహెచ్ఎంసీ అధికారులు సూచించారు. అత్యవసర సేవల కోసం 040-21111111, 9000113667 సంప్రదించాలని తెలిపారు. అలాగే హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో భారీ వర్షం కురిసే అవకాశముందని వాతావరణశాఖ హెచ్చరించింది. సుచిత్ర, గుండ్లపోచంపల్లి, బహదూర్‌పల్లి,

మిగతా 2లో...

## శ్రీశైలం జలాశయాన్ని ఖాళీ చేసేస్తున్నారు!

**ఇన్‌ఫ్లో అంతంతమాత్రమే**

**పోటాపోటీగా తెలంగాణ, ఏపీ**

**జల విద్యుత్ ఉత్పత్తి 3 వారాల్లో 52.61 టీఎంసీల తరుగుదల**

**ఇన్‌ఫ్లో అంతంతమాత్రంగా ఉన్నా**

**పోటాపోటీగా జల విద్యుత్ ఉత్పత్తి**

**తెలంగాణ, ఏపీ వైఖరితో 3 వారాల్లో 52.61 టీఎంసీల తరుగుదల**

వివరాలు 7లో..

మనం



# మూసీ నిర్వాసితులకు డబుల్ ఇళ్లు



మొదటి పేజీతరువాయి...

నిర్వహించారు. మునిసిపల్ శాఖ ముఖ్యకార్యదర్శి దానకిశోర్, మెట్రో రైల్ ఎండీ ఎన్వీఎస్ రెడ్డి, సీఎం ప్రత్యేక కార్యదర్శి అజిత్ రెడ్డి, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి, హెచ్ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్, హైడ్రా కమిషనర్ రంగనాథ్, రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాల కలెక్టర్లు, ఉన్నతాధికారులు సమావేశంలో పాల్గొన్నారు. ఓఆర్ఆర్ లోపల ఉన్న చెరువులు, కుంటలు, నాలాలు ఆక్రమణలకు గురి కాకుండా పర్యవేక్షణను మరింత కట్టుదిట్టం చేయాలని అధికారులను సీఎం రేవంత్ ఆదేశించారు. ఇందుకోసం సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి, వాటిని కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు అనుసంధానం చేయాలని చెప్పారు. ఓఆర్ఆర్ లోపల ఉన్న అన్ని చెరువులు, కుంటలు, నాలాలను గుర్తించి వాటి ఎఫ్టీఎల్, బఫర్ జోన్లను గుర్తించాలని ఆదేశించారు. వీలైనంత త్వరగా వీటికి సంబంధించిన నివేదికను తయారుచేయాలన్నారు. ప్రతి ఆక్రమణలో అర్హులైన పేదలకు విధిగా పరిహారం అందేలా ప్రణాళిక రూపొందించాలని చెప్పారు.

### మెట్రో విస్తరణపై డీపీఆర్ రెడీ చేయండి

శంషాబాద్ ఎయిర్‌పోర్టు నుంచి ఫ్యూచర్ సిటీకి వేయాల్సిన మెట్రో మార్గానికి సంబంధించిన నివేదికను రూపొందించాలని అధికారులను సీఎం రేవంత్ ఆదేశించారు. ఓల్ సిటీ మెట్రో విస్తరణ పనులను వేగంగా చేపట్టాలన్నారు. మెట్రో మార్గాలకు సంబంధించిన భూసేకరణపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఎల్బీనగర్ నుంచి హయత్ నగర్, ఎంజీబీఎస్ నుంచి చాంద్రాయణగుట్టతో పాటు ఇతర ప్రాంతాలకు మెట్రో విస్తరణపై అధికారులు ఈ సందర్భంగా సీఎంకు వివరించారు. దసరాలోపు మెట్రో విస్తరణ రూట్‌కు సంబంధించి పూర్తిస్థాయి డీపీఆర్‌ను సిద్ధం చేసి కేంద్రానికి సమర్పించాలని సీఎం ఆదేశించారు.

## మొగిలయ్యకు ఇంటిస్థలం పత్రాలు

ప్రముఖ కిన్నెర వాయిద్యకారుడు పద్మశ్రీ దర్శనం మొగిలయ్యకు ఇంటిస్థలం పత్రాల్ని సీఎం రేవంత్‌రెడ్డి అందజేశారు. మొగిలయ్యకు హయత్నగర్లో 600 చ.గజాల స్థలాన్ని ప్రభుత్వం కేటాయించింది. అందుకు సంబంధించిన పత్రాల్ని ఎమ్మెల్యే వంశీకృష్ణతో కలిసి సీఎం మంగళవారం అందజేశారు. స్థల పత్రాలు అందజేయడం పట్ల సీఎంకు మొగిలయ్య కృతజ్ఞతలు తెలిపారు.



# మినీ డిగ్రీ ప్రోగ్రాం నేడు ప్రారంభం

**హైదరాబాద్, సెప్టెంబరు 24 (మనం న్యూస్):** ఇంజనీరింగ్, డిగ్రీ విద్యార్థులకు బ్యాంకింగ్, ఫైనాన్స్, బీమా(బీఎఫ్ఎస్ఐ) రంగాల్లో ఉద్యోగావకాశాలు కల్పించేలా 'మినీ డిగ్రీ ప్రోగ్రాం' నేడు ప్రారంభం కానుంది. సీఎం రేవంత్‌రెడ్డి, ఐటీ–పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్బాబు బుధవారం మాసాబ్ట్యాంక్లోని జేఎన్ఏఫ్ఏయూ ఆడిటోరియంలో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు. ఉన్నత విద్యామండలి గుర్తించిన 18 ఇంజనీరింగ్ కాలేజీలు, 20 డిగ్రీ కాలేజీల్లో చదువుతున్న 10వేల మంది విద్యార్థులకు ఈ శిక్షణను అందిస్తారు. రాష్ట్రవ్యాప్తంగా పట్టణ, గ్రామీణ ప్రాంతాల విద్యార్థులకు మేలు జరిగేలా కాలేజీల ఎంపిక జరిగిందని ఉన్నత విద్యామండలి అధికారులు వివరించారు. శిక్షణ పొందే విద్యార్థుల కోసం ప్రత్యేక పోర్టల్‌ను రూపొందిస్తామన్నారు. అందులో విద్యార్థుల వివరాలు ఉంటాయి. వారి బ యోడేటా, చదువుతున్న కాలేజీ, విద్యార్హతలు, సాంకేతిక కోర్సుల్లో శిక్షణ వంటి వివరాలతో ప్రొఫైల్స్ ఏర్పాటు చేస్తారు. బీఎఫ్ఎస్ఐ రంగాల్లో పేరొందిన కంపెనీలు.. తమకు కావాల్సిన ఉద్యోగులను ఎంపిక చేసుకోవడానికి ఈ పోర్టల్ను వారధిగా చేసుకుంటాయి. అంటే.. క్యాంపస్ సెలెక్షన్ల మాదిరిగానే.. ఈ పోర్టల్ ద్వారా కంపెనీలు నియామకాలను చేపడతాయి. తమకు కావాల్సిన ప్రమాణాల మేరకు విద్యార్థులను ఎంపిక చేసుకుని, వర్చువల్‌గా ఇంటర్వ్యూ చేసే వీలుంటుంది. ఈ కార్యక్రమం వల్ల డిగ్రీ, ఇంజనీరింగ్ విద్యార్థులకు ఉద్యోగ భరోసా కల్పించవచ్చని ప్ర భుత్వం భావిస్తోంది. 'మినీ డిగ్రీ ప్రోగ్రాం'ను అందిం చే కాలేజీల వివరాలను మంగళవారం ప్రకటించారు.

# అప్పనంగా రూ.159 కోట్లు

**హైదరాబాద్, సెప్టెంబరు 24 (మనం న్యూస్):** కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో భాగంగా ప్రభుత్వానికి చెప్పకుండానే రూ.159 కోట్ల బ్యాంకు గ్యారెంటీల సొమ్మును నిర్మాణ ఏజెన్సీకి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఇచ్చేశారు. ఇచ్చే ముందు నిర్మాణ సంస్థ నుంచి అండర్టేకింగ్ తీసుకున్నారా!? లేదా!? అన్న సమాచారమూ ఈఎన్సీ కార్యాలయానికి లేదు. కాళేశ్వరం ప్రాజెక్టుపై జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ జరుపుతున్న విచారణలో ఈ విషయాలు వెల్లడయ్యాయి. క్రాస్ ఎగ్జామినేషన్లో భాగంగా మంగళవారం ఐదుగురిని ప్రశ్నించింది. వీరిలో ప్రస్తుత, మాజీ అధికారులు ఉన్నారు. 'మేడిగడ్డ బ్యారేజీకి సంబంధించి నిర్మాణ సంస్థకు బ్యాంకు గ్యారంటీల సొమ్మును ఎవరు విడుదల చేశారు? దానికి ముందు అండర్ టేకింగ్ ఏమైనా తీసుకున్నారా!?'' అని ఈఎన్సీ (జనరల్) కార్యాలయంలోని డిప్యూటీ చీఫ్ ఇంజనీర్ అజ్మల్ ఖాన్ను కమిషన్ ప్రశ్నించింది. దీనికి ఆయన జవాబిస్తూ.. ''2020 అక్టోబరు 13వ తేదీన రాష్ట్రస్థాయి స్టాండింగ్ కమిటీ (ఎస్ఎల్ఎస్సీ) సమావేశం జరిగింది. బ్యాంకు గ్యారంటీల విడుదలకు సంబంధించి అందులో చర్చించాం. రూ.159 కోట్ల బ్యాంకు గ్యారంటీని మహదేవ్పూర్ ఈఈ–1 సీహెచ్ తిరుపతిరావు విడుదల చేశారు. ప్రభుత్వానికి ఎటువంటి సమాచారం ఇవ్వలేదు'' అని వివరించారు. బ్యాంకు గ్యారంటీలు ఇచ్చే ముందు నిర్మాణ సంస్థ నుంచి అండర్ టే కింగ్ తీసుకున్నారా? అని కమిషన్ ప్రశ్నించగా.. దీనిపై ఈఎన్సీ (జనరల్) కార్యాలయానికి ఎటువంటి సమాచారం లేదని తెలిపారు. మేడిగడ్డ బ్యారేజీ నిర్మాణంతో ముడిపడిన సమాచారం కావాలని విజిలెన్స్ శాఖ లేఖ రాసిందా? అని ప్రశ్నించగా.. రాసిందని జవాబిచ్చారు. తాను చేరేనాటికే బ్యారేజీల నిర్మాణం పూర్తయిందని రామగుండం మాజీ ఎస్ఈ కరుణాకర్ చెప్పారు. ఎస్ఈగా 2022 ఫిబ్రవరి 25న చేరానని, అదే ఏడాది జూలైలో మూడు బ్యారేజీలకు భారీగా వరదలు వచ్చాయని, సీసీ బ్లాకులు చెల్లాచెదురయ్యాయని, దీనిపై నిర్మాణ సంస్థలకు లేఖలు రాశానని వివరించారు. బ్యారేజీల ఆపరేషన్ అండ్ మెయింటినెన్స్ (ఓఅండ్ఎం) గడువు ఎప్పటి వరకూ ఉందని కమిషన్ ప్రశ్నించగా.. బ్యారేజీలు పూర్తయిన తర్వాత రెండేళ్లపాటు డిఫెక్ట్ లయబిలిటీ కాలం, ఆ తర్వాత మూడేళ్లపాటు ఓఅండ్ఎం ఉంటుందని వివరించారు. సుందిళ్ల బ్యారేజీ అంచనాలను ఎవరు సిద్ధం చేశారని చెన్నూరు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్–2 బి.విష్ణుప్రసాద్ను కమిషన్ ప్రశ్నించగా.. నిర్మాణ అంచనా వ్యయాన్ని వ్యాప్కోస్ తయారు చేసిందని బదులిచ్చారు. సుందిళ్ల నిర్మాణం చేపట్టే ముందు జియో టెక్నికల్, జియో ఫిజికల్ పరీక్షలు ఏమైనా చేశారా...? అని ప్రశ్నించగా... ఎన్ఐటీ వరంగల్తో చేయించామని సమాధానమిచ్చారు. డిజైన్లు/డ్రాయింగ్‌లను సెంట్రల్ డిజైన్ ఆర్గనైజేషన్ (సీడీవో) చీఫ్ ఇంజనీర్ తయారు చేశారని విష్ణుప్రసాద్ తెలిపారు. బ్యారేజీ డ్యామేజీకి కారణాలు ఏమిటని కమిషన్ ప్రశ్నించగా.. ''వరద ప్రవాహ వేగాన్ని సరిగ్గా అంచనా వేయలేకపోయాం. ప్రతి సెకనుకు 4.25 మీటర్ల వరద వస్తుందని అంచనా వేయగా.. 12–14 మీటర్ల వరద వచ్చింది. అందుకే బ్యారేజీ దెబ్బతింది'' అని వివరించారు. బ్యారేజీల్లో సీపేజీలను గుర్తించి 2019 డిసెంబరు 16న సెంట్రల్ వాటర్, పవర్ రిసెర్చ్ స్టేషన్ (సీడబ్ల్యూపీఆర్ఎస్)కు లేఖ రాయగా.. 2020 డిసెంబరు 22న ఆ సంస్థ ప్రతినిధులు సుందిళ్లకు వచ్చి అధ్యయనానికయ్యే అంచనాలను అందించారని తెలిపారు.

### నేడు కాళేశ్వరం ఇరిగేషన్ కార్పొరేషన్‌పై విచారణ

కాళేశ్వరం ఇరిగేషన్ కార్పొరేషన్ నుంచి చెల్లింపులపై జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ బుధవారం విచారించనుంది. ఎంత మేర రుణాలు తీసుకున్నారు? ఎవరెవరికి చెల్లింపులు చేశారు? తదితర అంశాలపై కార్పొరేషన్ ఎండీ, గజ్వేల్ ఈఎన్సీ బి.హరిరామ్‌ను ప్రశ్నించనుంది. ఆయనతోపాటు డైరెక్టర్ ఆఫ్ వర్క్స్ అకౌంట్స్ ఫణిభూషణ్‌శర్మ, చీఫ్ అకౌంట్స్ ఆఫీసర్ పద్మావతితోపాటు కాళేశ్వరం ఇరిగేషన్ కార్పొరేషన్లోని చీఫ్ అకౌంట్స్ ఆఫీసర్లను క్రాస్ ఎగ్జామినేషన్ చేయనుంది.

## నగరంలో పలుచోట్ల భారీ వర్షం

మొదటి పేజీతరువాయి...

సూరారం, కొంపల్లి, చింతల్, కండ్లకోయ, కృష్ణాపూర్, దుండిగల్, డబిల్‌పూర్ తదితర ప్రాంతాల్లో ఇప్పటికే వర్షం కురుస్తోంది. కరీంనగర్, సిద్దిపేట, మెదక్, కామారెడ్డి, రంగారెడ్డి, వికారాబాద్, యాదాద్రి భువనగిరి, సంగారెడ్డి జిల్లాల్లో కాసేపట్లో ఉరుములు మెరుపులతో కూడిన వర్షం కురిసే అవకాశముందని తెలిపింది. రాష్ట్రంలో నాలుగు రోజుల పాటు ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. బుధవారం గంటకు 40 నుంచి 50 కి.మీ, గురువారం 30 నుంచి 40 కి.మీ వేగంతో అక్కడక్కడ గాలులు వీచే అవకాశం ఉందని ప్రకటించింది. మధ్య బంగాళాఖాతంలో కేంద్రీకృతమైన ఉపరితల ఆవర్తనం ప్రభావంతో ఉత్తరాంధ్ర దక్షిణ ఒడిశా తీరం వద్ద పశ్చిమ మధ్య బంగాళాఖాతం దాని పరిసర వాయువ్య బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడిందని పేర్కొంది.

## రేవంత్ కుటుంబం దోపిడీ

మొదటి పేజీతరువాయి...





తిరుపతిరెడ్డి అయ్యప్ప సొసైటీలో ట్యాక్స్ వసూలు చేస్తున్నారని, కమీషన్లు, సెటిల్మెంట్ల దందా నడిపిస్తున్నారని అన్నారు. ఈ విషయాన్ని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ గతంలో తనతో చెప్పారని తెలిపారు. సీఎం, ఆయన బంధువులు చేస్తున్న దౌర్జన్యాలతో తెలంగాణలో రియల్ ఎస్టేట్ ధమాల్ అయిందన్నారు. మంగళవారం తెలంగాణ భవన్లో శేరిలింగంపల్లి నియోజకవర్గ బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలతో కేటీఆర్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హైదరాబాద్ ప్రజలు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను గెలిపించారన్న కారణంతో వారిపై రేవంత్‌రెడ్డి సర్కారు పగబట్టినట్లుగా వ్యవహరిస్తోందన్నారు. హైడ్రా పేరుతో పేదల బతుకులను రోడ్డుపాలు చేస్తున్నారని మండిపడ్డారు. ''హైడ్రాకు అందరూ సమానమని చెబుతూనే.. సీఎం రేవంత్‌రెడ్డి అన్న తిరుపతిరెడ్డికి మాత్రం ముందుగా నోటీసులిచ్చారు. పేదల ఇళ్లను మాత్రం పిల్లలు పుస్తకాలు తెచ్చుకోవడానికి కూడా సమయం ఇవ్వకుండా కూలుస్తున్నారు'' అని కేటీఆర్ ధ్వజమెత్తారు. సీఎం రేవంత్‌రెడ్డికి దమ్ముంటే కాంగ్రెస్ నేతలు పట్నం మహేందర్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ఆ పార్టీ ఎమ్మెల్యేలు, ఎంపీల ఇళ్లను కూలగొట్టాలని సవాల్ విసిరారు. పేదల ఇళ్లను కూల్చివేస్తే బీఆర్ఎస్ ఊరుకోదని, బాధితులకు అండగా పోరాటం చేస్తామని ప్రకటించారు. ''తెలంగాణ ఉన్నన్ని రోజులు కేసీఆర్ కనిపిస్తూనే ఉంటారు. ఆయన ఆనవాళ్లు చెరిపేయడం మీ వల్లకాదు చిట్టినాయుడూ'' అని వ్యాఖ్యానించారు.

### ఆ ఎమ్మెల్యేల బతుకు బస్టాండే..

పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేల బతుకు బస్టాండ్ అయిందని కేటీఆర్ వ్యాఖ్యానించారు. ''మనం మనోడు కాదంటున్నాం. కాంగ్రెస్ వాళ్లూ మావాడు కాదంటున్నారు. దీంతో వాళ్లు ఎటూ కాకుండా పోయారు. వారి నియోజకవర్గాల్లో ఉప ఎన్నికలు వస్తాయి. ప్రజలు తగిన గుణపాఠం చెబుతారు'' అని అన్నారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కొట్టుకున్నారన్న మంత్రి శ్రీధర్బాబు.. శేరిలింగంపల్లి ఎమ్మెల్యేకు కండువా కప్పిన సన్నాసి, దౌర్భాగ్యుడు ఎవరో చెప్పాలన్నారు. వృద్ధులకు పింఛన్ పెంచుతామని ఇచ్చిన హామీని ఏపీలో సీఎం చంద్రబాబు అధికారం చేపట్టిన వారం రోజుల్లోనే అమలు చేశారని కేటీఆర్ తెలిపారు. ఇక్కడ రేవంత్కు మాత్రం చేతనైతలేదని విమర్శించారు. ఇక వైద్య విద్య ప్రవేశాలకు నిర్ణీత గడువు ముగుస్తోందని, ముఖ్యమంత్రి మొద్దునిద్ర వీడెదెప్పుడంటూ కేటీఆర్ 'ఎక్స్' వేదికగా ప్రశ్నించారు. కాగా, బండి సంజయ్ కేంద్ర హోంశాఖ సహాయమంత్రిననే విషయాన్ని మరిచిపోయారంటూ కేటీఆర్ విమర్శించారు. అమృత్లో అవినీతి జరిగిందని ముందుగా చెప్పింది బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి అని, కానీ.. ఆయన ఇప్పుడు దొంగపిల్లిలా కళ్లు మూసుకున్నారని వ్యాఖ్యానించారు. తాము మొత్తం ఆధారాలతో బయటపెట్టాక చిల్లర మాటలెందుకని, సీవీసీకి సిఫారసు చేయడమెందుకని ప్రశ్నించారు.

## రేవంత్‌రెడ్డి.. కోర్టుకు రండి!

మొదటి పేజీతరువాయి...

ఉదయ్ సింహా, వేం కృష్ణ కీర్తన్, సండ్ర వెంకటవీరయ్య, సెబాస్టియన్ వచ్చే నెల 16న కచ్చితంగా విచారణకు రావాలని సమన్లు జారీ చేశారు. 2015లో తెలంగాణ ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా అప్పటి నామినేటెడ్ ఆంగ్లో–ఇండియన్ ఎమ్మెల్యే స్టీఫెన్‌సన్‌కు రేవంత్ రూ.50 లక్షలు ఇవ్వబోయారనే అభియోగంపై తొలుత ఏసీబీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టింది. ఆ తర్వాత ఈ కేసులో ఈడీ కూడా దర్యాప్తు ప్రారంభించింది. ఈ కేసు విచారణను తెలంగాణ నుంచి మార్చాలంటూ మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి వేసిన పిటిషన్ను సుప్రీంకోర్టు తోసిపుచ్చిన సంగతి తెలిసిందే. అయితే ఈ కేసుకు సంబంధించిన అంశాలను సీఎం రేవంత్ రెడ్డికి నివేదించవద్దని తెలంగాణ ఏసీబీ డైరెక్టర్ జనరల్‌ను కోర్టు ఆదేశించింది.

## సనాతన ధర్మాన్ని ఎవ్వరూ కించపరచరాదు

### పవన్ వ్యాఖ్యలకు బండి మద్దతు

**హైదరాబాద్, సెప్టెంబర్ 24 (మనం న్యూస్):** సనాతన ధర్మంపై ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కీలక వ్యాఖ్యలు చేసిన సంగతి తెలిసిందే. ఇంద్రకీలాద్రిపై ఈరోజు ఆయన మాట్లాడుతూ.. రాజ్యాంగం బాగుండాలి అని పాటుపడుతున్నాం మేం.. సెక్యులరిజం అన్ని వైపుల నుంచి రావాలి అన్నారు పవన్ కల్యాణ్. ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ శక్తిమంతమైన మాటలు మాట్లాడారని, సంపూర్ణంగా ఆయనకు మద్దతుగా నిలుస్తానని బండి సంజయ్ పేర్కొన్నారు. ' ఎవరైనా సనాతన ధర్మాన్ని చెడగొట్టడానికి ప్రయత్నిస్తే, హిందువులమందరం న్యాయబద్ధంగా గళం విప్పుదాం. సెక్యులరిజం అనేది రెండు వైపుల ఉండాలి? సెక్యులరిజం పేరుతో ఒకరు విలాసాలను అనుభవిస్తుంటే, మేము దెబ్బలు తింటూ కూర్చుంటామని ఆశిస్తే అది జరగదు. మేము మౌనంగా ఉండం.' ఈ మేరకు ఎక్స్ వేదికగా బండి సంజయ్ స్పందించారు. 'పరిత్రాణాయ సాధూనాం వినాశాయ చ దుష్కృతామ్. ధర్మసంస్థాపనార్థాయ సంభవామి యుగే యుగే' అని రాశారు.

## రైతు రుణమాఫీపై బిజెపి పోరు

### 30న ఇందిరాపార్క్ వద్ద ఒకరోజు దీక్ష

**హైదరాబాద్, సెప్టెంబర్ 24 (మనం న్యూస్):** కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని తెలంగాణ బీజేపీ డిమాండ్ చేసింది. ఈ క్రమంలో.. తెలంగాణ బీజేపీ కీలక నిర్ణయం నిర్ణయం తీసుకుంది. ఈ నెల 30న రైతు హామీల సాధన కోసం దీక్ష చేపట్టాలని నిర్ణయించింది. ఈ దీక్షలో బీజేపీ ప్రజా ప్రతినిధులు, ముఖ్య నేతలు పాల్గొననున్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి తొమ్మిదిన్నర నెలలవుతున్నా ఇచ్చిన హామీలు నెరవేర్చలేదని బీజేపీ మండిపడుతోంది. ఆరు గ్యారంటీలకు చట్టబద్ధత కల్పిస్తామని హామీ ఇచ్చి ఇప్పటి వరకూ దాని ఊసే ఎత్తడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రైతు రుణమాఫీ, రైతు భరోసా అన్ని రకాల వడ్లకు బోనస్ ఇవ్వాలని తెలంగాణ బీజేపీ డిమాండ్ చేస్తోంది. కౌలు రైతులకు, వ్యవసాయ కూలీలకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని బీజేపీ నేతలు అంటున్నారు. రైతు డిమాండ్ల సాధన కోసం ఈ నెల 30న ఇందిరాపార్కు దగ్గర 24 గంటల దీక్ష బీజేపీ చేపట్టనుంది. ఈ దీక్ష అక్టోబర్ 1న ముగియనుంది. ఈ మేరకు బిజిఎల్పీ నేత మహేశ్వర్ రెడ్డి మీడియా సమావేశంలో వెల్లడించారు.

# ఎడమకాల్వ గండ్లు త్వరగా పూర్తి చేయండి

### పనుల ఆలస్యంపై మంత్రి ఉత్తమ్ ఆగ్రహం

**సూర్యాపేట, సెప్టెంబర్ 24 (మనం న్యూస్):** నాగార్జున సాగర్ ఎడమ కాల్వ మరమ్మతు పనుల్లో జాప్యంపై నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సీరియస్ అయ్యారు. ఇంకా ఎన్నిరోజులు చేస్తారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. పనుల్లో నిర్లక్ష్యాన్ని సహించబోమని చెప్పారు. పనుల్లో జాప్యానికి కారణమైన ఇంజినీర్లపై ఎందుకు చర్యలు తీసుకోవద్దో తెలుపాలన్నారు. ఇటీవల వచ్చిన వరదలకు సూర్యాపేట జిల్లా నడిగూడెం మండలం కాగితపు రామచంద్రాపురం వద్ద నాగర్జున సాగర్ ఎడమ కాలువకు గండిపడింది.గండి పూడ్చివేత పనులు గత వారం ప్రారంభమయ్యాయి ఆ పనులు ఇప్పటికే పూర్తి కావాల్సి ఉండగా.. ఆ పనులు ఇంకా కొనసాగుతూనే ఉన్నాయి.. గండిపూడ్చివేత పనులు జరుగుతున్న తీరును పరిశీలించిన మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. సంబంధిత అధికారుల నిర్లక్ష్యం వల్లే గండి పూడ్చివేత పనులు ఆలస్యం అవుతున్నాయని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మండిపడ్డారు. ఇప్పటికైనా పనులు త్వరతగతిన పూర్తి చేయాలని ఆదేశించారు.

# ఔటర్ దాటిన హైడ్రా చర్యలు

### సమీప చెరువుల రక్షణకు ప్రణాళిక

### క్షేత్రస్థాయి పరిశీలనతో ఆక్రమణదారులకు దడ

**హైదరాబాద్, సెప్టెంబర్ 24 (మనం న్యూస్):** హైదరాబాద్‌తో పాటు నగరంతోపాటు నగరం చుట్టూ ఉన్న చెరువుల సంరక్షణపై హైడ్రా పక్కా ప్రణాళికను సిద్ధం చేస్తోంది. కొన్ని తటాకాల విషయంలో అధికారులు హద్దులు మార్చినట్లు, తప్పుడు పత్రాలు సృష్టించినట్లు హైడ్రా విచారణలో తేలింది. వాటిని చట్టపరంగా ఎదుర్కొనేందుకు కమిషనర్ రంగనాథ్ కేంద్ర ప్రభుత్వ సంస్థ సాయం తీసుకోబోతున్నారు. నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్ ఎన్ఆర్ఎస్సీ నుంచి 45 ఏళ్ల నాటి ఉపగ్రహ చిత్రాలను సేకరించేందుకు సిద్ధమయ్యారు. హైడ్రా, ఎన్ఆర్ఎస్సీ మధ్య త్వరలో ఒప్పందం జరగనుంది. ఇప్పుడు వెనకడుగు వేస్తే.. నగరంలో మిగిలిన అరకొర చెరువులు కూడా కబ్జా అవుతాయని, యుద్ధప్రాతి పదికన వాటిని రక్షించాల్సిన అవసరం ఉందని హైడ్రా భావిస్తోంది. లక్ష్యం నెరవేరే వరకు వెనకడుగు ఉండదని కమిషనర్ రంగనాథ్ స్పష్టం చేశారు. సరైన ఆధారాలతో కూల్చివేతలు చేపట్టినప్పుడే పనులు లక్ష్యం ప్రకారం కొనసాగుతాయని హైడ్రా భావిస్తోంది. అందులో భాగంగా ఇటీవల కమిషనర్ రంగనాథ్ బాలానగర్‌లోని ఎన్ఆర్ఎస్సీ కేంద్రాన్ని సందర్శించారు. శావేత్తలతో హైడ్రా కార్యక్ర మాలను పంచుకున్నారు. చెరువుల రక్షణకు సాయం కావాలని అడిగారు. అధికారికంగా చెరువుల హద్దులను నిర్ణయించి, స్పష్టమైన పటాలను ఇవ్వాలని కోరారు. కొందరు అధికారులు ఎఫ్టీఎల్ హద్దులను మార్చినట్లు తెలుస్తోంది. అలాంటి సందర్భాల్లో ఎన్ఆర్ ఎస్సీ పటాలు ఉపయోగపడతాయి. అధికారికంగా వాటిని కొనుగో లు చేస్తామని, త్వరగా ఏర్పాటు చేయాలని శావేత్తలను కోరాం అని రంగనాథ్ వివరించారు. ఎన్ఆర్ఎస్సీ సంస్థ ఇప్పటికే హైడ్రా అభ్యర్థన మేరకు 56 చెరువుల పటాలను అందజేసింది. 1979–2023 ఏళ్ల మధ్య చెరువులు ఏ విధంగా ఆక్రమణకు గురయ్యాయో చిత్రాలతో సహా వివరించింది. అనేక తటాకాలు కొన్ని రోజుల్లో కనుమరుగవుతాయని చెప్పడమే వాటి ఉద్దేశం. ఆయా పటాలను మరింత పక్కాగా రూపొందించి, హద్దులను నిర్ణయించాలని తాజాగా హైడ్రా కమిషనర్ రంగనాథ్ పరిశోధన సంస్థను కోరడం గమనార్హం. ఈ క్రమంలో ఉపగ్రహ చిత్రాల ఆధారంగా గతంలో ఉన్న చెరువులు నాలాలు గుర్తించి త్వరగా చర్యలు చేపట్టబోతున్నారు. ఈ క్రమంలో చెరువుల రక్షణపై మరింత పకడ్బందీగా చర్యలు తీసుకోబోతున్నారు.

# ములుగు మున్సిపల్ బిల్లును ఆమోదించండి

### గవర్నర్‌ను కలిసి విన్నవించిన మంత్రి సీతక్క

**హైదరాబాద్, సెప్టెంబర్ 24 (మనం న్యూస్):** ములుగు మున్సిపాలిటీ బిల్లును తక్షణం ఆమోదించాలని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మను మంత్రి సీతక్క కోరారు. గత ప్రభుత్వ హయాంలోనే దీనిని మున్సిపాలిటీగా చేశారని గుర్తు చేశారు. ఈ మేరకు మంగళవారం రాజ్‌భవన్‌లో గవర్నర్‌తో మంత్రి భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ములుగు గ్రామపంచాయతీని మున్సిపాలిటీగా మారుస్తూ 2022లో అసెంబ్లీ పాస్ చేసిన బిల్లుకు ఆమోద ముద్ర వేయాలని గవర్నర్‌కు సీతక్క వినతి పత్రం సమర్పించారు. సాంకేతికపరమైన చిక్కులతో ములుగు మున్సిపాలిటీ బిల్లు ఇంతకాలం పెండింగ్‌లోనే ఉండిపోయిన విషయం తెలిసిందే. గత ప్రభుత్వ తప్పిదాలతో మున్సిపాలిటీకి ములుగు నోచుకోని పరిస్థితి. తెలంగాణ మున్సిపల్ చట్ట సవరణ బిల్లులోనే ములుగు మున్సిపాలిటీ అంశాన్ని గత ప్రభుత్వం చేర్చింది. అదే బిల్లులో జీహెచ్ఎంసీ చట్టానికి సవరణలు ప్రతిపాదించింది గత సర్కార్. దీంతో ములుగు మున్సిపాలిటీ బిల్లు గందరగోళంగా మారిపోయింది. సభ్యుల గందరగోళం నడుమ 2022లో బిల్లును అప్పటి



ప్రభుత్వం పాస్ చేసింది. అయితే న్యాయపరమైన, సాంకేతికపరమైన అంశాల నేపథ్యంలో బిల్లును గత గవర్నర్ తమిళి సై సౌందర్ రాజన్ రాష్ట్రపతి ఆమోదానికి పంపించారు. దీంతో ములుగు మున్సిపాలిటీ బిల్లు పెండింగ్‌లోనే ఉండిపోయింది. ఈ క్రమంలో బిల్లు వివరాలు గవర్నర్‌కు అందజేసిన మంత్రి సీతక్క.. ములుగుకు మున్సిపాలిటీ హోదా కల్పించే బిల్లుకు ఆమోద ముద్ర వేయాలని విజ్ఞప్తి చేశారు.

## అమృత్ టెండర్లతో రేవంత్‌కు సంబంధం లేదు

### బాంబు పేల్చిన బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే ఉపేందర్ రెడ్డి

### సుజన్ రెడ్డి నా సొంత అల్లుడు అని వెల్లడి

**హైదరాబాద్, సెప్టెంబర్ 24 (మనం న్యూస్):** అమృత్ టెండర్లలో సీఎం రేవంత్ రెడ్డికి ఎలాంటి సంబంధం లేదని సుజన్ రెడ్డి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సొంత బావమర్ది కాదని, తన చిన్నల్లుడని బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే కందాల ఉపేందర్ రెడ్డి స్పష్టం చేశారు. అమృత్ టెండర్లపై కేటీఆర్ అనవసర వివాదం సృష్టిస్తున్నారని అన్నారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. మనోహర్ రెడ్డి కుమారుడు సుజన్ రెడ్డి అని అన్నారు. మనోహర్ రెడ్డి తన వియ్యంకుడని చెప్పారు. సుజన్ రెడ్డికి రాజకీయాలకు లింక్ లేదన్నారు. పదేండ్లలో బీఆర్ఎస్‌లో ఎంతో మంది లబ్ది పొందారని చెప్పారు. బిజినెస్ వేరు.. రాజకీయం వేరని అన్నారు. అమృత్ టెండర్లలో రేవంత్ రెడ్డికి ఎలాంటి సంబంధం లేదన్నారు. ఎవరో తమ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు తప్పుడు సమాచారం ఇచ్చారని వాపోయారు. అన్ని విషయాలను కేటీఆర్‌తో కలిసి చర్చిస్తానని వివరించారు. సుజన్ రెడ్డి తండ్రి మనోహర్ రెడ్డి మాట్లాడుతూ.. ఆన్ లైన్ టెండర్ల ద్వారా తన కుమారుడు నిబంధనల ప్రకారమే కాంట్రాక్టు దక్కించుకున్నారని తెలిపారు. అవసరమైతే మీడియా ముందు వివరాలు వెల్లడించేందుకు సుజన్ రెడ్డి సిద్ధంగానే ఉన్నారని తెలిపారు.

# నల్గొండకు రెండు తహసిల్దార్ కార్యాలయాలు అవసరం

- ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేయండి
- పెండింగ్‌లో ఉన్న కళ్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీకి అధికారులు చర్యలు చేపట్టండి
- రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి






**నల్లగొండ,సెప్టెంబర్ 24(మనం ప్రతినిధి) :** నల్గొండ పట్టణం , గ్రామీణ ప్రాంతాలకు వేరు వేరుగా తహసిల్దార్ కార్యాలయాల ఏర్పాటు అవసరమని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. ఇందుకుగాను ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాలని ఆయన జిల్లా కలెక్టర్ సి. నారాయణరెడ్డిని ఆదేశించారు .మంగళవారం మంత్రి నల్గొండ తహసిల్దార్ కార్యాలయంలో కళ్యాణ లక్ష్మి లబ్ధిదారులకు ఒక్కొక్కరికి లక్ష 116 రూపాయలుల చొప్పున 117 చెక్కులను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా మంత్రి మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ నల్గొండ నియోజకవర్గానికి సంబంధించి ఇంకా 200 కల్యాణ లక్ష్మి చెక్కులు పెండింగ్ లో ఉన్నాయని, వెంటనే వాటిని పంపిణీ చేసేందుకు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు .నల్గొండ జనాభా 2 రెండు లక్షలు దాటడం, ప్రస్తుత తహసిల్దార్ కార్యాలయంపై పని ఒత్తిడి, కనగల్, తిప్పర్తి మండలాల నుండి నల్గొండ తహసిల్ పరిధిలో గ్రామాలు కలవడం , నల్గొండ జిల్లా కేంద్రం కావటం, వీటన్నింటిని దృష్టిలో ఉంచుకొని నల్గొండ పట్టణం, గ్రామీణ ప్రాంతాలకు వేరు వేరుగా తహసిల్దార్ కార్యాలయాలను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని అన్నారు . నల్గొండకు ప్రత్యేక తహసిల్దార్ కార్యాలయం ఏర్పాటుకు ప్రభుత్వానికి వెంటనే ప్రతిపాదనలు పంపించాలని ఆయన జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డిని ఫోన్ ద్వారా ఆదేశించారు.ప్రస్తుత తహసిల్దార్ కార్యాలయాన్ని 25 లక్షల రూపాయల ఎం ఎల్ ఏ ఎస్ డి ఎఫ్ నిధులతో పూర్తిస్థాయిలో ఆధునికరించేందుకు చర్యలు చేపట్టాలని ఆయన ఆదేశాలు జారీ చేశారు. ఇందులో భాగంగా మీటింగ్ హాల్ మరమ్మతులు, పబ్లిక్ అడ్రస్ సిస్టం, టాయిలెట్స్ తో పాటు, అన్ని గదులను ఆధునికరించడం,ఏ సి సౌకర్యం, అవసరమైన సౌకర్యాలు అన్నింటిని కల్పించాలని, ఇందుకు అంచనాలను రూపొందించాలని పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు.జిల్లాలో ధరణి దరఖాస్తుల పరిష్కారం బాగుందని, రాష్ట్రంలోనే నల్గొండ జిల్లా ధరణి దరఖాస్తుల పరిష్కారంలో ముందు ఉందని తెలిపారు. ముఖ్యంగా గత ప్రభుత్వ హయాం నుండి నల్గొండ జిల్లా వ్యాప్తంగా 27,000 దరఖాస్తులు పెండింగ్ లో ఉండగా, జిల్లా కలెక్టర్ చొరవతో వాటిని పరిష్కరించి ఆ సంఖ్యను 4000 కు తీసుకురావడం జరిగిందని, ప్రతికించి నల్గొండ తహసిల్దార్ కార్యాలయానికి సంబంధించి 1400 దరఖాస్తులలో 1100 ఇదివరకే పరిష్కరించడం జరిగిందని , తక్కినవి వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. పని నిమిత్తం కార్యాలయాలకు వచ్చే ప్రజలను ఇబ్బంది పెట్టకుండా చూసుకోవాలని, ఎవరైనా పేదవారికి ఇబ్బంది కలిగించినట్లయితే తమ దృష్టికి తీసుకురావాలని ఆయన చెప్పారు.గతంలో ధరణిలో అనేక రకాల అక్రమాలు జరిగాయని ,వీటిని దృష్టిలో ఉంచుకొని తమ ప్రభుత్వం సాధ్యమైనంతవరకు సమస్యలు లేకుండా పరిష్కరించేందుకుగాను ధరణి స్థానంలో భూమాతను తీసుకురావాలని ఆలోచిస్తున్నట్లు చెప్పారు .దీనిద్వారా సమస్యలను సులభంగా పరిష్కరించేందుకు అవకాశం ఉన్నట్లు మంత్రి వెల్లడించారు.ఇన్చార్జ్ ఆర్డిఓ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ శ్రీదేవి, నల్గొండ తహసిల్దార్ శ్రీనివాస్ ,మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాసరెడ్డి ,ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు మంత్రి వెంట ఉన్నారు.

## కార్యకర్తలకు అండగా బిఆర్ఎస్ పార్టీ



**తిరుమలగిరి, సెప్టెంబర్ 24 (మనం న్యూస్) :** తిరుమలగిరి పట్టణంలోని మాజీ ఎమ్మెల్యే నివాసంలో తుంగతుర్తి నియోజకవర్గంలోని మంచతండా గ్రామానికి చెందిన లకావత్ సోమ్లు, గుండెపురి గ్రామానికి చెందిన పాలకుర్తి వెంకన్న లు గత కొన్ని రోజుల క్రితం ప్రమాదవశాత్తు మరణించారు. వీరికి బిఆర్ఎస్ పార్టీ సభ్యత్వం ఉన్నందున ప్రమాద భీమా కింద రెండు లక్షల చెక్కులను తుంగతుర్తి మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్ కుమార్ బాధిత కుటుంబ సభ్యులు లకావత్ జయమ్మ, పాలకుర్తి పద్మ లకు మంగళవారం అందజేశారు.ఈ సందర్భంగా గాదరి కిశోర్ కుమార్ కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడుతూ బిఆర్ఎస్ పార్టీ అధినేత కేసీఆర్ పార్టీలో పనిచేసే ప్రతి కార్యకర్త కుటుంబానికి అండగా ఉండేందుకే ఈ భీమా సదుపాయం కల్పించారని తెలిపారు. పార్టీ సభ్యత్వం పొంది ప్రమాదవశాత్తు చనిపోయిన ప్రతి కుటుంబానికి పార్టీ పక్షాన 2 లక్షల ప్రమాద బీమా అందుతుందని తెలిపారు.బి అర్ ఎస్ పార్టీ సభ్యత్వం కలిగిన పార్టీ కార్యకర్తలు ప్రమాదవశాత్తు చనిపోతే వారి కుటుంబసభ్యులకు అండగా నిలిచేందుకు భీమా సదుపాయం కల్పించామని చెప్పారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ మండల శాఖ అధ్యక్షులు ఎస్. రఘునందన్ రెడ్డి, తెడ్డు భాస్కర్, సందీప్, బిక్షం పాల్గొన్నారు.

## జడ్జి పెరంబుదూరు మారుతి ప్రసాద్ ప్రత్యేక పూజలు



**చిలుకూరు, సెప్టెంబర్ 24 (మనం న్యూస్) :** మంగళవారం సందర్భంగా చిలుకూరు శ్రీ అభయాంజనేయ స్వామి దేవాలయం లో హుజూర్ నగర్ కోర్టు జడ్జి పెరంబుదూరు మారుతి ప్రసాద్ ప్రత్యేక పూజలు నిర్వహించారు.స్వామి వారి దివ్య అనుగ్రహంతో,శేష వస్త్రం తో ఆలయం అర్చకులు రజనీకాంత్ ఆచార్య వారిని శాలువాతో సన్మానించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారి దివ్య దర్శనం చేసుకున్నారు. అర్చకులు ప్రత్యేక అభిషేకాలు ఆకు పూజలు నిర్వహించారు.తదనంతరం ఆలయం లో కమిటీ సభ్యులు ఆధ్వర్యంలో అన్నదానం కార్యక్రమం ఏర్పాటు చేశారు.ఇట్టి అన్నదానం చేయించిన దాతలు చిలుకూరు వాస్తవ్యులు బాలెబోయిన పవన్ కుమార్,ధనలక్ష్మి దంపతులు అన్నప్రసాదాన్ని అందజేశారు.ఇట్టి కార్యక్రమం లో ఆలయం చైర్మన్ కొడారు వెంకటేశ్వర్లు, శ్రీనివాస్ రావు,లక్ష్మయ్య,భద్రయ్య, చంద్రయ్య,లక్ష్మీ,సమ్మిరెడ్డి తదితరులు భక్తులు పాల్గొన్నారు.

# నిర్బంధించి చోరీకి పాల్పడే నిందితుల అరెస్ట్




- మేళ్లచెరువు స్టేషన్ పరిధిలో నమోదైన దొంగతనం కేసు
- నిందితుల నుండి 1.62 లక్షల విలువగల 6.5 తులాల బంగారం 12000 వేల విలువగల 30 తులాల వెండి, 3.5 లక్షల విలువ నేరానికి వాడిన ఇన్నోవా కారు, 75 వేల విలువ 5 మొబైల్స్ స్వాధీనం
- 5 గురు నిందితులను రిమాండ్ ఎ-6 పరారీలో
- విలేకరుల సమావేశంలో కేసు వివరాలు వెల్లడించిన ఎస్పీ సస్ ప్రీత్ సింగ్

**సూర్యాపేట,సెప్టెంబర్ 24(మనం ప్రతినిధి) :** జిల్లాలోని మేళ్లచెరువు మండలం పోలీస్ స్టేషన్ పరిధిలో డెకాయిటీ దొంగతనం కేసును పోలీసులు చేదించి ఐదుగురు నిందితుల్ని అరెస్టు చేయడం జరిగిందని జిల్లా ఎస్పీ సన్ ప్రీత్ సింగ్ అన్నారు మంగళవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో కేసుకు సంబంధించి వివరాలు వెల్లడించారు.పట్టుబడిన దొంగల నుండి రూ.1.62 లక్షల విలువగల 6.5 తులాల భంగారం, 12000 వేల విలువగల 30 తులాల వెండి, రూ.3.5 లక్షల విలువగల నేరానికి వాడిన ఇన్నోవా కారు, రూ.75 వేల విలువ 5 మొబైల్స్ స్వాదినం చేసుకున్నట్లు తెలిపారు వీటి విలువ మొత్తం రూ.6 లక్షల 38 వేల వరకు ఉంటుందని వాటన్నిటిని సీజ్ చేసి 5 గురు నింధితులను రిమాండ్ కు తరలించడం జరిగినది. మరొక నిందితులు ఎ -6 పరారీలో ఉన్నాడని నిందితుని ఆచూకీ కోసం వెతుకుతున్నామన్నారు సైంటిఫిక్ ఆధారలతో కేసును చేదించామని ఈ కేసులో కీలక సంచారం ఇచ్చిన సాధారణ పౌరుడు ఆటో డ్రైవర్ అని అన్నారు నేరాల నియంత్రణ, శాంతి భద్రతల రక్షణలో పౌరులు భగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. అదేవిధంగా కేసులు గత కొన్ని సంవత్సరాలుగా నమోదు కాకపోవడంతో ఈ కేసుకు సంబంధించి సైంటిఫిక్ ఆధారాలతో ముందుకు వెళ్ళి వేగంగా నింధితులను గుర్తించి కేసు ఛేదించడం జరిగిందన్నారు కేసులో బాగా పని చేసిన సిబ్బంది అందరికి ఎస్పీ ప్రశంషా పత్రాలు అందజేసి అభినందించారు ఈ కేసు చేదించడంలో కోదాడ సబ్ డివిజన్ పోలీసులతో ఏడు ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేశామని వెల్లడించారు. కేసు వివరాలకు సంబంధించి మేళ్లచెరువు శివారు వెల్లటూరు కాలనీ గ్రామం నందు 19వ తేదీన తెల్లవారుజామున 3 గంటల సమయంలో ఐదుగురు దొంగలు తమ్మిశెట్టి వెంకయ్య అనే బ్రిక్స్ వ్యాపారి ఇంట్లో తల్లుపు ఇనుప ప్లేట్ కట్ చేసి బలంగా పగలగొట్టి అక్రమంగా ప్రవేశించి నిందితుల వద్ద ఉన్న ఆయుధాలతో వెంకయ్యను . ఇద్దరు కూతుర్లను బెదిరించి వారిపై ఉన్న 6.5 తులాల బంగారు ఆభరణాలు, 30 తులాల వెండి ఆభరణాలు, రూ.50వే ల రూపాయల డబ్బు దొంగతనం చేయడం జరిగిందని పేర్కొన్నారు దీనిపై ఇంటి యజమాని తమ్మిషెట్టి వెంకయ్య స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయగా నేరం సంఖ్య 165/2024, సెక్షన్ 310(2), 333, 127(2) భారతీయ న్యాయ సంహిత చట్టం ప్రకారం డేకాయిటి దొంగతనం కేసు నమోదు చేసి విచారణ చేయడం జరిగిందన్నారు . వెంటనే జిల్లా ఎస్పీ తో పాటు అధనపు ఎస్పీ, కోదాడ డిఎస్పి సంఘటన స్థలాన్ని పరిశీలించామని దొంగల కోసం అధనపు ఎస్పీ నాగేశ్వరరావు, కోదాడ డివిజన్ డి.ఎస్.పి శ్రీధర్ రెడ్డి, ఆద్వర్యంలో 7 పోలీసు ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేశామని తెలిపారు కోదాడ రూరల్ సీఐ రజిత రెడ్డి, తన సిబ్బందితో అనంతగిరి పోలీసు స్టేషన్ పరిధిలో ఖమ్మం వెళ్ళే జాతీయ రహదారి 365 పై శాంతినగర్ వద్ద మంగళవారం ఉదయం వాహనాలు తనిఖీ చేయుచుండగా అనుమానంగా వస్తున్న ఇన్నోవా కారును గుర్తించి తనిఖీ చేసి కారులో కూర్చున్న 5 గురు వ్యక్తుల ను గుర్తిచారు, నిధితులు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఎన్టీఆర్ జిల్లాకు చెందిన ఎ -1 వేమవరపు నాగరాజు, ఎ -3 వేమవరపు పుల్లారావు, ఎ -4 బిక్షాలు, నల్గొండ జిల్లాకు చెందిన ఎ -2 రమావత్ మాత్రు, నాగూర్ కర్నూల్ జిల్లాకు చెందిన ఎ -5 చిక్కల అంజనేయులు లను అదుపులోకి తీసుకుని విచారణ చేయగా నిందితులు మేళ్లచెరువు శివారు వెల్లటూరు గ్రామంలో బ్రిక్స్ వ్యాపారి ఇంట్లో కత్తులతో బెదిరించి దొంగతనానికి పాల్పడినట్లు గుర్తించడం జరిగిందని నిందితుల నుండి రూ.1,62,250/- రూపాయల విలువగల 6.5 తులాల బంగారం అభరణాలు,రూ.12000/- వేయిల విలువగల 30 తులాల వెండి, రూ.38250/- రూపాయల డబ్బు, నేరానికి ఉపయోగించిన రూ.3,50,000/- విలువగల ఇన్నోవా కారు,రూ. 75,000/- విలువ 5 మొబైల్స్,దొంగతనానికి ఉపయోగించిన 5 కత్తులు, 2 జతల చేతి గ్లౌజులు, మాస్క్ లు సీజ్ చేశామని చెప్పుకొచ్చారు ఎ -1 నాగరాజుకు మల్లారెడ్డిగూడెం లో బంధువులు ఉన్నారు. నాగరాజు గతంలో మల్లారెడ్డిగూడెం లో భందువుల పెళ్లికి వచ్చి వెళ్ళేటప్పుడు మార్గం మద్యలో మేళ్లచెరువు నందు కోళ్ళు అమ్ముతున్న ఎ -6 వేముల వెంకటేశ్వర్లు (మిర్చి విత్తనాల వ్యాపారి) వద్ద కోళ్ళు కొనే సమయంలో పరిచయంఏర్పడి ఇద్దరు స్నేహితులయ్యారు, ఎ -1 నాగరాజు వృత్తిరీత్యా డ్రైవర్ కావడం వల్ల వ్యాపారం గురించి వెంకటేశ్వర్లు తో మాట్లాడేవాడు. నాగరాజు కు డబ్బు అవసరం ఉన్నందున విషయాన్ని ఎ -6 వెంకటేశ్వర్లుకు తెలుపి ఏదైనా దొంగతనానికి పాల్పడాలని నిశ్చయించుకుని, సహాయం చేయాలని వెంకటేశ్వర్లు ని అడగగా మేళ్లచెరువు శివారు వెల్లటూరు గ్రామంలో ఉన్న బ్రిక్స్ వ్యాపారి తమ్మిశెట్టి వెంకయ్య ఇంట్లో దొంగతనం చేస్తే 30 లక్షల వరకు డబ్బు దొరుకుతుందని నిర్ధారించుకున్నారు పథకం ప్రకారం ఎ -6 వెంకటేశ్వర్లు చెప్పిన విధంగా నింధితులు ఐదుగురు ఎ -2 రమావత్ మాత్రు తన స్నేహితుని వద్ద తెచ్చిన ఇన్నోవా కారులో వచ్చి బ్రిక్స్ వ్యాపారి తమ్మిశెట్టి వెంకయ్య ఇంటి తలుపుకు ఉన్న ఇనుప రేకు తొలగించి, బలంగా పగలగొట్టి ఇంట్లోకి ప్రవేశించడం జరిగిందని ఇంట్లో నిద్రిస్తున్న వెంకయ్యను, అతని ఇద్దరి కూతుళ్లను కత్తులతో బెదిరించి 6.5 తులాల భంగారం, 30 తులాల వెండి, 50 వేల రూపాయల డబ్బు దొంగిలించారు.ఇంట్లో వారు ఎవరికి సమాచారం ఇవ్వకుండా ముందుగా వారి నుండి 4 మొబైల్స్ ను తీసుకుని, దొంగతనం పూర్తి అయినాకా ఇంటి బయట పడేసి వెళ్లడం దొంగతనం చేసి వెళ్ళేటప్పుడు ఇంటి బయట నుండి డోర్ కు బేడెం పెట్టి వెళ్లడం జరిగిందన్నారు ఇంట్లో ఉన్న వెంకయ్య కూతురు మరో ఫోన్ తో పక్కింటి వారికి సమాచారం ఇవ్వగా వారు 100 కు ఫోన్ చేసి పోలీసులకు రప్పించడం జరిగిందని తెలిపారు . కేసులో ఉపయోగించిన ఇన్నోవా కారు డిల్లీ రిజిస్ట్రేషన్ తో కూడినది, ఇది టోల్ ప్లాజా వద్ద కూడా గుర్తించడం జరిగిందన్నారు ఈ కేసులో కీలక సమాచారం ఇచ్చిన సాదారణ పౌరుడు ఆటో డ్రైవర్ ఇచ్చిన సమాచారం ఈ కేసు చెదనలో చాలా ఉపయోగపడినది. ధైర్యంగా సమాచారం ఇచ్చిన ఆటో డ్రైవర్ ను ఎస్పీ అధికారుల సమక్షంలో సన్మానించారు. నేరాలకు సంభందించి పౌరుల బాద్యతగా సమాచారం ఇవ్వాలి, నేరాల నియంత్రణలో, శాంతి భద్రత ల రక్షణలో ప్రజల భాగస్వామ్యం చాలా ముఖ్యమైనది అని ఎస్పి అన్నారు.

### నిందితులపై గత నేర చరిత్ర

నిందితులు ఎ -1 పై ఆంధ్రాలో కంచికలచర్ల పోలీస్ స్టేషన్ పరిధిలో లో ఇసుక అక్రమ రవాణా కేసు, వీర్లపాడు పోలీస్ స్టేషన్ పరిధిలో అక్రమ మద్యం తరలింపు కేసు, ఖమ్మం జిల్లా మధిర టౌన్ లో దొంగతనం కేసులు ఉన్నట్లు తేలిందని నిందితుడుఎ -2 పై రాచకొండ కమిషనరేట్ పరిధి మీర్పేట పోలీస్ స్టేషన్ పరిధిలో మూడు దొంగతనం కేసులు ఇబ్రహీంపట్నం ఉప్పల్ పోలీస్ స్టేషన్ల పరిధిలో ఒక్కొక్క దొంగతనం కేసు నల్గొండ జిల్లా చింతపల్లి పరిధిలో రెండు దొంగతనం కేసులు మొత్తం ఏడు కేసులు నమోదయినట్లు తెలిపారు కేసులో భాగా పని చేసిన అధనపు ఎస్పీ నాగేశ్వర రావు, కోదాడ డిఎస్పి శ్రీధర్ రెడ్డి, సీఐ రజిత రెడ్డి, ఎస్సై మేళ్లచెరువు పరమేష్, అనంతగిరి ఎస్సై నవీన్, కోదాడ రూరల్ ఎస్సై అనిల్ రెడ్డి, చింతలపాలెం ఎస్సై సైది రెడ్డి, సిసిఎస్ సిబ్బందిని, ఐటీ సెల్ సిబ్బందిని, సబ్ డివిజన్ టెక్నికల్ టీం సిబ్బందిని ఎస్పీ అభినందినచి రివార్డ్స్ అందించారు.

# కాంగ్రెస్‌కు స్థానిక సంస్థల ఎన్నికలలో ప్రజలే తగిన బుద్ది చెప్తారు

**మర్రిగూడ,సెప్టెంబర్ 24(మనం న్యూస్) :** భారతీయ జనతా పార్టీ అధిష్టానం ఇచ్చిన పిలుపుమేరకు ప్రతి బూత్ లో కనీసం 200 మందిని సభ్యులుగా చేర్చేందుకు ప్రతి ఒక్కరు కృషి చెయ్యాలని నల్గొండ జిల్లా సభ్యత్వ నమోదు ఇంచార్జ్ బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి తూళ్ల వీరేందర్ గౌడ్ పిలుపునిచ్చారు.నల్లగొండ జిల్లాలోని మర్రిగూడెం మండల కేంద్రంలో నిర్వహించిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాబోయే రోజులలో నల్గొండ జిల్లాలో కాషాయ జెండాను ఎగరవేయ్యడమే లక్ష్యంగా బిజెపి సంస్థాగతంగా బలోపేతం అవుతుందని ఆయన స్పష్టం చేశారు. 2014 వ సంవత్సరంలో ఆన్లైన్ ద్వారా ప్రారంభమైన సభ్యత్వానికి దేశవ్యాప్తంగా ప్రజల నుండి బిజెపికి విశేషమైన మద్దతు లభించిందని, అందుకే ప్రపంచంలోనే అతిపెద్ద రాజకీయ పార్టీగా బిజెపి అవతరించిందని తూళ్ల వీరేందర్ గౌడ్ గుర్తు చేశారు. సెప్టెంబరు 25 వ తేదీన పండిత్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ జయంతి సందర్భంగా జాతీయ పార్టీ మరియు రాష్ట్ర పార్టీ పిలుపు మేరకు ప్రతి కార్యకర్త, ప్రతి బూత్ లో కనీసం 100 మందిని ఒక్కరోజే సభ్యులుగా చేర్చేందుకు కృషి చెయ్యాలని ఆయన పేర్కొన్నారు.రాష్ట్రంలో దాదాపు 36 వేల బూత్ లు ఉన్నాయని,బుధవారం ఒక్క రోజే దాదాపు రాష్ట్రవ్యాప్తంగా 36 లక్షల మందికి బిజెపి సభ్యత్వాన్ని ఇవ్వడమే లక్ష్యంగా పనిచేస్తామని తూళ్ల వీరేందర్ గౌడ్ వ్యాఖ్యానించారు. నల్గొండ జిల్లా అభివృద్ధి విషయంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు రాజకీయాలు చేస్తూ నల్గొండ ప్రాంత అభివృద్ధిని గాలికి వదిలేశారని ఆయన ఆరోపించారు. ఇప్పటికైనా నల్గొండ ప్రాంత అభివృద్ధిపై కాంగ్రెస్ ప్రభుత్వం దృష్టి పెట్టకపోతే స్థానిక సంస్థల ఎన్నికలలో ప్రజలే తగిన బుద్ధి చెబుతారని ఆయన విమర్శించారు. నల్గొండ జిల్లా ప్రజలు చాలా చైతన్యవంతులని తూళ్ల వీరేందర్ గౌడ్ ప్రశంసించారు. ఆ రెండు పార్టీలు నల్గొండ కోసం చేసిందేమీ లేదని, అందుకే స్థానిక ప్రజలు ఆ పార్టీలను విశ్వసించడం లేదని తూళ్ల వీరేందర్ గౌడ్ పేర్కొన్నారు.ఈ కార్యక్రమం బీజేపీ మర్రిగూడ మండల అధ్యక్షులు పాత్లావత్ రాజేందర్ నాయక్ ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి యాస అమరేందర్ రెడ్డి, ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షులు పిట్టల శ్రీనివాస్,మర్రిగూడ మండల సభ్యత్వ నమోదు ఇంచార్జి సోమ నర్సింహా, మునుగోడు అసెంబ్లీ కో కన్వీనర్ కాసాల జనార్దన్ రెడ్డి,మండల జనరల్ సెక్రెటరీ బోయపల్లి రాజు గౌడ్ యాస అశోక్ రెడ్డి,జిల్లా ఎస్ సి మోర్చా ఉపాధ్యక్షులు గ్యార యాదగిరి ,గిరిజన మోర్చా మండల అధ్యక్షులు భాస్కర్ నాయక్, మండల ఉపాధ్యక్షులు చాపల వెంకన్న, వేనేపల్లి శ్రీనివాస్ రావు మండల కార్యదర్శి కుక్కల వెంకటేష్,గ్యార రామలింగం, చెల్లం శంకర్, అంబాల రమేష్ ,పెద్దులు గౌడ్, శ్రీరామదాస్ ముత్తిలింగాచారి,పంగ యాదయ్య, కాటం నవీన్ గౌడ్, నూకల రమేష్ తదితరులు పాల్గొన్నారు.



## పొంగిపొర్లుతున్న వైతరణీ నది... వరుసగా విష జ్వరాలు

- ఒక కుటుంబంలో ఇద్దరు ముగ్గురుకి జ్వరాలు
- జ్వరం తగ్గినా తగ్గని నొప్పులు
- ప్రతి కుటుంబంలో వికలాంగుడిలా బాధపడుతున్న సభ్యులు
- అయ్యో అనే వాడు తప్ప పట్టించుకునే నాధుడు లేడు



**నాగార్జునసాగర్, సెప్టెంబర్ 24(మనం న్యూస్) :** సంవత్సర కాలంగా పారిశుద్ధ్యం పడకేసింది, ప్రజారోగ్యం ప్రశ్నార్థకంగా మారింది,డ్రైనేజీ మురుగు నీరు నెలల తరబడి పొంగి పొర్లి దుర్గంధం వెదజల్లుతుంది. వివరాల్లోకి వెళితే నందికొండ మున్సిపాలిటీ పరిధిలోని స్థానిక హిల్ కాలనీలో ఉన్న రెండవ వార్డు ప్రధాన రహదారి పైన ఈ మురుగు నీరు రోడ్డు పైనే నిత్యం పొంగి పొర్లుతు నివాస గృహాల ప్రహరీ గోడ ప్రక్క భాగంలో పేరుకుపోవడంతో ఆ మార్గము గుండా వెళే వారు, ఇళ్లలో నివసించే ఇరుగు పొరుగువారు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు ఒక పక్కన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్వచ్ఛ భారత్, అని పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని చెప్తుంటే అధికారులు మాత్రం అంటీ,ముట్టనట్లు వ్యవహరిస్తున్నారు. ఒకవైపు టైఫాయిడ్,డెంగీ,మలేరియా, చికెన్ గున్యా వైరల్ జ్వరాలు విజృంభిస్తున్నా ఇలా జనసంచారం మధ్య నిత్యం మురుగు నీరు పేరుకుపోయి పారుతూ ఉండటం ఎంతవరకు సమంజసం అని స్థానికులు పాలకులను అధికారులను ప్రశ్నిస్తున్నారు.ఇలా మ్యాన్ హోల్ నుంచి నీరు లీకవుతూ రోడ్లపైకి పారుతూఉండటం ఆ నీరు రోడ్డు మీద నిల్వఉండటంతో అటుగా వెళ్లే ద్విచక్ర వాహన దారులు జారి పడిపోయిన సందర్భాలు అనేకం. ఇక పాదాచారుల బాధలైతే వర్ణనాతీతం. ఈ పరిసరాలలో పాఠశాలలు వుండటం,ఈ రోడ్డు మీదుగా నడవాలంటే విద్యార్థులు, వృద్దులు, మహిళలు, చిన్నారులు, తీవ్ర ఇబ్బంది పడుతున్నారు.మురుగునీటి లోనే నడుచుకుంటూ వెళ్లాల్సి వస్తుందని నిత్యం ఇదే పరిస్థితి నెలకొంటుందని మండిపడుతున్నారుఈ విషయమై సంబంధిత శాఖాధికారులు పట్టించుకోపోవడం పై స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు కొన్ని నెలలుగా డ్రైనేజీ పొంగుతున్నా సంబంధిత శాఖ అధికారులకు చీమ కుట్టినట్లు కూడా లేక పోవడం పై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా పాలకులు, సంబంధిత శాఖ ధికారులు స్పందించి నిత్యం పొంగి పొర్లు తున్న డ్రైనేజీ నీరు రోడ్డుమీదకు, జనాలు సంచరించే ప్రాంతాలకు రాకుండా అరికట్టేలా చర్యలు చేపట్టాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

## డ్రగ్స్,సైబర్ నేరాలు, షీ టీమ్స్‌పై అవగాహన

- ఫోటోలను డిపిలుగా పెట్టుకోవద్దు




**కోదాడ, సెప్టెంబర్ 24(మనం న్యూస్) :** ఎస్పీ సన్ ప్రీత్ సింగ్ ఐపిఎస్ ఆదేశాల మేరకు కోదాడ డిఎస్పి మామిళ్ళ శ్రీధర్ రెడ్డి,ఇన్స్పెక్టర్ రాము ఆధ్వర్యంలో పట్టణం లోని కిడ్స్ కళాశాలలో షీ టీమ్స్ ,సైబర్ నేరాలపైన,గంజాయి,డ్రగ్స్ మత్తుమందులపై పోలీసు కళాభృందంతో విద్యార్థినిలకు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగినది. ఈ సందర్భంగా ఇన్స్పెక్టర్ రాము మాట్లాడుతూ జిల్లా ఎస్పి సన్ ప్రీత్ సింగ్ ఐపిఎస్ అధ్వర్యంలో షీ టీమ్స్,సైబర్ నేరాలపై, గంజాయి డ్రగ్స్ మత్తు మందులు,గుట్కాపై పటిష్టంగా పనిచేసున్నామని తెలిపారు.ప్రతి గ్రామంలో,స్కూల్లో కళాశాలలో, వసతి గృహాలలో చదువుకునే విద్యార్థులు,యువతి యువకులు ఇంటర్నెట్ ను సద్వినియోగం చేసుకోవాలి,సైబర్ మోసగాళ్ళ వల్ల మోసాలకు గురి కావద్దు,బ్యాంక్ ఖాతా,ఏటీఎం కార్డ్ వివరాలు,ఓటిపి వివరాలు ఇతరులను తెలపవద్దు, ఇతరులు ఆశ చూపితే వాటికి ఆకర్షితులు కావొద్దు.మెసేజ్ లలో వచ్చే బ్లూ లింక్ అనుసరించి వ్యక్తిగత వివరాలు నమోదు చేయవద్దు అని కోరినారు.సైబర్ మోసాలపై 1930 టోల్ ఫ్రీ నంబర్ కు పిర్యాదు చేయాలని అన్నారు.అలాగే వేధింపులపై 100 కు సమాచారం ఇవ్వాలని తెలిపినారు.వ్యక్తిగత ఫోటోలను డిపిలుగా పెట్టుకోవద్దని చెప్పారు.యువత చెడు వ్యసనాల బారిన పడొద్దు అన్నారు.గంజాయి మత్తుమందులకు సంబంధించిన సమాచారం ఎవరికైనా తెలిస్తే తప్పకుండా పోలీస్ వారికి సమాచారం ఇవ్వాలని తెలియజేశారు.షీ టీమ్స్ మహిళ ఎస్సై నీలిమ మాట్లాడుతూ మహిళల రక్షణ పై పటిష్టంగా పనిచేస్తున్నామని,ఆకతాయిలా ఆటలు సాగవని,మహిళలను ఆడపిల్లలను గౌరవించాలని తెలియజేశారు అదేవిధంగా ఆత్మ రక్షణ కొరకు మెలుకువలు నేర్చు కోవాలన్నారు ఎవరైనా మీ ఆత్మగౌరవాన్ని భంగపరిచినట్లయితే షీ టీం నెంబర్ 8712686056 కు సమాచార తెలియజేయవచ్చు అన్నారు. టీ సేఫ్ యాప్ గురించి విద్యార్థినిలకు వివరించారు.ఈ కార్యక్రమం నందు కిడ్స్ కళాశాల చైర్మన్ నీలం సత్యనారాయణ, డెరెక్టర్ నాగేశ్వరరావు,ప్రిన్సిపల్ గాంధీ,కోదాడ షీ టీం ఏఎస్ఐ కృష్ణమూర్తి,సిబ్బంది హెడ్ కానిస్టేబుల్ గోవిందు, హెడ్ కానిస్టేబుల్ యల్లారెడ్డి,కానిస్టేబుల్ యాకూబ్,మహిళ కానిస్టేబుల్ సాయి జ్యోతి,మహిళ సాధికారిత కేంద్రం డిస్ట్రిక్ట్ మిషన్ కోఆర్డినేటర్ చైతన్య,సఖి సెంటర్ అడ్మినిస్ట్రేటర్ హేమలత,భరోసా సెంటర్ మౌనిక,శృతి,కళాబృందం ఇంచార్జ్ యల్లయ్య,గోపయ్య,గురులింగం, క్రిష్ణ,చారి,నాగర్జున,కిడ్స్ కళాశాల ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు, విద్యార్థినిలు పాల్గొన్నారు.

మనం

Follow : @Manamnews

ఖమ్మం

## గీత కార్మికులకు కాటమయ్య రక్షక కవచ కిట్లు

- రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళీ శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వర రావు
- మద్దతు ధరపై చివరి గింజ వరకు పెసర్లను కొనుగోలు చేయాలి
- టి.యు.ఎఫ్.ఐ.డి.సి. నిధులు 2 కోట్లతో చేపట్టిన స్ట్రాం వాటర్ డ్రెయిన్, సీసీ రోడ్డు నిర్మాణ పనులకు మంత్రి శంకుస్థాపన



**ఖమ్మం, సెప్టెంబర్ 24(మనం బ్యూరో):** గీత కార్మికులకు కాటమయ్య రక్షక కవచ కిట్లను అందజేస్తామని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళీ శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వర రావు అన్నారు. మంగళవారం ఖమ్మం మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలోని 30వ డివిజన్ పంపింగ్ వెల్ రోడ్డులో టి.యు.ఎఫ్.ఐ.డి.సి. నిధులు 2 కోట్లతో చేపట్టిన స్ట్రాం వాటర్ డ్రెయిన్, సీసీ రోడ్డు నిర్మాణ పనులకు మంత్రి తుమ్మల నాగేశ్వర రావు శంకుస్థాపన చేశారు. అనంతరం తెలంగాణ కల్లుగీత కార్మికుల సహకార ఆర్థిక సంఘం, హైదరాబాద్ శాఖ సహకారంతో 100 మంది కల్లుగీత కార్మికులకు కాటమయ్య రక్షక కవచం భద్రత కిట్లను మంత్రి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వర రావు మాట్లాడుతూ కాటమయ్య రక్షక కవచం కిట్ల వల్ల కల్లు గీత కార్మికులు చెట్ల పైకి వెళ్ళినప్పుడు ప్రమాదాల బారిన పడకుండా ఉంటారని అన్నారు. కాటమయ్య రక్షక కిట్ ను గీత కార్మికులకు తమ ప్రభుత్వం ఉచితంగా అందిస్తుందని, దీనిని కార్మికులు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. కల్లు గీత కార్మిక సొసైటీ పరిధిలోని చెట్ల పైకి ఎక్కే గీత కార్మికులందరిని గుర్తించి వారికి రక్షక కవచ కిట్లను అందజేస్తామని మంత్రి అన్నారు. కాటమయ్య రక్షక కవచం కిటను అందజేసిన గీత కార్మికులు వాటిని వినియోగిస్తున్నారా, లేదా చూడాలని, అలాగే ఈ కిట్ల వినియోగం వల్ల కలిగే లాభాలు మొదలగు అంశాలను ఎక్సైజ్ అధికారులు విస్తృతంగా వివరించాలని మంత్రి ఆదేశించారు. ఖమ్మం నగరంలో ఎక్సైజ్ శాఖ పరిధిలో జరుగుతున్న పనులు మొదలగు వివరాలను మంత్రి ఆరా తీశారు. వైన్ షాప్ పర్మిట్ రూమ్, బార్ లను రెగ్యులర్ గా చెక్ చేయాలని, దేవాలయాలు, విద్యాసంస్థలు, ఆస్పత్రుల వద్ద మద్యం దుకాణాలు ఉండకుండా చూడాలని, మద్యం దుకాణాల వల్ల ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగవదని మంత్రి ఎక్సైజ్ అధికారులను ఆదేశించారు. కాటమయ్య రక్షక కవచం కిట్టు వినియోగం తీరుపై మంత్రి గీత కార్మికులను అడిగి తెలుసుకున్నారు.

### మార్కెట్ యార్డు పరిశీలన..

ఖమ్మం మార్కెట్ యార్డు లోని పెసర్ల కొనుగోలు కేంద్రాలను మంత్రి పరిశీలించారు. రైతులకు లాభం కలగాలనే ఉద్దేశంతో మద్దతు ధరపై పెసర్లు కొనుగోలు చేస్తున్నామని, క్వింటాల్ పెసర్లకు ప్రభుత్వం 8682 రూపాయల మద్దతు ధర చెల్లిస్తుందని మంత్రి తెలిపారు. మార్కెట్ యార్డులో పెసర్ల కొనుగోలు పురోగతి వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఖమ్మం జిల్లాలోని వైరా, ఖమ్మం మార్కెట్ యార్డులలో 2 పెసర్ల కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశామని, 391 మంది రైతుల నుంచి 4292 క్వింటాళ్ల పెసర్లు మద్దతు ధరపై కొనుగోలు చేయడం జరిగిందని జిల్లా మార్కెటింగ్ అధికారి అలీమ్ తెలుపగా, రైతుల వద్ద ఉన్న చివరి గింజ వరకు పెసర్లను మద్దతు ధరకు కొనుగోలు చేయాలని మంత్రి ఆదేశించారు. అనంతరం మంత్రి ఇటీవల వరదతో దెబ్బతిన్న ప్రకాష్ నగర్ బ్రిడ్జి ప్రాంతంలో జరుగుతున్న పనులను పరిశీలించారు. చేపడుతున్న పనుల వివరాలు, ఇప్పటివరకు పూర్తి చేసేది అధికారులను అడిగి తెలుసుకున్నారు. త్వరితగతిన పనులు పూర్తి చేసి, ప్రజలకు అందుబాటులోకి తేవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం నగర మేయర్ పునుకొల్లు నీరజ, ఖమ్మం మున్సిపల్ కమిషనర్ అభిషేక్ అగస్త్య, ఎక్సైజ్ సూపరింటెండెంట్ నాగేందర్ రెడ్డి, ఆర్ అండ్ బి ఎస్ఇ హేమాలత, కార్పొరేటర్ లు, ఎక్సైజ్, ఆర్ అండ్ బి., మార్కెటింగ్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## వరద బాధిత విద్యార్థులకు అండగా ఏఐఎస్ఎఫ్



**ఖమ్మం, సెప్టెంబర్ 24(మనం న్యూస్):** ఇటీవల కురిసిన భారీ వర్షాలకు వరద ముంపు ప్రాంతాల్లో సర్వం కోల్పోయిన విద్యార్థులకు ఆదుకునేందుకు ఏఐఎస్ఎఫ్ఐ ముందుకొచ్చింది. ఏఐఎస్ఎఫ్ ఖమ్మం జిల్లా సమితి ఆధ్వర్యంలో మున్నేరు వరద బాధిత విద్యార్థులకు నోట్ బుక్స్ పంపిణి చేశారు. అనంతరం ఏఐఎస్ఎఫ్ మాజీ జాతీయ నాయకులు పోటు ప్రసాద్ మాట్లాడుతూ దేశంలో జరిగిన ప్రకృతి- విపత్తు సమయాల్లో ఏఐఎస్ఎఫ్ ఎప్పుడూ బాధితులకు అండగా నిలిచిందన్నారు. పోరాటాలు ఉద్యమాలు తోపాటు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. మున్నేరు వాగు వరద బాధితులను ప్రభుత్వం అన్ని విధాల ఆదుకోవాలని కోరారు. వరద బాధిత విద్యార్థుల కు ఏఐఎస్ఎఫ్ ఎప్పుడూ అండగానే ఉంటుందని ఆయన తెలిపారు. వరద బాధిత ప్రాంతాలలో విద్యార్థులకు కార్పొరేట్, ప్రైవేట్ విద్యాసంస్థల్లో ఫీజు రాయితీ ఇవ్వటంతో పాటు, వరద బాధిత విద్యార్థి కుటుంబాలను ఆదుకోవడానికి ముందుకు రావాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ మాజీ రాష్ట్ర నాయకులు పోటు పూర్ణచంద్రరావు. ఏఐఎస్ఎఫ్ ఖమ్మం జిల్లా సమితి కార్యదర్శి ఇటికాల రామకృష్ణ, జిల్లా సహాయ కార్యదర్శిలు శివ నాయక్, వంశీ, జిల్లా నాయకులు రాకేష్, ప్రతాప్, గోపి, రోహిత్, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# ఉత్తమ కళాశాలగా కూసుమంచి జూనియర్ కళాశాలను తీర్చిదిద్దాలి

- రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్, సమాచార పౌర సంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి
- జూనియర్ కళాశాలను ప్రారంభించిన మంత్రి పొంగులేటి



**కూసుమంచి, సెప్టెంబర్ 24 (మనం న్యూస్):** ఉత్తమ కళాశాలగా కూసుమంచి జూనియర్ కళాశాలను తీర్చిదిద్దాలని రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్, సమాచార పౌర సంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు.మంగళవారం మంత్రి, జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, రాష్ట్ర నీటిపారుదల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ ఎం.విజయ్ బాబులతో కలిసి కూసుమంచి మండలంలో పర్యటించి జూనియర్ కళాశాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ కూసుమంచి మండలం పరిసర గ్రామాల ప్రజల ఆకాంక్ష మేరకు జూనియర్ కళాశాల ఏర్పాటు చేశామని, దీనికి సహకరించిన ముఖ్యమంత్రికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. విద్య, వైద్య రంగాలకు ప్రజా ప్రభుత్వం పెద్దపీట వేసిందని అన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాల కార్యక్రమం ద్వారా డ్వాక్రా మహిళలను కమిటీలుగా వేసి 637 కోట్లు ఖర్చు చేసి రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో మౌళిక వసతులు సరి చేశామని అన్నారు. పాఠశాలలు, కళాశాలలు ప్రారంభించిన రోజే పాఠ్య పుస్తకాలు, ఏక రూప దుస్తులు అందించామని అన్నారు. పేద వాడి వైద్యం కోసం ఎన్ని వేల కోట్ల ఖర్చు వచ్చిన వెనకడుగు వేయడం లేదని, రాజీవ్ ఆరోగ్యశ్రీ పరిమితిని 10 లక్షలకు పెంచామని తెలిపారు. కళాశాలలో ఇప్పటికే 50 మంది చేరారని, మరో 15 రోజులలో ఈ సంఖ్య 150 వరకు చేరుతుందని ఆశిస్తున్నట్లు అధికారులు తెలిపారని, చాలా సంతోషంగా ఉందని అన్నారు. సమయం ఉన్నప్పుడల్లా కళాశాలకు వస్తానని, రాబోయే 2 సంవత్సరాలలో ఖమ్మం జిల్లాలోనే ప్రైవేట్ సెక్టార్ కు ధీటుగా ఉత్తమ జూనియర్ కళాశాలగా కూసుమంచి కళాశాలను తీర్చిదిద్దడంలో సిబ్బంది పనిచేయాలని మంత్రి కోరారు. విద్యార్థులకు అవసరమైన అన్ని సౌకర్యాలు ప్రభుత్వం తరపున కల్పిస్తామని అన్నారు. జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ విద్య, వైద్యంపై మంత్రి ఆదేశాలతో జిల్లాలో ప్రత్యేక దృష్టి పెట్టడం జరిగిందని అన్నారు. జిల్లాలోని 50 ప్రభుత్వ పాఠశాలల్లో 4 నుంచి 6వ తరగతి చదివే పిల్లల కోసం ప్రత్యేకంగా ఇంగ్లీష్ ల్యాబ్ లను ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. ఇంగ్లీష్ ల్యాబ్ ల ద్వారా విద్యార్థులకు ఆంగ్లం నేర్పడంతో పాటు వారు ఆంగ్లం మాట్లాడే విధంగా అవసరమైన శిక్షణ అందిస్తున్నామని కలెక్టర్ తెలిపారు. ప్రతి బుధవారం 70 జిల్లా అధికారులతో ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం నాణ్యతను పరిశీలిస్తున్నామని అన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ద్వారా చేపట్టిన మౌళిక వసతుల పనులు చివరి దశకు చేరుకున్నాయని కలెక్టర్ అన్నారు. కూసుమంచి మండలంలో జూనియర్ కళాశాల ప్రారంభించడం సంతోషంగా ఉందని, 400 విద్యార్థులకు అనుగుణంగా ఈ కళాశాల నిర్మించామని, ప్రస్తుత సంవత్సరం నిర్దేశించిన లక్ష్యం మేరకు విద్యార్థుల సంఖ్య వచ్చేలా చర్యలు తీసుకుంటున్నామని, ప్రైవేటు పాఠశాలల్లో టీసీ తీసుకున్న విద్యార్థులతో సంప్రదిస్తున్నామని కలెక్టర్ తెలిపారు. అనంతరం మంత్రి, కళాశాలలో చదివే విద్యార్థినులకు పిఎస్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా సైకిళ్లను ఉచితంగా అందజేశారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ డాక్టర్ శ్రీజ, జిల్లా ఇంటర్మీడియట్ అధికారి రవి బాబు, నేలకొండపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ సీతారాము లు, కళాశాల ప్రిన్సిపాల్ వీరభద్రరావు, అధికారులు, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

# తల్లిదండ్రుల ఆకాంక్షలను నెరవేర్చేందుకు విద్యార్థులు కృషి చేయాలి



- రెవెన్యూ, హౌజింగ్, సమాచార పౌర సంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి
- పాఠశాలకు అవసరమైన 3 ఫేజ్ విద్యుత్ సరఫరాకు చర్యలు
- 8 నుంచి 10వ తరగతి చదివే బాలికలకు పీఎస్ఆర్ ట్రస్టు ద్వారా 604 సైకిళ్ళ పంపిణీ
- జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అదనపు తరగతుల గదుల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసిన మంత్రి

**కూసుమంచి, సెప్టెంబర్ 24(మనం న్యూస్):** తల్లిదండ్రులు పెట్టుకున్న ఆకాంక్షలను నెరవేర్చేందుకు విద్యార్థులు కృషి చేయాలని రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్, సమాచార పౌర సంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పిలుపు నిచ్చారు. మంగళవారం మంత్రి, జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, రాష్ట్ర నీటిపారుదల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ మువ్వా విజయ బాబు లతో కలిసి కూసుమంచి మండలంలో పర్యటించి రూ. 23.50 లక్షల అంచనా విలువతో చేపట్టిన జిల్లా పరిషత్ హైస్కూల్ అదనపు తరగతి గదుల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలలు, ఆస్పత్రుల పట్ల ప్రజలకు ఉన్న చులకన భావం మరిపించే విధంగా ప్రజా ప్రభుత్వం పని చేస్తుందని అన్నారు. ప్రభుత్వ పాఠశాలలో చదివినప్పటికీ మంచి భవిష్యత్తు ఉంటుందని పిల్లల తల్లిదండ్రులు విశ్వసించి కూసుమంచి మండలం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సుమారు 936 మంది విద్యార్థులు చదువుతున్నారని, ఇది చాలా సంతోషమని, దీనికి కారణమైన ప్రధాన ఉపాధ్యాయులు, మండల విద్యా శాఖ అధికారులు, ఉపాధ్యాయులకు మంత్రి అభినందనలు తెలిపారు. పాఠశాలకు అవసరమైన 3 ఫేజ్ కరెంట్ రెండు మూడు రోజులలో అందించడం జరుగుతుందని అన్నారు. పాలేరు అసెంబ్లీ నియోజకవర్గం సంబంధించిన విద్యా సంస్థల ప్రధానోపాధ్యాయులతో విస్తృత స్థాయి సమావేశం నిర్వహించి, వారి సూచనలు తీసుకుని 8 నుంచి 10వ తరగతి చదివే బాలికలు 604 మందికి సైకిళ్ళు పీఎస్ఆర్ ట్రస్ట్ ద్వారా ఉచితంగా అందిస్తున్నామన్నారు. పాలేరు నియోజకవర్గంలోని ప్రతి ప్రభుత్వ పాఠశాల, ఆసుపత్రిల్లో మినరల్ వాటర్ ప్లాంట్ లను దసరా సెలవులు లోపు పీఎస్ఆర్ ట్రస్టు ద్వారా ఏర్పాటు చేస్తామని అన్నారు. విద్య, వైద్యం పట్ల సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహిస్తుందని అన్నారు. పాఠశాల శుభ్రం చేసేందుకు కార్మికులు లేక, విద్యుత్ బిల్లులు చెల్లించేందుకు ఇబ్బందులు గురవుతున్నామని హెడ్ మాస్టర్ లు తెలియజేసిన సమస్యను క్యాబినెట్ దృష్టికి తీసుకువెళ్లి ప్రభుత్వ విద్యా సంస్థలకు ఉచిత విద్యుత్ సరఫరా ప్రారంభించామని, అదే విధంగా పాఠశాలను శుభ్రం చేసేందుకు ప్రతినెల విద్యార్థుల సంఖ్య అనుగుణంగా నిధులు కేటాయించడం జరుగుతుందని అన్నారు. కంప్యూటర్ విద్య కోసం టెక్నికల్ బృందం ఏర్పాటు కోసం చర్యలు తీసుకుంటామని, క్రీడలను సైతం తమ ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని, త్వరలో జిల్లా స్థాయిలో క్రీడా పోటీలు నిర్వహిస్తామని తెలిపారు. పిల్లలు మంచి స్థాయికి ఎదగాలని ఆకాంక్షతో పాఠశాలలకు తల్లిదండ్రులు పంపుతున్నారని, వారి ఆకాంక్షలను నెరవేర్చే బాధ్యత పిల్లలకు ఉంటుందని, మనం నిర్దేశించుకున్న లక్ష్యాల సాధనకు కష్టపడి చదువుకోవాలని మంత్రి పిలుపు నిచ్చారు. చెడు అలవాట్లకు విద్యార్థులు బానిస కాకుండా దూరంగా ఉండాలని మంత్రి తెలిపారు. జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ, జిల్లాలో 5 రకాలుగా విద్య పై దృష్టి పెడుతున్నామని, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల హాజరు, విద్యార్థికి పాఠ్యాంశాలు అర్థమయ్యేలా విద్యా బోధన, ఉపాధ్యాయుల హాజరుపై ప్రతి రోజూ పర్యవేక్షణ, జవాబుదారీతనంతో పేరెంట్, టీచర్స్ మీటింగ్, స్పోర్ట్స్ మీట్ నిర్వహణకు చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో మంచి అనుభవం, నైపుణ్యం కలిగిన ఉపాధ్యాయులు ఉన్నారని, ఇక్కడ ప్రైవేట్ కంటే మెరుగ్గా నాణ్యమైన విద్య అందించడం జరుగుతుందని అన్నారు. వంద శాతం 10వ తరగతి పరీక్ష ఫలితాలు సాధన దిశగా ప్రత్యేక ప్రణాళికతో చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. అనంతరం 8 నుండి 10వ తరగతి చదువుతున్న కూసుమంచి మండలానికి చెందిన 102 మంది విద్యార్థినిలకు సైకిళ్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ డాక్టర్ శ్రీజ, జిల్లా విద్యాధికారి సోమశేఖరశర్మ, నేలకొండపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ సీతారాములు, పాఠశాల హెచ్ఎం వీరస్వామి, అధికారులు, పాఠశాల ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

## అడవి జంతువుల వల్ల దెబ్బతిన్న పంటలకు పరిహారం చెల్లించాలి



**కొణిజర్ల, సెప్టెంబర్ 24(మనం న్యూస్):** దేశ వ్యాపితంగా అడవి జంతువుల వల్ల దెబ్బతిన్న పంటలకు పరిహారం చెల్లించాలని డిమాండ్ చేస్తూ సెప్టెంబర్ 25 న బుధవారం చలో ఢిల్లీనీ జయప్రదం చేయాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బొంతు రాంబాబు, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కమిటీ సభ్యులు తాళ్ళపల్లి కృష్ణ పిలుపునిచ్చారు. కొణిజర్ల మండలం గద్దల గూడెం గ్రామంలో సిపిఎం గ్రామ మహా సభ సందర్భంగా జరిగిన రైతు సభలో తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు తాళ్ళపల్లి కృష్ణ మాటాడుతూ మాట్లాడుతూ.. పులులు, ఏనుగులు, కోతులు అడవి పందులు, నెమళ్ల వలన పంటలు తీవ్రంగా దెబ్బతింటున్నాయని అన్నారు. ఈ అభయ అరణ్యాల దగ్గర సాగు చేస్తున్న రైతుల పంటలు పెద్ద ఎత్తున దెబ్బతింటున్నాయనీ అన్నారు. 2018 నుండి ఇప్పటి వరకు దేశంలో పులుల వలన 300 మంది పైగా రైతులు చనిపోయారనీ అన్నారు. ఏనుగుల వలన 2,700 మంది రైతులు చనిపోయారనీ అన్నారు. కోతులు వలన కూడా వందల మంది రైతులు చనిపోయారు వీరికి ఎలాంటి పరిహారం కేంద్ర ప్రభుత్వం నుండి రావడం లేదనీ అన్నారు. పంటలు తీవ్రంగా నష్టపోతున్నారనీ అన్నారు. ఆరుగాలం కష్టపడి సాగు చేసిన పంటలను పెట్టుబడి పెట్టి, చేతికి వచ్చిన సమయంలో అడవి జంతువుల వల్ల పంటలకు తీవ్ర నష్టం జరుగుతున్నదని అన్నారు. ఈ పంటలకు నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. పంటల నష్టం తో పాటు మనుషులు కూడా చనిపోతున్నారనీ అన్నారు. కనీస పరిహారం ఇవ్వడం లేదని ఆయన అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో కోతులు అడవి పందులు, నెమళ్ల వలన పంటలనే మార్పిడి చేసుకుంటున్నారనీ అన్నారు. వీటిపై దేశవ్యాప్తంగా విస్తృతంగా ప్రచారం నిర్వహించి ఈనెల 25న ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద జరుగు ధర్నాను జయప్రదం చేయాలని కోరారు. ఈ ధర్నాలు రైతాంగం పంటలు దెబ్బతిన్న వాళ్లు, అడవి జంతువుల వల్ల మరణించిన కుటుంబాలు హాజరు కావాల్సిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో గద్దల గూడెం మాజీ సర్పంచ్ పుల్లూరి వెంకటేశ్వర రావు, సిపిఎం గ్రామ కార్యదర్శి తేజవత్ సీతారాములు, చల్లా రాములు, చల్లా వెంకటనారాయణ, రేమల్ల కృష్ణ, హనుమంతు, భూ లక్ష్మి , వంశీ, రవి,ఎర్రగాని కృష్ణ కౌసల్య, తదితరులు పాల్గొన్నారు.

## నిత్యవసర సరుకులు పంపిణీ

**ఖమ్మం, సెప్టెంబర్ 24(మనం న్యూస్):** లకారం వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో లకారం చెరువు ప్రాంతంలో వరద తాకిడి గురై నష్టపోయిన వారికి మంగళవారం నాడు నిత్యవసర సరుకులను పంపిణీ చేశారు. నష్టపోయిన కుటుంబాలను గుర్తించి కొంతమందిని ఎంపిక చేశారు. ఈ సందర్భంగా వా కర్స్ క్లబ్ మెంబర్స్ డి పి సి రావు ఖాదర్ బాబు, జనార్ధన్ రావు మాట్లాడుతూ వరదల్లో నష్టపో యిన వారికి మానవతా దృక్పథంతో వాళ్లని ఆదుకుంటున్నట్లు వారు తెలిపారు.

# జాతీయ రహదారులతో ఖమ్మం నగరానికి రింగ్ రోడ్డు ఏర్పాటు

- రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళీ శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వర రావు
- ప్రకాష్ నగర్ బ్రిడ్జి పునరుద్ధరణకు 100 రోజుల సమయం
- నిపుణుల కమిటీ ఆధ్వర్యంలో రిటైనింగ్ వాల్ నిర్మాణానికి నూతన డిజైన్ రూపకల్పన
- ఖమ్మం నగర ఓఆర్ఆర్కు అవసరమైన సర్వీస్ రోడ్ల ఏర్పాటుకు చర్యలు
- అత్యధిక జాతీయ రహదారులు ఉన్న జిల్లాగా ఉమ్మడి ఖమ్మం
- వరద ప్రభావిత ప్రాంతాల్లో పునరుద్ధరణ చర్యలు
- ఖమ్మం ఓఆర్ఆర్, సర్వీస్ రోడ్ల నిర్మాణంపై మంత్రి తుమ్మల మీడియా సమావేశం



**ఖమ్మం, సెప్టెంబర్ 24(మనం బ్యూరో):** జాతీయ రహదారులతో ఖమ్మం నగరానికి రింగ్ రోడ్డు ఏర్పాటు చేసే దిశగా చర్యలు తీసుకుంటున్నామని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళీ శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ఖమ్మం కలెక్టరేట్ లో మంత్రి తుమ్మల నాగేశ్వర రావు వరద ప్రభావిత ప్రాంతాల్లో పునరుద్ధరణ చర్యలు, ఖమ్మం ఓఆర్ఆర్, సర్వీస్ రోడ్ల నిర్మాణం అంశంపై, జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తో కలిసి మంగళవారం మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వర రావు మాట్లాడుతూ, కుంభవృష్టి వరదల కారణంగాఖమ్మం జిల్లా తీవ్రంగా దెబ్బతిందని, జిల్లా కలెక్టర్ అధ్యక్షతన వరద ప్రభావిత ప్రాంతాల్లో పునరావాస చర్యలు చేపట్టి సాధారణ పరిస్థితులు పునరుద్ధరించడంలో అధికారులు సఫలీకృతులయ్యారని అన్నారు. విద్యుత్తు, తాగునీటి సరఫరా మొదలగు వసతులను వేగవంతంగా పునరుద్ధరించామన్నారు. వరదల కారణంగా ప్రకాష్ నగర్ బ్రిడ్జి యధాస్థితి కోల్పోయి పక్కకు జరిగిందని, పిల్లర్లకు ఎటువంటి ఇబ్బంది లేక పోయినా స్లాబ్ పక్కకు జరిగిందని, రోడ్లు భవనాల శాఖ మంత్రితో మాట్లాడి వైజాగ్ కు చెందిన నిపుణుల కమిటీతో పరిశీలన జరిపామని అన్నారు. బ్రిడ్జిలో మొత్తం 24 స్పాన్ లలో 9 పక్కకు జరిగాయని, హై లెవెల్ కమిటీ సమావేశంలో ఈ పనులను సంబంధిత కాంట్రాక్టర్లకు అప్పగించామని, దీని పునరుద్ధరణకు మరో 100 రోజుల సమయం పడుతుందని మంత్రి తెలిపారు. గతంలో ఎప్పుడు మున్నేరు నది చరిత్రలో 42 అడుగుల వరద వచ్చినా రికార్డు లేదని, దీనికి అనుగుణంగా నిపుణుల కమిటీ ఇచ్చే రిటైనింగ్ వాల్ రీ డిజైనింగ్ చేయిస్తున్నామని మంత్రి తెలిపారు. ఖమ్మం నగరంలోకి వచ్చిన డ్రైయిన్ నీరు మళ్లీ నదిలోకి ఎలా వెళ్లాలి అనేది సర్వే చేస్తున్నామని అన్నారు. వెయ్యి కోట్లకు పైగా నిధులతో ఖమ్మం-కోదాడ 31 కిలోమీటర్ ల జాతీయ రహదారి పూర్తి చేసామన్నారు. ఖమ్మం-దేవరపల్లి జాతీయ రహదారి ఉగాది వరకు పూర్తి చేస్తామని మంత్రి తెలిపారు. మంచిర్యాల, వరంగల్, ఖమ్మం, అమరావతి జాతీయ రహదారి, సూర్యాపేట, ఖమ్మం, రాజమండ్రి జాతీయ రోడ్ల మధ్యలో 6 కిలో మీటర్ల మిగులుతుందని, దీనిని కూడా 120 కోట్లు మంజూరు చేసి జాతీయ రహదారి అమరావతి రోడ్డుకు కలుపుతున్నామని, దీంతో ఖమ్మం నగరానికి ఔటర్ రింగ్ రోడ్డు రూపుదిద్దుకుంటుందని అన్నారు. ఖమ్మం ఓఆర్ఆర్ సర్వీస్ రోడ్ల నిర్మాణానికి సంబంధించి సమగ్ర చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. ప్రకాష్ నగర్ బ్రిడ్జి పునరుద్ధరణ పనులకు ప్రజలు సహకరించాలని, పనులు పూర్తయ్యే వరకు బ్రిడ్జిపై ఎవ్వరిని అనుమతించబోమని అన్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో రోడ్లు భవనాల శాఖ పరిధిలోనే 750 కోట్ల నష్టం జరిగిందని, వీటిని తాత్కాలికంగా పునరుద్దించేందుకు 25 కోట్లు మంజూరు చేస్తామని వెంటనే పనులు చేపట్టి పూర్తి చేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు. అత్యధిక జాతీయ రహదారులు ఉన్న జిల్లాగా ఖమ్మం ఆవిర్భవిస్తుందని మంత్రి పేర్కొన్నారు. లాభదాయక పంట ఆయిల్ పామ్ సాగుకు రైతులు ముందుకు రావాలని, 3 సంవత్సరాల తరువాత మంచి ఆదాయం వస్తుందని, 3 సంవత్సరాల వరకు అంతర్ పంటల ద్వారా ఆదాయం సమకూరుతుందని అన్నారు. ఆయిల్ పామ్ పంటకు ప్రభుత్వం తరపున భారీ స్థాయిలో సబ్సిడీ లభిస్తుందని, వీటిని రైతులు వినియోగించుకోవాలని అన్నారు. ఖమ్మం నగరంలో జరిగిన ఆక్రమణల తొలగింపుకు చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని అన్నారు. తెల్ల రేషన్ కార్డులేని రైతులకు రుణమాఫీ పథకం అమలు చేసేందుకు రైతు కుటుంబాల నిర్ధారణ సర్వే చేపట్టామని, దీని ప్రకారం అర్హులకు రుణమాఫీ పథకం వర్తింప చేస్తామని మంత్రి తెలిపారు. రెండు లక్షల పైన ఉన్న రైతులకు షెడ్యూల్ ఇస్తామని అన్నారు. వరద నష్టం క్రింద కేంద్ర ప్రభుత్వం నుంచి ఇప్పటివరకు ఎటువంటి సహాయం అందలేదని, కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రిని కలిసి ప్రతిపాదనలు సమర్పించామని అన్నారు.నదీ బేసిన్ పక్కన ఉన్న పేదలకు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు, ఇందిరమ్మ ఇండ్లు అందించేలా చర్యలు తీసుకుంటామని అన్నారు. అర్బన్ లో అధికంగా ఇండ్లు మంజూరు చేయాలని ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేశానని మంత్రి తెలిపారు. అనంతరం పాత్రికేయులు అడిగిన పలు ప్రశ్నలకు, సందేహాలకు మంత్రి సమాధానాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలోసత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి, ఖమ్మం మున్సిపల్ కమిషనర్ అభిషేక్ అగస్త్య, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డా. పి. శ్రీజ, అదనపు కలెక్టర్ డి. మధుసూదన్ నాయక్, ఇర్రిగేషన్ సిఇ విద్యాసాగర్, ఆర్ ను బి సిఇ మోహన్ నాయక్, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# అలుపెరుగని ప్రజా సేవకుడు పన్యాల జైపాల్ రెడ్డి







- నిత్యం ప్రజల్లో ఉంటూ.. ప్రజానాయకుడిగా గుర్తింపు
- ప్రజల సేవకై, సమాజం కోసం తనని తాను అంకితం చేసుకున్న జైపాల్
- రాజకీయాల్లో క్రియాశీలగా వ్యవహరిస్తూ, ప్రజల తరపున పోరాడే వ్యక్తి జైపాల్
- విద్యార్థి నాయకుడి నుండి ఏఎంసి డైరెక్టర్‌గా పదోన్నతి

**రంగారెడ్డి, సెప్టెంబర్ 24(మనం న్యూస్) :** రాజకీయాల్లో పార్టీలు మారడం సర్వ సాధారణం. అధికారం, పదవులను బట్టి పార్టీలు మార్చడం. సొంత ఎదుగుదల కోసం.. నమ్మిన నాయకులను నడిరేవులో ముంచడం, ప్రజలను మోసం చేయడం చాలా వరకు సాధారణంగా కొనసాగుతున్న నేటి రాజకీయ పరిస్థితులు ఇవి. కానీ, వీటికి నేను భిన్నమంటూ, ప్రజల శ్రేయస్సు కోసం అహర్నిశలు కృషిచేసి ప్రజల బాగు కోసం తపనపడుతూ... 2009లో రాజకీయంలో అరంగ్రేటం చేసిన నాటినుండే తనదైన శైలిలో ప్రజలకు సేవ చేసుకుంటూ ఎల్బీనగర్ నియోజకవర్గంలో తనకంటూ ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్నాడు. ఎల్బీనగర్ నియోజకవర్గ రాజకీయ పరిస్థితులను ప్రభావితం చేయగలిగే ప్రముఖులలో తాను ఒకడై నిలిచాడు. క్లిష్టమైన పరిస్థితులను ఎదుర్కొంటూ, ప్రజల శ్రేయస్సే శ్రేష్టమని అహర్నిశనాలు కృషిచేసిన ప్రజాసేవకుడికి , నియోజకవర్గంలోని ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయి ప్రత్యేక స్థానాన్ని పొందాడు. ఆ నాయకుడి కష్టానికి తగిన ప్రతిఫలమే అగ్రికల్చరల్ మార్కెట్ కమిటీ డైరెక్టర్గా తగిన గుర్తింపు లభించిందంటూ తన అభిమానుల సంబరాలకు అవధులు లేకుండా పోతున్నాయి. అతి చిన్న వయసులోనే ఇంతటి శిఖరాలను అవరోదించిన కథానాయకుడు పన్యాల జైపాల్ రెడ్డి గురించి తెలుసుకుందాం. 2009లో రాజకీయాల్లో అరంగ్రేటం. 2009లో సాధారణ కార్యకర్తగా కాంగ్రెస్ పార్టీలో చేరి, పార్టీ కార్యక్రమంలో క్రియాశీలంగా వ్యవహరిస్తూ తనదైన శైలిలో పార్టీ కార్యక్రమంలో ముందుండి నడిపిస్తూ అతి తక్కువ సమయం లేని పార్టీలో అనేక పదోన్నతులను పొందాడు. తాను చేసే సేవలకి ఎన్ని పదవులను పొందిన తక్కువేనని తన అభిమాన సంఘం పేర్కొంటుంది. ఎన్ఎస్ఐ జనరల్ సెక్రటరీ, మన్సూరాబాద్ డివిజన్ యూత్ కాంగ్రెస్ ప్రెసిడెంట్, ఎల్బీనగర్ నియోజకవర్గం యూత్ ప్రెసిడెంట్ ఇలా చెప్పుకుంటూ పోతే ఎన్నో పదవులను పొంది... గొప్ప నాయకుడిగా పేరు తెచ్చుకున్న రవ్వంతైన అహానికి పోకుండా తాను ప్రజల మనిషిని అంటూ ప్రజల సేవకై తపించి పోయాడు. అధికారం, పదవులు ఉన్నా లేకున్నా తాను మాత్రం ప్రజల సేవలకు వెనుకడుగు వేసిందే లేదు. విస్తృతంగా సేవలు.కరోనా లాంటి గడ్డు పరిస్థితులు నెలకొన్న సమయంలోను ప్రాణాలను సైతం లెక్కచేయకుండా.తన ప్రజల కోసం నిత్యావసర సరుకులను, మాస్కులను ఇలా అనేకరకాలుగా ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అనేక సేవా కార్యక్రమాలు చేపట్టి తనప్రజలకు ఎలాంటి కలగకుండా చూసుకున్న గొప్ప వ్యక్తి పన్యాల జైపాల్ రెడ్డి. అంతటి మహానుభావుడి, తను చేసిన సేవలను గుర్తించి స్వయంగా నేషన్ కాంగ్రెస్ యూత్ ప్రెసిడెంట్ రవీంద్రదాస్ అభినందించి రాజీవ్ రియల్ హీరోస్ సర్టిఫికెట్ అందజేసి ధృవకరించారంటేనే అర్థం చేసుకోవచ్చు ఎంత విస్తృతంగా సేవలు చేశారని. రాజకీయాలను సైతం ప్రభావితం చేయగల సమర్థుడు.ఎల్బీనగర్ నియోజకవర్గం రాజకీయ పరిస్థితులను ప్రభివతం చేసే ప్రముఖులలో జైపాల్ రెడ్డి ఒకరు. 2020లో కాంగ్రెస్ పార్టీ కార్పొరేటర్ ఎంపికై అనుకోని పరిస్థితుల్లో టికెట్ చేజారిన ఏమాత్రం నిరాశ చెందకుండా పార్టీ తరపున నిలబడిన కార్పొరేటర్ అభ్యర్థికి నిత్యం తోడుగా ఉంటూ విస్తృత స్థాయిలో ప్రచారం నిర్వహించారు. కార్పొరేటర్ మరణించిన అనంతరం 2021లో బై ఎలక్షన్ లో సైతం అన్ని తానై నడిపిస్తూ, కార్యకర్తలతో సమన్వయం చేసుకొని, ప్రజలతో మమేకం అవుతూ.పార్టీ నాయకుల మన్నులను పొంది. ఎల్బీ నగర్ నియోజకర్గం కాంగ్రెస్ పార్టీలో తనకు అంటూ ప్రతేయక పేరు ప్రఖ్యాతలు పొందారు. పార్టీ నిర్ణయాన్ని గౌరవిస్తూ. ధర్పల్లి రాజశేఖర్ రెడ్డి గెలుపునకు క్రియాశీలకంగా వ్యవహరించి కార్పొరేటర్ విజయంలో కీలకపాత్ర పోషించారు. కాంగ్రెస్ పార్టీలో, ప్రజల్లో తనపై వస్తున్న ఆదరణను చూసి ఇతర పార్టీ వాళ్ళు చూపించే ప్రలోభాలకు గురికాకుండా ఆది నుండి కాంగ్రెస్



పార్టీతోనే తన ప్రయనంకొనసాగించారు. అగ్రికల్చర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్గా పదోన్నతి. 2009 నుండి తన ప్రయాణంలో ఒడిదొడుకులు ఎదుర్కొంటూ.. తీవ్రమైన వత్తిళ్ళు తట్టుకుంటూ.. ఎన్ని కేసులు పెట్టిన భయపడకుండా, ప్రజల సేవకై ప్రజల కోసం నిలబడన వ్యక్తికి ఇది తగిన గౌరవం అంటూ.. పన్యాల జైపాల్ రెడ్డి అభిమాన సంఘం, ప్రజలు ఆనందంలో మునిగి తేలుతున్నారు. ఇలాంటి గొప్ప నాయకుడికి మరిన్ని పదవులు ఇవ్వాలంటూ కోరుతున్నారు. రాబోయే ఎన్నికల్లో తమ ప్రియమైన నాయకుడిని కాంగ్రెస్ పార్టీ తరపున కీలకమైన పదవిలో చూడాలని స్థానిక కార్యకర్తలు, ప్రజలు చర్చించుకోవడం గమనార్హం. తమ నాయకుడిని కీలకమైన పదవులు వరిస్తే ప్రజలకు మరింత సేవ చేసుకోవడం ఖాయం అంటూ స్థానికులు, కార్యకర్తలు పేర్కొంటున్నారు. గడ్డిఅన్నారం ఫ్రూట్ మార్కెట్ అగ్రికల్చర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్గా నియమించినందుకు ప్రభుత్వానికి కృతజతలు, తనపై పెట్టిన బాధ్యతను, నమ్మకాన్ని ఎప్పుడు కొల్పోనని జైపాల్ రెడ్డి తెలిపారు.

## ఆయిల్ పామ్ సాగు విస్తీర్ణం లక్ష్యాలను పూర్తి చేయాలి

- ప్రతి క్లస్టర్ పరిధిలో 30 ఎకరాల మేర ఆయిల్ పామ్ సాగు
- నవంబర్ నాటికి మరో 1500 ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగు విస్తరించాలి
- లాభదాయక పంటల సాగు దిశగా రైతులను ప్రోత్సహించాలి
- సన్న ధాన్యం కొనుగోలుపై వ్యవసాయ అధికారులు సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలి



**పెద్దపల్లి, సెప్టెంబర్ 24(మనం ప్రతినిధి) :** మన పెద్దపల్లి జిల్లాకు కేటాయించిన ఆయిల్ పామ్ సాగు విస్తీర్ణం లక్ష్యాలను పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు. మంగళవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సమీకృత జిల్లా కలెక్టరేట్ లో వ్యవసాయ శాఖ పై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు.జిల్లాలో ఆయిల్ పామ్ సాగు లక్ష్యాలు, ఆయిల్ పామ్ సాగుకు ముందుకు వచ్చిన రైతులు, ఆయిల్ పామ్ సాగు విస్తరణ, డ్రిప్ ఇరిగేషన్ ఏర్పాటు, ఖరీఫ్ సీజన్ ధాన్యం కొనుగోలు సన్నద్దత మొదలగు అంశాలను అధికారులు కలెక్టర్ కు వివరించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ, వ్యవసాయ శాఖకు సంబంధించి పని తీరులో మన పెద్దపల్లి జిల్లా ఎప్పుడు రాష్ట్రంలో అగ్రస్థానంలో నిలుస్తుందని, ప్రస్తుతం రైతు బీమా కు సంబంధించి కొన్ని కేసులు పెండింగ్ ఉన్నాయని, వీటిని వ్యవసాయ అధికారులు పూర్తి చేయాలని అన్నారు. ప్రతి మండల పరిధిలో రాబోయే యాసంగి సీజన్ కు అవసరమైన ఎరువులు, యూరియా స్టాక్ ఉందో లేదో పరిశీలించాలని అన్నారు. రైతు రుణమాఫీ కి సంబంధించి పెండింగ్ ఉన్న రైతుల కేసులను అధికారులు ప్రత్యక్షంగా పర్యవేక్షించి అర్హులకు రుణమాఫీ ఫలాలు చేరే విధంగా చూడాలని కలెక్టర్ తెలిపారు. క్రాప్ బుకింగ్ ప్రక్రియ పూర్తి చేయాలని అన్నారు. మన జిల్లాలో ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీ నిర్మాణం ప్రారంభమైందని, ఆశించిన మేర ఆయిల్ పామ్ పంటల సాగు బదిలీ జరగడం లేదని కలెక్టర్ తెలిపారు. ప్రస్తుత సంవత్సరానికి మన జిల్లాకు కేటాయించిన ఆయిల్ పామ్ సాగు లక్ష్యం పూర్తి చేసేందుకు వ్యవసాయ విస్తరణ అధికారులు కృషి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రతి వ్యవసాయ విస్తరణ అధికారి తన పరిధిలో కనీసం 30 ఎకరాల వరకు ఆయిల్ పామ్ సాగు విస్తరించాలని, ప్రతి క్లస్టర్ లో రైతులను గుర్తించి నిరంతరం ఫాలో అప్ చేస్తూ , ఆయిల్ పామ్ సాగు చేస్తున్న రైతులతో మాట్లాడించాలని, నిర్దేశించుకున్న లక్ష్యాలను సాధించాలని కలెక్టర్ సూచించారు. ఆయిల్ పామ్ సాగుకు ముందుకు వచ్చిన రైతుల నుంచి మొక్కల సబ్సిడీ డీడీ కట్టించాలని కలెక్టర్ తెలిపారు. డ్రిప్ ఏర్పాటుకు సంబంధించి పూర్తి స్థాయి సబ్సిడీ భరించేందుకు ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ ముందుకు వచ్చిందని, దీనిని వినియోగించుకొని రైతులు ఆయిల్ పామ్ సాగు మారేలా చూడాలని కలెక్టర్ తెలిపారు. అక్టోబర్ మొదటి రెండు వారాల్లో క్షేత్రస్థాయిలో రైతులను ఒప్పిస్తే యాసంగి సీజన్ లో పామాయిల్ ప్లాంటేషన్ అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. పెద్ద రైతుల వద్దకు వ్యవసాయ అధికారులు ప్రత్యేకంగా వెళ్లి ఆయిల్ పామ్ సాగు వల్ల కలిగే లాభాలను వివరిస్తూ లక్ష్యాల సాధనకు కృషి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. లాభదాయక పంటల దిశగా రైతులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ఆయిల్ పామ్ సాగు విస్తరణ లక్ష్యంగా పనిచేస్తుందని కలెక్టర్ అన్నారు. ఆయిల్ పామ్ సాగు చేసే రైతులకు మొక్కల దగ్గర నుంచి డ్రిప్ ఇరిగేషన్, అంతర్ పంటల సాగు ప్రతి అంశంలో ప్రభుత్వం సహకరిస్తూ సబ్సిడీలు అందిస్తుందని కలెక్టర్ తెలిపారు. ఆయిల్ పామ్ సాగుకు ప్రభుత్వం వివిధ దశలలో అందిస్తున్న సబ్సిడీలు, ఆయిల్ పామ్ సాగు వల్ల 3 సంవత్సరాల తరువాత వచ్చే భారీ రాబడి తదితర అంశాలను రైతులకు వివరిస్తూ నవంబర్ నాటికి పెద్దపల్లి జిల్లాలో మరో 1500 ఎకరాలలో రాబోయే రబ్బీ సీజన్ లో ఆయిల్ పామ్ సాగు జరిగేలా వ్యవసాయ అధికారులు పనిచేయాలని కలెక్టర్ ఆదేశించారు.ఖరీఫ్ మార్కెటింగ్ సీజన్ సంబంధించి ధాన్యం కొనుగోలు ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం సన్నద్ధం కావాలని అన్నారు. సన్న ధాన్యం కొనుగోలుకు సంబంధించి ప్రభుత్వ మార్గదర్శకాలను పాటించాలని, దీనిపై వ్యవసాయ అధికారులు సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలని కలెక్టర్ తెలిపారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వచ్చే షెడ్యూల్ ప్రకారం కొనుగోలు చేసేందుకు ప్రాణాలకు రూపొందించుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఆది రెడ్డి, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## స్వతంత్ర అభ్యర్థిగానైనా పోటీ చేస్తా

- ట్రస్మా రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు, ఎమ్మెల్సీ శేఖర్ రావు

**కరీంనగర్ టౌన్, సెప్టెంబర్ 24 (మనం న్యూస్):** గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా స్వతంత్రంగా నైనా పోటీలో ఉంటానని యాదగిరి శేఖర్ రావు తెలిపారు. కరీంనగర్ జిల్లా కేంద్రంలోని పద్మనాయక కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన ప్రైవేట్ ఉపాధ్యాయుల సన్మాన సమ్మేళన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ట్రస్మ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు యాదగిరి శేఖర్ రావు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. విద్యను అందించడంలో తమవంతు బాధ్యతను నిర్వర్తిస్తూ అనేక బడ్జెట్ పాఠశాలలు నిరంతర కృషి చేస్తున్నాయని, ఎలాంటి ఆధారం లేని అనేకమంది గ్రాడ్యుయేట్స్ కి ఉపాధి కల్పించడంలో ప్రైవేట్ పాఠశాలలు ప్రధాన పాత్ర పోషిస్తున్నాయని వివరించారు. వీరికి హెల్త్ కారడ్స్ తో పాటు హెల్త్ ఇన్సూరెన్స్ 10 లక్షల వరకు కేంద్ర ప్రభుత్వం సంరక్షణ చట్టం చేయాలని, ఈ ఎస్ఐ, విద్యా సుంకం, విద్యాసంఖం ద్వారా ప్రీమియం కట్టాలని ఈ సౌకర్యాలను ప్రభుత్వాలు కల్పించాలని, సీనియారిటీ ఉన్న ఉపాధ్యాయులకు పెన్షన్ సౌకర్యం కల్పించాలని కోరారు. ప్రస్తుతం సమాజానికి శాసనసభల కి రాజ్యసభలకు ఉన్నత విలువలతో కూడినటువంటి గ్రాడ్యుయేట్స్ రావాలి అని అలా వచ్చి నిలబడిన వారికి అందరూ ప్రోత్సహించాలని తెలియజేశారు. అనంతరం ఆల్ ఇండియా ప్రిన్సిపల్స్ అండ్ లీడర్స్ అసోసియేషన్ ఫౌండర్ అండ్ సెక్రెటరీ డాక్టర్ ఏ జోష్ణ రావు మాట్లాడుతూ ప్రైవేటు ఉపాధ్యాయుని ఉపాధ్యాయులకు విధివిధానాలు క్రమశిక్షణ నర్సరీ నుండి ఉండే చిన్నారి పిల్లలకు ఓపికతో కూడినటువంటి విద్యను అందించడంలో ప్రైవేట్ స్కూళ్లలో కోకొల్లలుగా ఉన్నారని తెలియజేశారు. వారి అసోసియేషన్ ద్వారా ప్రాథమిక స్థాయి నుంచి ఉన్నత స్థాయి వరకు చదువుకునే విద్యార్థిని విద్యార్థులకు ప్రోత్సాహకు బహుమతులు అందిస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ శివరాత్రి యాదగిరి, సిరిసిల్ల అధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్, కరీంనగర్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ముసుకు తిరుపతిరెడ్డి పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు కేశవరెడ్డి, జగిత్యాల జిల్లా అధ్యక్షుడు శ్రీధర్, మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు సిద్దయ్య, సిద్దిపేట జిల్లా అధ్యక్షులు మాజీ అధ్యక్షులు సుభాష్మ,13 జిల్లాల అధ్యక్ష కార్యదర్శులు కరీంనగర్,మెదక్,ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లా నుంచి కరస్పాండెంట్లు,వివిధ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# పంచాయతీ విధులను పకడ్బందీగా నిర్వహించాలి



- సీజనల్ వ్యాధుల పట్ల అధికారులు అప్రమత్తంగా ఉండాలి
- స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు ప్రణాళికాబద్ధంగా చర్యలు
- స్థానిక సంస్థల ఎన్నికలు, సీజనల్ వ్యాధులు, ఎల్.ఆర్.ఎస్, స్వచ్ఛదనం పచ్చదనం తదితర అంశాలపై సంబంధిత అధికారులతో రివ్యూ నిర్వహించిన జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష

**పెద్దపల్లి, సెప్టెంబర్ 24(మనం ప్రతినిధి) :** పంచాయతీ పరిధిలో ఉన్న విధులను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు.మంగళవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సమీకృత జిల్లా కలెక్టరేట్ లో స్థానిక సంస్థల ఎన్నికలు, సీజనల్ వ్యాధులు, ఎల్.ఆర్.ఎస్, స్వచ్ఛదనం -పచ్చదనం తదితర అంశాల పై స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జే.అరుణ శ్రీ తో కలిసి సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. సీజనల్ వ్యాధుల నమోదవుతున్న ప్రాంతాలు, వాటి నియంత్రణకు తీసుకున్న చర్యలు, స్థానిక సంస్థల ఎన్నికల కోసం ఓటర్ జాబితా రూపకల్పన, ఎల్.ఆర్.ఎస్ వెరిఫికేషన్ , స్వచ్ఛదనం -పచ్చదనం కార్యక్రమ అమలు అంశాలను అధికారులు జిల్లా కలెక్టర్ కు వివరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ, గ్రామ పంచాయతీ ఎన్నికలకు సంబంధించి వార్డుల వారీగా తుది ఓటరు జాబితా రూపకల్పన పకడ్బందీగా చేపట్టాలని అన్నారు. డ్రాఫ్ట్ ఓటరు జాబితా పై వచ్చిన ఫిర్యాదులను పూర్తి స్థాయిలో పరిష్కరించాలని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించాలని కలెక్టర్ సూచించారు. ఒక కుటుంబానికి సంబంధించిన ఓట్లు ఒకే వార్డు పరిధిలోకి వచ్చేలా చూడాలని అన్నారు. ఓటర్ జాబితా రూపకల్పనలో వస్తున్న ఇబ్బందులు, సమస్యలను మండలాల వారిగా తెలుసుకున్న కలెక్టర్ వాటి పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు పలు సూచనలు చేశారు. ఎల్.ఆర్.ఎస్ దరఖాస్తులకు సంబంధించి క్షేత్ర స్థాయి పరిశీలన, ధృవీకరణ అర్హుల ఎంపిక, రుసుము చెల్లింపు మొదలగు వివరాలను మండలాల వారీగా అడిగి తెలుసుకున్న కలెక్టర్ పెండింగ్ ఎల్.ఆర్.ఎస్ దరఖాస్తుల పరిష్కారానికి ప్రత్యేక శ్రద్ధ వహించాలని కలెక్టర్ సూచించారు. గ్రామాలలో ఉన్న సెగ్రిగేషన్ షెడ్ ను పూర్తి స్థాయిలో వినియోగించుకోవాలని అన్నారు. పారిశుధ్య నిర్వహణ పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని కలెక్టర్ ఆదేశించారు. పారిశుధ్య నిర్వహణను ఎంపిఓ లు నిరంతరం పర్యవేక్షించాలని కలెక్టర్ సూచించారు. పంచాయతీలలో పన్నుల వసూలు పూర్తి చేయాలని కలెక్టర్ తెలిపారు. పంచాయతీ విధులకు సంబంధించి పంచాయతీ కార్యదర్శులు, ఎంపీడీవోలు, మండల పంచాయతీ అధికారులు షెడ్యూల్, వారి పని తీరు వేదిక వివరాలు ఎప్పటికప్పుడు అందజేయాలని కలెక్టర్ సూచించారు. సీజనల్ వ్యాధులకు సంబంధించి జిల్లా వ్యాప్తంగా నమోదు అవుతున్న వైరల్ జ్వరాలు, టైఫాయిడ్, మలేరియా, డెంగ్యూ, చికెన్ గునియా జ్వరాలు వివరాలను జిల్లా వైద్యంలో శాఖ అధికారి ద్వారా కలెక్టర్ తెలుసుకున్నారు. రాబోయే నెల రోజుల పాటు డెంగ్యూ కేసులు, సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఫీవర్ సర్వే వివరాలు పంచాయతీ కార్యదర్శులకు, స్థానిక సంస్థల అధికారులకు తెలియజేయాలని, అధికంగా జ్వరాలు నమోదు అవుతున్న ప్రాంతాల్లో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు ఫాగ్గింగ్, పరిసరాలను శుభ్రం చేయడం, నిల్వ నీరు లేకుండా చేయడం వంటి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. గ్రామాలలో ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేయాలని కలెక్టర్ అన్నారు. గ్రామాలలో ఫాగ్గింగ్ సంపూర్ణంగా నిర్వహించాలని అన్నారు. ఫీవర్ కేసులు ఎక్కువ అయ్యే ప్రాంతాల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించాలని కలెక్టర్ తెలిపారు. ఫీవర్ కేసులు ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. స్వచ్ఛదనం పచ్చదనం కింద గ్రామాలలో పారిశుద్ధ్యం, పరిశుభ్రత, మొక్కల సంరక్షణ మొదలగు పనులు నిరంతరాయంగా కొనసాగాలని కలెక్టర్ పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య శాఖ అధికారి డాక్టర్ ప్రమోద్ కుమార్ , జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి రవీందర్, జిల్లా పంచాయతీ అధికారి, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఇన్ సర్వీస్ కోటాలో నిబంధనలను అమలు చేయండి

- వారిని తెలంగాణ స్థానికులుగా గుర్తించండి
- మంత్రి దామోదర రాజనర్సింహ కు వైదుల విజ్ఞప్తి..

**హైదరాబాద్, సెప్టెంబర్ 24 (మనం న్యూస్):** ఇన్ సర్వీస్ కోటకు సంబంధించిన అన్ని సీట్లను ఇన్ సర్వీస్ డాక్టర్లే సంపూర్ణంగా వాడుకునేలా నిబంధనలను అమలు చేయాలని తెలంగాణ పబ్లిక్ హెల్త్ డాక్టర్స్ అసోసియేషన్ ప్రతినిధులు ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనరసింహను కోరారు సోమవారం తెలంగాణ పబ్లిక్ హెల్త్ డాక్టర్స్ అసోసియేషన్ ఫౌండర్ ప్రసిడెంట్ కత్తి జనార్ధన్ నేతృత్వం లోని వైద్యుల బృందం మంత్రిని కలిసింది. ఈ సందర్భంగా కత్తి జనార్ధన్ పలు అంశాలను మంత్రి దృష్టి కి తీసుకొచ్చారు. తెలంగాణ స్థానికత కలిగి ఆంధ్రాలో, ఇతర రాష్ట్రాలతో పాటు విదేశాల్లో ఎంబిబిఎస్ పూర్తి చేసిన తెలంగాణ ఇన్ సర్వీస్ వైద్యులకు పీజీ అడ్మిషన్స్ లో తెలంగాణ స్థానికులుగా పరిగణించాలని కోరారు. పీఎచ్సి ల్లో పని చేస్తున్న మెడికల్ ఆఫీసర్స్ కి వెహికల్ అలవెన్స్ మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు.



# పరిసరాల పరిశుభ్రతతోనే వ్యాధుల నియంత్రణ



**జమ్మికుంట,సెప్టెంబర్ 24 (మనం న్యూస్) :** పరిసరాల పరిశుభ్రతతోనే వ్యాధులు నియంత్రణలో ఉంటాయని డాక్టర్ చందన అన్నారు. వావిలాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో అర్బన్ ఏరియాలోని జమ్మికుంట -1 సబ్ సెంటర్ పరిధిలో లోని ఎంప్లాయిస్ కాలనీలోని 27 వ వార్డ్ లో డాక్టర్ చందన ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో 45 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. 5 గురు జ్వర పీడితులను గుర్తించి వారి రక్త నమూనాలను సేకరించి వ్యాధినిర్ధారణ కొరకు ల్యాబ్ కి పంపించడం జరిగినది. వ్యక్తి గత పరిశుభ్రత పరిసరాల పరిశుభ్రత పై అవగాహన కల్పించారు. వైద్య శిబిరాన్ని హుజురాబాద్ డిప్యూటీ డి ఎం హెచ్ వో డాక్టర్ చందు పరిశీలించారు. ఈ వైద్య శిబిరంలో డాక్టర్ చందన, సూపర్ వైజర్ రత్నకుమారి, డిస్ట్రిక్ట్ హెల్త్ ఎడ్యుకేటర్ పంజాల ప్రతాప్, హెల్త్ అసిస్టెంట్ నరేందర్, ఏఎన్ఎంలు సజీదా పర్వీన, రాధ ఆశాకార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

## ఎన్ఎస్ఎస్‌తో దేశ భక్తి

**లక్షెట్టిపేట, సెప్టెంబర్ 24(మనం న్యూస్) :** విద్యార్థి దశ నుంచే సేవాగుణం అలవర్చుకోవాలని ప్రభుత్వ మోడల్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సంతోష్ మహాత్మా అన్నారు. మంగళవారం స్థానిక డిగ్రీ కళాశాలలో నిర్వహించిన జాతీయ సేవా పథకం (ఎన్ ఎస్ ఎస్ )దినోత్సవాన్ని పురస్కరించుకొని మాట్లాడారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్యాభ్యాసంతో సంఘ సేవ, దేశ సేవ అనేవి ఎంతో ముఖ్యమెనవన్నారు.ప్రతి దేశ పురోభివృద్ధిలో విద్యార్థులు పాలుపంచుకుంటారని వివరించారు.కళాశాలలో విద్యాభ్యాసానికి ఆటంకాలు లేకుండా సంఘసేవ అవకాశాలను ఎన్ ఎస్ ఎస్ ద్వారా కల్పిస్తున్నాయన్నారు. సేవాభావం, దేశభక్తి, సామాజిక స్పృహను కలిగించేందుకు 'జాతీయ సేవా పథకం' (ఎన్ఎస్ఎస్) ప్రారంభమైందని తెలిపారు. నిరుపేదల కష్ట సుఖాలలో పాలు పంచుకుంటూ, సమాజ సేవ చేసే లక్ష్యంతో గాంధీజీ శత జయంతి సందర్భంగా 1969 సెప్టెంబర్ 24వ తేదీన ఈ పథకాన్ని దేశ వ్యాప్తంగా మొదలు పెట్టారని విద్యార్థులకు గుర్తు చేశారు. అప్పటి విశ్వ విద్యాలయాల నిధుల సంఘం (యూజీసీ) చైర్మన్ రాధాకృష్ణన్ జాతీయ సేవా పథకాన్ని విద్యా సంస్థలలో ప్రారంభించాలని సూచించనట్లు వివరించారు. ప్రతి విద్యార్థి ఎన్ఎస్ఎస్ లో భాగస్వాములు కావాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, సిబ్బంది,విద్యార్థులు పాల్గొన్నారు.

మనం




## కాళేశ్వరంలో ప్రత్యేక కమిషనర్ పూజలు



**కాళేశ్వరం,సెప్టెంబర్ 24(మనం న్యూస్) :** కాళేశ్వరం క్షేత్ర అభివృద్ధి కోసం మంత్రి శ్రీధర్ బాబు ఆదేశాలతో సుమారు140 కోట్ల నిధులతో చేపట్టనున్న పనులతో పాటు, వచ్చే సంవత్సరం నిర్వహించనున్న సరస్వతీ నది పుష్కరాల ఏర్పాట్లపై సమీక్ష చేందుకు కాళేశ్వరం చేరుకున్న సీనియర్ ఐఏఎస్ అధికారిణి, దేవాదాయ శాఖ ప్రత్యేక కమిషనర్ శైలజా రామయ్యర్ మొదటగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయానికి చేరుకున్న ఆమెకు ఆలయ పూజారులు వేద మంత్రాలతో పూర్ణ కుంభ స్వాగతం పలికారు. ప్రధాన ఆలయంలో అభిషేకాలు చేసిన అనంతరం శుభనందా దేవి ఆలయంలో అర్చన నిర్వహించారు. అనంతరం అర్చక స్వాములు స్వామి వారి తీర్థ ప్రసాదాలు , శేష వస్త్రాలు అందజేశారు, అమెవెంట దేవాదాయశాఖ కమిషనర్ హనుమంతరావు, జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ,తదితరులు ఉన్నారు.

## పడకేసిన పారిశుధ్యం



**మహా ముత్తారం, సెప్టెంబర్ 24 (మనం న్యూస్) :** గ్రామా లలో సమస్యలు పేరుకు పోతున్నాయని గ్రామాల్లో పారిశుధ్య పను లు నత్తనడకన సాగుతున్నాయని ప్రజా పాలన ప్రభుత్వంలో గ్రామీ ణ ప్రాంతాలను అభివృద్ధి పథంలో ముందు ఉండాలని ప్రభుత్వం ఓ పక్క చెబుతుంటే మారుమూల ప్రాంతమైన మహాముత్తారం మండలంలోని గ్రామాల్లో పారిశుధ్య పనులు నత్త నడక నడవడంతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. విస్తారంగా కురిసిన వర్షాలు తగ్గుముఖం పట్టడంతో గ్రామాలలో ఎక్కడి నీరు అక్కడే నిల్వ ఉండడంతో గుంతలలో ఆగిన మురుగు నీటిలో దోమలు ఈగలు చేరి వాటి వలన ప్రజలు విష జ్వరాలకు గురవుతున్నారని కనీసం గ్రామాలలో బ్లీచింగ్ పౌడర్ వీధుల్లో చల్లే వారే కరువ య్యారని ప్రజలు అనారోగ్య పాలవుతున్నామని ఇప్పటికైనా గ్రా మపంచాయతీ అధికారులు పై అధికారులు స్పందించి మండ లంలోని మారుమూల గ్రామాల్లో పారిశుధ్య పనులు జరిగేలా చూడాలని గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహించి ప్రజలు అనారో గ్య బారిన పడకుండా చూడాలని మండలంలోని ప్రజలు కోరుకుం టున్నారు. ప్రభుత్వం అధికారులు స్పందించి గ్రామాలలో మురు గునీరు రోడ్డుపై నిలువ ఉండకుండా చూడాలని గ్రామపంచాయతీ అధికారులను మరియు పై అధికారులను వేడుకుంటున్నారు.

## తల్లిపాలు బిడ్డకు శ్రేయస్కరం

- సిడిపిఓ రాధికా రెడ్డి



**మహాదేవపూర్, సెప్టెంబర్ 24,(మనం న్యూస్) :** పుట్టిన బిడ్డకు తల్లి పాలే శ్రేయస్కర మని ఐ సి డి ఎస్ మహాదేవపూర్ ప్రాజెక్టు అధికారిని ఐత రాధికా రెడ్డి అన్నారు,మంగళవారం మండల కేంద్రంలో గ్రామ పంచాయతీ ఎవరణలో పోషణ్ మహా కార్యక్రమం నిర్వహించారు, ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణీ లు బాలింతలు, కిషోర బాలికలు రక్త హీనత పడకుండా పోషక ఆహారాలు ఆకుకూరలు పాలు పండ్లు చిరు ధాన్యలు తీసుకోవాలని సూచించారు. అప్పుడే పుట్టిన శిశువుకు ముర్రు పాలు పట్టించాలని ఆరు నెలల వరకు బిడ్డకు తల్లి పాలు మాత్రమే పట్టించాలని అన్నారు. ఆతరువాత నుండి తల్లి పాలతో పాటు అనుబంధ ఆహారం అందించాలని సూచించారు.ప్రతినెలా పిల్లల బరువు హేచ్చు తగ్గులు చూసుకోవాలని బరువు లేని పిల్లలకు పోషక విలువలతో కూడిన ఆహారం అందించాలని తెలిపారు.పిల్లందరిని అంగన్వాడీ కేంద్రాలకు పంపాలని సి డి పి ఓ కోరారు.పిల్లలకు ఆట పాట కథలు శాస్త్రీయ పరిజ్ఞానం తో చదువు నేర్పిస్తామని అన్నారు.గర్భిణీ లకు శ్రీమంతాలు, 3సంవత్సరాలు దాటినా పిల్లలకు అక్షరాభ్యాసంచేశారు, ఈ కార్యక్రమం లో సూపర్వైజర్లు ఎం నాగరాణి, బి రమాదేవి, జె వీణ, పోషణ్ అభియాన్ స్వప్న, గ్రామ పంచాయతీ కార్యదర్శి కల్పన, ఎం ఎస్ కే అనూష, మమత, ఐ సి డి ఎస్ సిబ్బంది వెంకట స్వామి, అంగన్వాడీ టీచర్లు పిల్ల తల్లులు తదితరులు పాల్గొన్నారు.

## రాజీ మార్గమే రాజ మార్గం

- లోక్ అదాలత్‌లో పెద్ద ఎత్తున కేసుల పరిష్కారం చేసుకోవాలి
- జిల్లా ప్రధాన న్యాయమూర్తి, న్యాయసేవాధికార సంస్థ చైర్మన్ నారాయణ బాబు

**భూపాలపల్లి, సెప్టెంబర్ 24(మనం న్యూస్) :** రాజీ మార్గమే రాజా మార్గమని కక్షి దారులు లోక్ అదాలత్ లో తమ తమ కేసులను రాజీ చేసుకోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ,న్యాయ సేవాదికార సంస్థ చైర్మన్ నారాయణ బాబు సూచించారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో జిల్లాలోని కోర్టు ప్రాంగణాల్లో సెప్టెంబర్ ఇరవై ఎనిమిదవ తారీఖున నిర్వహించబోయే జాతీయ లోక్ అదాలత్ లో పెద్ద ఎత్తున కేసులను పరిష్కారం చేసుకోవాలని సూచనలు చేశారు. జడ్జి మాట్లాడుతూ ప్రజలు ద్వేష భావాలను తగ్గించుకొని రాజి మార్గాన్ని అలవాటు చేసుకోవాలన్నారు. రాజి మార్గమే రాజా మార్గం అని మనసులో నాటుకోవాలని తెలిపారు, దాంతో విలువైన సమయం, డబ్బు దుర్వినియోగం కాదని అన్నారు. చిన్న చిన్న సమస్యలను పెద్దవి చేసుకొని పంతాలకు పోయి కేసుల్లో ఇరికితే పోలిసు స్టేషన్లు, కోర్టులకు ఎక్కితే నష్టమే తప్ప లాభం ఉండదని జడ్జి అన్నారు.వివిధ కేసుల్లోని కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జడ్జి పేర్కొన్నారు.

# నిమజ్జనంతోనే ముగియలేదు

- వ్యర్థాలు తొలగించినపుడే పరిపూర్ణత
- పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి
- గాంధీజీ సూత్రాలను పాటించాలి
- చదువు, క్రీడల్లో రాణించాలి
- ప్రతిభ కనబరిస్తే పారితోషికం
- రాష్ట్ర రవాణా, బీ.సీ.సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్

**హుస్నాబాద్,సెప్టెంబర్ 24,(మనం న్యూస్):** గణేష్ ఉత్సవాలు నిమజ్జనంతోనే ముగియలేదని...ఏ చెరువులలో గణేష్ విగ్రహాలను నిమజ్జనం చేసినామో ఆ వ్యర్థాలను తొలగించినపుడే గణేష్ ఉత్సవాలకు పరిపూర్ణత లభిస్తుందని రాష్ట్ర రవాణా, బీ.సీ.సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ అన్నారు. పట్టణ కేంద్రంలోని ఎల్లమ్మ చెరువు వద్ద మంగళవారం స్వచ్ఛత హి సేవ 2024 కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ హాజరైనారు. ఈ సందర్భంగా ఎల్లమ్మ చెరువు వద్ద గణేష్ నిమజ్జనం తర్వాత ఉన్న వ్యర్థాలను స్వయంగా మంత్రి పొన్నం పారలతో ఎత్తి ట్రాక్టర్‌లో పోసారు. ఆనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా గణేష్ నవరాత్రి వేడుకలు భక్తి, శ్రద్ధలతో అత్యుత్సాహంగా ఘనంగా జరుపుకున్నాం అన్నారు. నవరాత్రుల తర్వాత ఊరేగింపులుగా నిమజ్జనం జరిగిందన్నారు. నిమజ్జనంతోనే కార్యక్రమం ముగియలేదని...నిమజ్జనం తర్వాత మనం ఏ చెరువులో గణేష్‌లను వేసినామో ఆ వ్యర్థాలను తొలగించినపుడే గణేష్ ఉత్సవాలకు పరిపూర్ణత వస్తుందన్నారు. తెలంగాణ వ్యాప్తంగా గణేష్ నిర్వాహకులు గణేష్ ఉత్సవాల్లో క్రియాశీలకంగా ఉన్నవారు స్వచ్ఛ భారత్, స్వచ్ఛ తెలంగాణలో మీ వాడ మీ ఊరులలో బాగుండే విధంగా మీరే స్వయంగా పూనుకుని జలాశయాల్లో గణేష్ నిమజ్జనం జరిగిన దగ్గర వ్యర్థాలు తొలగించాలన్నారు. సీజనల్ వ్యాధులు రాకుండా ఉండటానికి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. అందరూ స్వచ్ఛత హి సేవాలో పాల్గొని గాంధీజీ ఇచ్చిన సూత్రాలను పాటించాలన్నారు. హుస్నాబాద్‌ను స్వచ్ఛ హుస్నాబాద్‌గా మార్చేందుకు మున్సిపల్ సిబ్బంది పని చేస్తున్నారని తెలిపారు. స్వచ్ఛతలో ప్రతి ఒక్కరూ పాల్గొని స్వచ్ఛ హుస్నాబాద్‌గా తీర్చిదిద్దుకుందాం అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో రామ్మూర్తి, తహసీల్దార్ రవీందర్‌రెడ్డి, మున్సిపల్ కమీషనర్ మల్లికార్జున్, మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత, వైస్ చైర్‌పర్సన్ అయిలేని అనితారెడ్డి, సింగిల్ విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, కౌన్సిలర్‌లు భూక్య సరోజన, చిత్తారి పద్మ, వల్లపు రాజు, మ్యాదరబోయిన శ్రీనివాస్, బోజు రమాదేవి, పిసిసి మెంబర్ కేడం లింగమూర్తి, డిసిసి కార్యదర్శి చిత్తారి రవీందర్, పట్టణ మాజీ అధ్యక్షుడు డా.అక్కు శ్రీనివాస్, నాయకులు పున్న సది, సావుల వెంకట్, ముత్యాల సంజీవరెడ్డి, రవీందర్‌రెడ్డి, పెసరు సాంబరాజు, వెన్న రాజు, బూరుగు కిష్టస్వామి, ఎం.డీ.హసన్, తదితరులున్నారు.







### విద్యార్థులు చదువు, క్రీడల్లో రాణించాలి

విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ అన్నారు. పట్టణ కేంద్రంలోని స్టేడియాన్ని సందర్శించారు. హుస్నాబాద్ క్రీడల అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యల పై క్రీడాకారులు, పీఈటీల నుండి సలహాలు సూచనలు స్వీకరించారు. స్టేడియంలో కబడ్డీ కోర్టును ప్రారంభించి మ్యాచ్‌ను తిలకించారు. ఆనంతరం క్రీడాకారులతో కలిసి మంత్రి పొన్నం బ్యాడ్మింటన్ ఆడి క్రీడాకారుల్లో ఉత్సాహన్ని నింపారు. క్రీడాకారులతో స్వచ్ఛత హీ సేవా ప్రతిజ్ఞ చేపించారు. ప్రతి ఇంటి చుట్టూ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు క్రీడల్లో రాష్ట్ర, దేశ స్థాయిలో మంచి ప్రతిభ కనబరిస్తే వారికి మంచి పారితోషికం అందజేస్తాను అన్నారు. ఆనంతరం బాస్కెట్ బాల్ కోర్టులో కూర్చోని క్రీడాకారులతో ముచ్చటించారు. క్రీడాకారుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

### మోడల్ స్కూల్ సందర్శన.....

పట్టణ కేంద్రంలోని మోడల్ స్కూల్‌ను మంత్రి పొన్నం సందర్శించారు. విద్యార్థులతో ముచ్చటించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మోడల్ స్కూల్ ఇంకా అవసరమైన మౌళిక వసతులు కల్పిస్తామని హామీ ఇచ్చారు. బాగా చదువుకుని హుస్నాబాద్‌కు మంచి పేరు తీసుకు రావాలని సూచించారు. పదవ తరగతిలో రాష్ట్రంలోనే హుస్నాబాద్ ప్రథమ స్థానంలో ఉండాలని ఆకాంక్షించారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల రోడ్డును, ప్రాంగణాన్ని పరిశీలించారు. వర్షానికి డిగ్రీ కళాశాల భవనం ముంపుకు గురవుతుండటంతో తీసుకోవాల్సిన చర్యల పై అధికారులతో చర్చించారు. గిరిజన బాలికల వసతి గృహన్ని సందర్శించి సమస్యలను తెలుసుకున్నారు. హాస్టల్‌కు కాంపౌండ్ కావాలని విద్యార్థులు మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. త్వరలోనే సమస్య పరిష్కారం చేస్తామని హామీ ఇచ్చారు.

# ఆలయ అభివృద్ధికి మాస్టర్ ప్లాన్



**భూపాలపల్లి , కాళేశ్వరం, సెప్టెంబర్ 24 (మనం న్యూస్) :** కాళేశ్వరం దేవాలయ అభివృద్ధికి మాస్టర్ ప్లాన్ తయారు చేయాలని రాష్ట్ర దేవాదాయశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్ అన్నారు. మంగళవారం కాళేశ్వరం కార్యనిర్వహణాధి కార్యాలయంలో దేవాలయ అభివృద్ధికి మాస్టర్ ప్లాన్ తయారు చేయుట, పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేయుట, సరస్వతి పుష్కరాలు నిర్వహణకు ఏర్పాట్లు తదితర అంశాలపై దేవాదాయ, పర్యాటక శాఖ అధికారులతో సమీక్షా సమవేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ సెక్రటరీ మాట్లాడుతూ కాళేశ్వరం దేవాలయం తెలంగాణలోని ప్రముఖ శైవ క్షేత్రమని, ఈ దేవాలయం అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక మాస్టర్ ప్లాన్ రూపొందించన్నట్లు తెలిపారు. ఈ ప్రణాళికలో దేవాలయం అభివృద్ధికి సంబంధించిన వివిధ అంశాలను పొందుపరిచాలని అన్నారు. ప్రధానంగా దేవాలయ విస్తరణ, ఆలయ ప్రాంగణాన్ని విస్తరించడం, పునర్నిర్మాణం మరియు ఆధునీకరణ చేయడం, యాత్రికుల సదుపాయాలు కల్పన, యాత్రికుల కోసం ఆవాస సదుపాయాలు, భోజనశాలలు, పార్కింగ్ స్థలాలు, సురక్షితమైన నీటి సదుపాయాలను ఏర్పాటు చేయడం లక్ష్యంగా ప్రణాళికలు సిద్ధం చేయాలని అన్నారు. పర్యాటకులను ఆకర్షించే విధంగా ఆలయ పరిసర ప్రాంతాలను అభివృద్ధి చేయడం, ప్రత్యేక ప్యాకేజీలు అందుబాటులో ఉంచడం, పరిసరాల అభివృద్ధి, ఆలయ పరిసరాల్లో పచ్చదనం పెంపొందించడం, పారిశుధ్య , ప్రకృతి సంరక్షణ చర్యలను చేపట్టాలని తెలిపారు. అభివృద్ధి చర్యలు ప్రవేశ ద్వారం, దేవాలయ ప్రధాన ద్వారాన్ని శిల్ప కళతో అందంగా నిర్మించడం, యాత్రికుల సౌకర్యార్థం విస్తారమైన మండపాల నిర్మాణం, గోదావరి ఘాట్ అభివృద్ధి, గోదావరి నది తీరాన్ని శుభ్రతతో, అందంగా అభివృద్ధి చేయడం, స్నాన ఘాట్లను ఏర్పాటు చేయడం వంటివి చేపట్టనున్నట్లు తెలిపారు. భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక ఆవాసాల ఏర్పాటు, స్నాన సదుపాయాలు, దేవాలయానికి సులభంగా చేరుకునే రహదారులను అభివృద్ధి చేయడం, వాహనాల పార్కింగ్ సౌకర్యం కల్పించాలన్నారు. దేవాలయం చుట్టూ పర్యాటక మార్గాలను అభివృద్ధి చేయడం, స్థానిక సాంస్కృతిక ప్రదర్శనలు, మ్యూజియంలు ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. భద్రతను పెంచేందుకు ఆలయ పరిసరాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటుతో రెవెన్యూ, పోలీస్, పంచాయతి రాజ్, దేవాదాయ, పర్యాటక శాఖల అధికారులతో టాస్క్ ఫోర్స్ టీము ఏర్పాటు చేయాలని ఆదేశించారు. దేవాలయ అభివృద్ధికి ప్రత్యేకంగా మంజూరైన నిధులతో చేపట్టిన పనులు పూర్తి చేయుటకు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ కు సూచించారు. కాళేశ్వరం దేవాలయాన్ని అభివృద్ధి చేయడం ద్వారా భక్తులు పెద్ద సంఖ్యలో వస్తారని తద్వారా ప్రసిద్ధి చెందిన పుణ్య క్షేత్రం ఎంతో అభివృద్ధి చెంది భక్తులతో విరాజిల్లుతుందని అన్నారు. భక్తులకు ఉత్తమ సేవలను అందించడం, పర్యాటకుల సంఖ్యను పెంచడం ఈ మాస్టర్ ప్లాన్ యొక్క ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. గోదావరి వద్ద నిర్మించిన సులబ్ కాంప్లెక్స్ నుండి వ్యర్థాలు గోదావరిలో కలుపుతున్నారని ప్రజలు తెలుపగా తక్షణం ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. అస్థికలు. గోదావరిలో కలిపేందుకు వివిధ ప్రాంతాల నుండి వచ్చే భక్తులకు దేవాలయ అధీనంలో ఉన్న రూములు ఇవ్వాలని, ఎందుకు ఇవ్వడం లేదని దేవస్థానం అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మళ్ళీ ఇలాంటి ఫిర్యాదులు వస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. భక్తుల ఆలోచన మేరకు అన్ని ఏర్పాట్లు చేయాలని భక్తులు మన అతిధులని స్పష్టం చేశారు. భక్తులు పరిశుభ్రతకు సహకరించాలని సూచించారు. స్నానాలు ఘాట్ వద్ద సురక్షిత మంచినీరు ఏర్పాట్లు చేయాలన్నారు.సమాచార పౌర సంబంధాలు, దేవాదాయశాఖ ప్రత్యేక కమిషనర్ హనుమంతరావు మాట్లాడుతూ భక్తులకు సౌకర్యాలు కల్పనలో రాజీ పడొద్దు అని తెలిపారు కాళేశ్వరం వచ్చే భక్తులు మహిళలు పురుషులు బట్టలు మార్చుకునేందుకు స్నానాలు గదులు ఏర్పాటు చేయాలని తెలిపారు ఎంతో ప్రాశాస్త్యం ఉన్నటువంటి కాపాడుకోవాల్సిన బాధ్యత భక్తుల పైన ఇటు అధికారులు పైన ఉందని తెలిపారు నిర్మాణంలో ఉన్న 100 గదుల నిర్మాణలను త్వరితగతిన పూర్తి చేయాలని ఆయన తెలిపారు ఎకో టూరిజం అభివృద్ధికి చర్యలు చేపట్టాలని సూచించారు మోడల్ గా ఉండే విధంగా మరుగుదొడ్ల నిర్మాణాలు చేపట్టాలని పేర్కొన్నారు దేవాలయాలకు ఒకే విధమైన రంగులు వేసేందుకు చర్యలు చేపట్టాలని రాష్ట్రవ్యాప్తంగా చర్యలు చేపట్టాలని ఆయన పేర్కొన్నారు కాళేశ్వరం త్రివేంగ దేవాలయాల్లో ఒకటని ఎంతో ప్రసిద్ధి చెందిన దేవాలయం అని ఆయన పేర్కొన్నారు. 2025లో జరుగనున్న సరస్వతి పుష్కరాలు నిర్వహణకు ఘాట్ సిద్ధం చేయాలని అన్నారు. గోదావరి హారతి కార్యక్రమాలను చేపట్టాలని అన్నారు. భక్తులు శని పూజలు చేసిన తదపరి బట్టలు గోదావరిలో వేస్తున్నారని, గోదావరి అపవిత్ర కాకుండా బట్టలు వేసేందుకు ప్రత్యేకంగా డ్రమ్ములు ఏర్పాటు చేయాలని దేవస్థానం అధికారులను ఆదేశించారు. అస్థికలు భద్రప్రచేందుకు ప్రత్యేకంగా లాకర్లు ఏర్పాటు చేయాలని తెలిపారు.జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ 19.39 కోట్ల ఎస్డిఎఫ్ నిధులతో చేపట్టిన పనుల్లో 12.07 కోట్ల విలువ గల పనులు పూర్తి అయ్యాయని మిగిలిన పనుల్లో భూసమస్య వల్ల 4 పనులు ఆగిపోయాయని,ఒక పని రద్దు జరిగిందని, 3 పనులు ప్రగతిలో ఉన్నాయని పనులు వేగవంతం చేసేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ సమావేశంలో కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, పర్యాటక శాఖ జనరల్ మేనేజర్ ఉపేందర్ రెడ్డి, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, దేవాదాయ శాఖ ఉప కమిషనర్ శ్రీనాథ రావు తదితరులు పాల్గొన్నారు.

## ప్రమాదపు అంచున కల్వర్ట్



**మహా ముత్తారం, సెప్టెంబర్ 24 (మనం న్యూస్) :** మండలంలోని మాదారం జీలపల్లి మధ్యలో ఉన్న కల్వర్ట్ కు ప్రమాదం పొంచి వుంది, నిత్యం అటువైపు వెళ్లే వాహన దారులు భయంతో కల్వర్ట్ దాటి పోతున్నారు,అటవీ నుండి వచ్చే వరదలకు కల్వర్ట్ కోతకు గురై దెబ్బతింది,కల్వర్ట్ అడుగు బాగున మట్టి కొట్టుకపోయి కల్వర్ట్ ఎప్పుడు కులుతుందోనని అటుగా వెల్లే వాహన దారులు భయందోళనకుగురవుతున్నారు.మాదారం నుండి పర్లపల్లి జీలపల్లివెళ్ళాలంటే అదే కల్వర్ట్ మీదుగా ప్రయాణించాలి జీలపల్లి లో వున్న రాజరాజేశ్వర స్వామి టెంపుల్ దర్శనానికి పలు ప్రాంతాల నుండి ప్రజలు అధిక సంఖ్యలో వస్తుంటారు.ప్రమాదం జరుగక ముందే సంబంధిత అధికారులు కల్వర్ట్ ను మారమ్మత్తులు చేపట్టాలని జీలపల్లి, పర్లపల్లి గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

## అంగన్‌వాడీ కేంద్రంలో ఘనంగా పోషణ మాసం



**మహా ముత్తారం,సెప్టెంబర్ 24 (మనం న్యూస్) :** మండలంలోని మాదారం గ్రామ అంగన్వాడి కేద్రంలో పోషణ మాసం కార్యక్రమం మంగళవారం నాడు ఘనంగా నిర్వ హించారు. ఈ సందర్భంగా అంగ న్వాడి కార్యకర్త సకినాల లత, మాట్లా డుతూ బాలింతలకు , బాల బాలికల కు పోషక విలువల గురించి వారు తీసుకోవలసిన ఆహారం, మిల్లెట్స్ చి రు ధాన్యాలు పప్పు దినుసులు ఆకుకూరలు పాలు పండ్లు బెల్లం ఆహారంలో ఉండాలని పరిశుభ్రత పాటించాలని సూచించారు. బాల్యవివాహాలు జరపరాదని 18 సంవత్సరాలు నిండిన తర్వాతనే వివాహము చేసుకోవాలని బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని తెలియజేశారు. అబ్బాయిలకు 21 సంవత్సరాలు నిండకుండా వివాహం చేసుకోకూడదని వారు చదువుపై శ్రద్ధ పెట్టాలని అలాగే యువత డ్రగ్స్ జోలికి పోకుండా తల్లిదండ్రులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఆడపిల్లల పట్ల సోదర భావంతో కలిగి ఉండాలని బాలురకు వారి తల్లిదండ్రులకు సూచించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ , ఆయమ్మ మంచినీళ్ల సరోజన, గ్రామ కార్యదర్శి కృష్ణవేణి, పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# విద్యార్థి దశ నుండే సేవా దృక్పథం అలవర్చుకోవాలి

**మహాదేవపూర్. సెప్టెంబర్ 24.(మనం న్యూస్) :** మండల కేంద్రం లోని ప్రభుత్వ డిగ్రీ, జూనియర్ కళాశాల లో జాతీయ సేవా పథకం ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ జన్ను విజయ్ కుమార్,జూనియర్ కళాశాలలో టి రమేష్ ఆధ్వర్యంలో ఎన్ ఎస్ ఎస్ పై అవగాహనా కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థి దశ నుండే సేవా ధృప్పదం అలవర్చుకోవాలని అన్నారు. ఏదైనా విపత్తులు సంబవించినప్పుడు ముందస్తుగా యువతే సహాయ సేవా కార్యక్రమాలు చేయాలని అన్నారు.1969సెప్టెంబర్ 24న జాతీయ సేవా పథకం ఏర్పడిందని మొదటగా సేవా పథకం యునివర్సిటీ కే పరిమితం చేశారని పట్టణ ప్రాంతాల్లో ని విద్యార్థులు గ్రామీణ ప్రాంతాల్లో పరిశుభ్రత పట్ల అవగాహన కలిగి ఉండేలనే ఉద్దేశం తో గ్రామాల్లో సామాజిక మార్పులు తీసుకరావాలనే సంకల్పం తో క్రింది స్థాయి కోర్సుల్లో కూడా ప్రవేశ పెట్టి అందులో ప్రజలందరిని ఆరోగ్యాకర్వమైనా వాతావరణం లో తీసుకరావన్నారు.ఈ కార్యక్రమం లో కళాశాలల అధ్యాపకులు డాక్టర్ డి శ్రీనివాస్. డాక్టర్ పి రాజు, డాక్టర్ మాధవి, రమేష్, రవీందర్, మాధురి, సల్లం రమ్య, ప్రసాద్, అబ్దుల్, సమ్మయ్య, సంధ్య, విద్యార్థులు పాల్గొన్నారు.





## శాంతి భద్రతల పరిరక్షణలో ఎస్సైలే కీలకం

- ఎస్పీ కిరణ్ ఖరే



**భూపాలపల్లి,సెప్టెంబర్ 24(మనం న్యూస్) :** సమాజంలో పోలీసు విధులు అ త్యంత బాధ్యతా యుతమయినవని, ఎస్ఐలు అంకితభావంతో పనిచేసినప్పుడే విధు లకు సార్ధకత లభిస్తుందని ఎస్పీ కిరణ్ ఖరే అన్నారు.మంగళవారం జిల్లా పోలీసు కా ర్యాలయంలో ఎస్సైలకు శిక్షణలో భాగంగా 11 పోలీస్ స్టేషన్‌లలో పని చేసేందుకు ఎస్పీ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా శిక్షణ లో ఉన్న ఎస్సైలు విధి నిర్వహ ణలో ప్రత్యేకత చాటుతూ శాంతి భద్రతల పరిరక్షణలో కీలకపాత్ర పోషించాలని ఎస్పీ కిరణ్ ఖరే దిశా నిర్దేశం చేశారు. ఎస్సైలుగా బాధ్యతలు నిర్వహించడం కత్తిమీద సా ములాంటిదని అన్నారు. శిక్షణలో చివరి ఘట్టంలో మండల స్థాయి ప్రజల మదిలో తమదైన ముద్ర వేయాలన్నారు. శాంతి భద్రతల పరిరక్షణ, మహిళా భద్రత, నేరాలు, దొంగతనాలు అరికట్టడం, సైబర్ నేరాల నియంత్రణ పోలీసుల లక్ష్యమని, జిల్లాలో డ్రగ్స్ నిర్మూలన పైన దృష్టి పెట్టాలని ఎస్పీ సూచించారు. ప్రజలు బాధితులు ఇచ్చిన ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని ఎస్సై లకు ఎస్పీ సూచించారు. ఉద్యోగంలో ఎ న్నో కఠిన పరిస్థితులు,సవాళ్లు ఉంటాయని వాటన్నింటిని సమర్థంగా ఎదుర్కోవాలని, నిజాయతీగా,అంకితభావంతో సేవలు అందించాలని ఎస్పీ కిరణ్ ఖరే పేర్కొన్నారు.

# ప్రజా అభివృద్ధి కార్యక్రమాలను త్వరగా, నాణ్యతతో పూర్తి చేయాలి

- రెవెన్యూ, హౌజింగ్, సమాచార పౌర సంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి
- ప్రైవేటు కబ్జాలో ఉన్న ప్రభుత్వ భూములను వెంటనే స్వాధీనం చేసుకోవాలి
- కేఆర్ ఫంక్షన్ హాల్ నుంచి స్కూల్ వరకు లింక్ రోడ్డు మంజూరు
- ఖమ్మం నగరంలో సీసీ రోడ్డు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన మంత్రి పొంగులేటి



**ఖమ్మం, సెప్టెంబర్ 24(మనం బ్యూరో):** ప్రజల అభివృద్ధి కోసం ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలను త్వరగా పూర్తి చేయాలని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు. ఖమ్మం మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలోని 1వ డివిజన్ కైకొండాయగూడెంలో టి.యు.ఎఫ్.ఐ.డి.సి నిధులు 195.00 లక్షలతో, 59వ డివిజన్ దానవాయిగూడెం లో 200.00 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులకు ఆయన మంగళవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా పొంగులేటి మాట్లాడుతూ...ప్రజల అభివృద్ధి, సంక్షేమం దిశగా ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన పని చేస్తుందని అన్నారు. అభివృద్ధిలో భాగంగా ఖమ్మం కార్పొరేషన్ లో రెండు కోట్ల నిధులతో 12 సిసి రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసుకున్నామని తెలిపారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తొలి నాళ్లలో కోటి 30 లక్షలకు డ్రైయిన్, కొన్ని రోడ్ల పనులు చేపట్టామని, అవి నేడు చివరి దశకు చేరుకున్నాయని మంత్రి అన్నారు. స్మశాన వాటిక నిర్మాణానికి నిధులను కూడా మంజూరు చేసుకున్నామని, టెండర్ పూర్తి చేశామని, త్వరలో ఆ పనులు పూర్తవుతాయని, వాటితో పాటు కేఆర్ ఫంక్షన్ హాల్ నుంచి స్కూల్ వరకు లింక్ రోడ్డు మంజూరు చేస్తామని మంత్రి పేర్కొన్నారు. శంకుస్థాపన చేసుకున్న సిసి రోడ్డు నిర్మాణ పనులను నాణ్యతతో 2 నెలల కాలంలో పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకుని రావాలని అధికారులను ఆదేశించారు. కబ్జాకు గురైన ప్రభుత్వ స్థలాలను ప్రభుత్వం తీసుకొని అర్హులైన పేదలకు పంచడం జరుగుతుందని అన్నారు. దేవాదాయ, రెవెన్యూ భూములకు సంబంధించి ఎవరు పోజిషన్ లో ఉన్నా యుద్ధప్రాతిపదికన రిటర్న్ తీసుకోవాలని మంత్రి రెవెన్యూ డివిజన్ అధికారిని ఆదేశించారు. అనంతరం మున్నేరు వరద ప్రభావిత ప్రాంతాలైన జలగం నగర్, రాజీవ్ గృహకల్ప, వికలాంగుల కాలనీ, కరుణగిరి ప్రాంతాలలో మంత్రి మోటార్ సైకిల్ పై వీధి వీధి పర్యటించారు. ఈ సందర్భంగా మంత్రి బాధితులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మున్నేరు వరద బాధితులను సంపూర్ణంగా ఆదుకుంటామని, వరదల వల్ల నష్టపోయిన ప్రతిఒక్కరికి పరిహారం అందజేస్తామని, ఆస్తి, పశు నష్టం జరిగిన వాటికి పరిహారాన్ని అందజేస్తామని అన్నారు. అధికారులు ముంపు ప్రాంతాల్లోనే సహాయక కేంద్రం, మీ సేవా కేంద్రాలు ఏర్పాటు చేసి, సర్టిఫికెట్లు కోల్పోయిన వారికీ అందజేస్తామన్నారు. ముంపు వల్ల అపరిశుభ్రమైన ప్రదేశాలను పూర్తి స్థాయిలో శుభ్రం చేయాలన్నారు. ముంపు ప్రాంతాల ప్రజలు ఎలాంటి ఆందోళన చెందవద్దని, అధికారులు మరోమారు సందర్శించి, నష్టపోయిన ప్రతిఒక్కరికి న్యాయం చేస్తారని మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఇరిగేషన్ అభివృద్ధి సంస్థ చైర్మన్ మువ్వా విజయ బాబు, ఖమ్మం నగరపాలక సంస్థ కమిషనర్ అభిషేక్ అగస్త్య, అదనపు కలెక్టర్ డి. మధుసూదన్ నాయక్, ఖమ్మం ఆర్డీవో జి. గణేష్, పబ్లిక్ హెల్త్ ఇఇ రంజిత్, మిషన్ భగీరథ ఇఇ పుష్పలత, మునిసిపల్ డిఇ ధరణి, ప్రజా ప్రతినిధులు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## ఓటర్ నమోదు కార్యక్రమం కట్టుదిట్టంగా నిర్వహించాలి

- రాష్ట్ర ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి
- జిల్లా కలెక్టర్ లతో వీడియో సమావేశంతో సమీక్షించిన సీఈఓ

**రాజన్న సిరిసిల్ల, సెప్టెంబర్ 24 (మనం న్యూస్):** రాష్ట్రంలో ఓటర్ నమోదు కార్యక్రమం కట్టుదిట్టంగా నిర్వహించాలని రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి తెలిపారు. మంగళవారం హైదరాబాద్ నుండి రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి, స్పెషల్ సమ్మరీ రివిజన్, ఈ.ఆర్.ఓ నెట్ 2.0 పై జిల్లాల కలెక్టర్ లతో వీడియో సమావేశం నిర్వహించి సమీక్షించారు. సమీకృత జిల్లా కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ ఈ వీడియో సమావేశంలో పాల్గొన్నారు. వీడియో కాన్ఫరెన్స్ లో రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి మాట్లాడుతూ గత వారం రోజులుగా నూతన ఓటర్ నమోదు పై చేపట్టిన ఇంటింటి సర్వే పని తీరు చాలా మెరుగుపడిందని, ఇప్పటి వరకు 90 శాతం పైగా ఇంటింటి సర్వే పూర్తయిందని, సెప్టెంబర్ 28 నాటికి 100% ప్రతి పోలింగ్ కేంద్రం పరిధిలో బూత్ స్థాయి అధికారుల ద్వారా ఇంటింటి సర్వే పూర్తి చేయాలని అన్నారు.పెండింగ్ ఉన్న ఓటర్ నమోదు సంబంధించి ఫారం 6, ఫారం 7, ఫారం 8 దరఖాస్తులను త్వరితగతిన పూర్తి చేయాలని సీ.ఈ.ఓ ఆదేశించారు. సెప్టెంబర్ నెలాఖరు వరకు పెండింగ్ దరఖాస్తులు పూర్తి చేయాలని అన్నారు.ఇతర ప్రాంతాలకు తరలి వెళ్ళిన వారి వివరాలు నోటీసు జారీ చేసి నిర్దేశిత ప్రోసిడ్యూర్ ఫాలో అయిన తరువాత తొలగించాలని అన్నారు. ఇంటింటి సర్వేలో ఆధార్ నెంబర్ సేకరణ తప్పనిసరి కాదని ,ఓటర్లు ఇష్టం ఉంటే ఇవ్వవచ్చని, బలవంతం చేయరాదని అన్నారు. ఇంటింటి సర్వే సంబంధించి వచ్చిన నూతన ఓటర్ నమోదు దరఖాస్తుల వివరాలు,నూతన ఓటర్ల నమోదు సంబంధించిన అంశాలు రాజకీయ పార్టీల ప్రతినిధులకు తెలియజేయాలని అన్నారు. పోలింగ్ కేంద్రాల క్రమబద్ధీకరణకు చర్యలు తీసుకోవాలని, బూత్ స్థాయి అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి వివరాలు సమర్పించాలని, పోలింగ్ కేంద్రం లోకేషన్, ఫోటోలను బి.ఎల్.ఓ యాప్ లను అప్ లోడ్ చేయాలని అన్నారు.పోలింగ్ కేంద్రాల క్రమబద్ధీకరణ ప్రక్రియ డ్రాఫ్ట్ ఓటరు జాబితా ప్రచురణ అక్టోబర్ 29 ముందు పూర్తి చేయాలని సీఈఓ అధికారులను ఆదేశించారు. అలాగే గతంలో ఓటు హక్కు వినియోగించుకున్న వారు సైతం మరోసారి తప్పనిసరిగా ఓటు హక్కు నమోదు చేసుకోవాల్సి ఉంటుందని, ఈ అంశాన్ని విస్తృతంగా ప్రచారం చేయాలని అన్నారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్ , సిరిసిల్ల, వేములవాడ రెవెన్యూ డివిజన్ అధికారులు రమేష్, రాజేశ్వర్ లు, తహసిల్దార్ లు షరీఫ్, మహేష్ లు, ఎన్నికల డి.టీ. పాషా, తదితరులు పాల్గొన్నారు.

# కర్ణాటక సీఎంకు షాక్

మొదటి పేజీతరువాయి...

సేకరించిన భూమి కంటే వీటి విలువ ఎన్నో రెట్లు అధికమని సామాజిక కార్యకర్త టీజే అబ్రహాం, ప్రదీప్‌కుమార్, స్నేహమయి కృష్ణ గవర్నర్ థావర్చంద్ గెహ్లాట్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన గవర్నర్.. సీఎంను ప్రాసిక్యూట్ చేసేందుకు అనుమతి ఇచ్చారు. గవర్నర్ నిర్ణయాన్ని సవాల్ చేస్తూ సీఎం సిద్ధరామయ్య హైకోర్టులో వేసిన పిటిషన్‌పై జస్టిస్ ఎం.నాగప్రసన్న నేతృత్వంలోని ఏకసభ్య ధర్మాసనం నెలరోజులపాటు విచారించి మంగళవారం తీర్పు ఇచ్చింది. సిద్ధరామయ్య పిటిషన్ను కొట్టివేస్తున్నట్లు ప్రకటించింది. సీఎం ప్రాసిక్యూషన్కు గవర్నర్ అనుమతించడం సమంజసమైనదని తీర్పులో స్పష్టం చేసింది. సీఎం కుటుంబసభ్యులు లబ్ధి పొందిన విషయం కావడంతో విచారణ జరగాలని న్యాయమూర్తి పేర్కొన్నారు. సీఎం సిద్ధరామయ్యకు వ్యతిరేకంగా హైకోర్టులో తీర్పు రావడంతో కర్ణాటక రాజకీయాలలో కలకలం ఏర్పడింది. బెంగళూరు నగర పర్యటనలో ఉన్న సిద్ధరామయ్య హుటాహుటిన అధికారిక నివాసం కావేరికి చేరుకున్నారు. ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్, మంత్రులు ఎంబీ పాటిల్, శివరాజ్ తంగడిగ, కృష్ణబైరేగౌడ, బైరతి సురేశ్ తదితరులు కూడా హుటాహుటి కావేరికి చేరుకున్నారు. ఇతర మంత్రులు, ఎమ్మెల్యేలు కూడా కావేరికి చేరుకుంటున్నారు. ఓ సదస్సులో పాల్గొనేందుకు ఢిల్లీకి వెళ్లిన శాసనసభ స్పీకర్ యూటీ ఖాదర్ కూడా బెంగళూరుకు బయల్దేరినట్లు సమాచారం. హైకోర్టు తీర్పు మేరకు సీఎం ప్రాసిక్యూషన్ను ఎదుర్కోవాల్సిన పరిస్థితి రావడంతో కాంగ్రెస్ అధిష్ఠానం స్పందించింది. ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, అండగా ఉంటామని సూర్జేవాలా భరోసా ఇచ్చారు. న్యాయపోరాటానికి సిద్ధం కావాలని సూచించారు. తద్వారా రాజీనామా చేయాల్సిన అవసరం లేదని అధిష్ఠానం పరోక్షంగా సందేశమిచ్చింది.

### నేడు హైకోర్టు లేదా సుప్రీంలో పిటిషన్..

సిద్ధరామయ్య పిటిషన్ను హైకోర్టు ఏకసభ్య ధర్మాసనం తిరస్కరించడంతో ఆయన హైకోర్టు ఉన్నత ధర్మాసనం లేదా సుప్రీంకోర్టును ఆశ్రయించే అవకాశం ఉంది. ఏకసభ్య ధర్మాసనం తీర్పు అనంతరం సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది అభిషేక్ మనుసింఘ్వి, మరో సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్‌తో ఫోన్లో చర్చించారు. ఈ తీర్పును సవాలు చేస్తూ సాధ్యమైనంత త్వరగా పిటిషన్ దాఖలు చేయాలని భావిస్తున్నట్లు సమాచారం. సిద్ధరామయ్య తరఫున బుధవారం పిటిషన్ వేసే అవకాశం ఉందని పార్టీ వర్గాల ద్వారా తెలిసింది. కాగా, హైకోర్టు తీర్పు నేపథ్యంలో సీఎం అధికారిక నివాసం 'కావేరి' వద్ద భారీగా పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. సీఎం రాజీనామా కోరుతూ మైసూరులో బీజేపీ కార్యకర్తలు ఆందోళనలు నిర్వహించారు.

### తప్పు చేయలేదు: సిద్దూ

ముడా ఇంటి స్థలాల విషయంలో తాను ఎటువంటి తప్పూ చేయలేదని సిద్ధరామయ్య చెప్పారు. న్యాయవ్యవస్థపైనా, రాజ్యాంగంపైనా తనకు నమ్మకం ఉందని, న్యాయ పోరాటం చేస్తానని చెప్పారు. అంతిమ విజయం సత్యానిదేనన్నారు. సీఎం పదవికి రాజీనామా చేసే ప్రసక్తే లేదని తేల్చిచెప్పారు. ప్రభుత్వానికి చెడ్డపేరు తీసుకురావాలనే దురాలోచనతో కుట్ర పన్నారని, గవర్నర్ రాజకీయ నిర్ణయం తీసుకున్నారని ఆరోపించారు. బీజేపీవి ప్రతీకార రాజకీయాలని ఆరోపించారు. తాజా రాజకీయ పరిస్థితులపై బుధవారం ఉదయం 10 గంటలకు కాంగ్రెస్ లెజిస్లేచర్ పార్టీ అత్యవసర సమావేశం ఏర్పాటు చేస్తున్నట్టు ప్రకటించారు.

# జిల్లా మంత్రులు ఇద్దరూ దద్దమ్మలే

- కృష్ణా, గోదావరి జలాలు సముద్రం పాలైతున్నయ్
- సాగర్ కెనాల్‌కు గండి పడి 20 రోజులైనా దిక్కులేదు
- తప్పుడు కేసులు పెడతామంటే ఊరుకోం
- సూర్యాపేట ఎమ్మెల్యే, మాజీమంత్రి గుంటకండ్ల జగదీష్ రెడ్డి




**మిర్యాలగూడ, సెప్టెంబర్ 24 (మనం న్యూస్) :** నల్గొండ జిల్లాకు చెందిన ఇద్దరు మంత్రులు దద్దమ్మలే... వీరికి కృష్ణా, గోదావరి జలాలపై అవగాహన లేదు, నీళ్లన్నీ సముద్రం పాలై మన పంటలు ఎండిపోతున్నాయని, సూర్యాపేట ఎమ్మెల్యే, మాజీ మంత్రి గుంటకండ్ల జగదీష్ రెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలోని రెడ్డి కాలనీలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్సీ కోటిరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు నల్లమోతు భాస్కరరావు, తిప్పన విజయసింహారెడ్డి లతో కలిసి ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. గత 60 ఏళ్ల కాంగ్రెస్ పాలనలో ఉన్నటువంటి పరిస్థితులే ఈ తొమ్మిది నెలల కాలంలో పునరావృతమయ్యాయన్నా రు. కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రాన్ని తిరోగమనం వైపు నడిపిస్తోందన్నారు. రాష్ట్రంలో ఉమ్మడి నల్గొండ జిల్లాలో పాలన పడకేసిందన్నారు. ఖమ్మం జిల్లా మంత్రుల అత్యాశ, అవగాహన లేమి కారణంగా సాగర్ ఎడమ కెనాల్ కు గండి పడిందని ఆరోపించారు. నాగార్జునసాగర్ ఎడమ కాల్వకు గండిపడి 20 రోజులైన పునరుద్ధరణ చర్యలు పూర్తికాక రైతులు ఇబ్బందులు పడుతుండ్రన్నారు. రాష్ట్రంలో వ్యవస్థలన్ని సర్వనాశనం చేశారని విద్య వైద్యంతో పాటు ప్రాజెక్టులకు నీళ్లు ఇవ్వలేని పరిస్థితుల్లో కాంగ్రెస్ ప్రభుత్వం ఉందన్నారు. జీవో 33 తో సూర్యాపేట, నల్గొండ జిల్లాలకు నష్టం వాటిల్లిందని ఆరోపించారు. సుప్రీంకోర్టు అందరికీ అవకాశం కల్పించాలని ఉత్తర్వులు ఇచ్చినా మెడికల్ కౌన్సెలింగ్ ప్రారంభించకపోవడంతో మెడికల్ విద్యార్థులు ఆందోళన పడుతున్నారన్నారు. గత పదేళ్ల కాలంలో కేసీఆర్ నాయకత్వంలో 1000 గురుకులాలు, 30 మెడికల్ కాలేజీలు ప్రారంభమైంది ప్రజలు చూశారన్నారు. రాష్ట్రంలో అప్పుడే పోలీసు రాజ్యం మొదలుపెట్టిండ్రని... అక్రమ కేసులతో బెదిరిస్తుండ్రన్నారు. జిల్లా ఎస్పీతో పాటు ఇతర పోలీస్ అధికారులు.. ఎమ్మెల్యేలు హుకుం జారీ చేస్తే తప్పుడు కేసులు పెడతామంటే ఊరుకునేది లేదన్నారు. ప్రభుత్వ హయాంలో జిల్లాలో కరువుకు, ఫ్లోరోసిస్ వ్యాదికి పరిష్కారం చూపించామన్నారు. అందరికీ రుణమాఫీ చేయడంతో పాటు... రైతు భరోసాను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో స్థానిక బీఆర్ఎస్ నేతలు ఉన్నారు.

# ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు మెరుగైన విద్య అందించాలి

- విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలి
- విద్యార్థుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం
- జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి

**నల్లగొండ,సెప్టెంబర్ 24 (మనం ప్రతినిధి):** రెసిడెన్షియల్ పాఠశాలలు, కేజీబీవీలు, సంక్షేమ వసతి గృహాలు, అదేవిధంగా ప్రభుత్వ పాఠశాలల్లో అందిస్తున్న మధ్యాహ్న భోజనం విషయంలో పూర్తి నాణ్యత ఉండాలని జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి ఆదేశించారు.మంగళవారం ఆయన నల్గొండ జిల్లా కేంద్రంలోని బోయవాడ పట్టణ రెసిడెన్షియల్ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసి 6, 7 వ తరగతి విద్యార్థులతో ముఖాముఖి మాట్లాడారు. విద్యార్థులకు అందిస్తున్న చదువు, భోజనం, అల్పాహారం, ఇతర సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు.అల్పాహారాన్ని తక్కువగా ఇస్తున్నారని, దోమల సమస్య ఉందని, దుప్పట్ల కొరత ఉందని, ప్రత్యేకించి నోట్ బుక్కులు ,యూనిఫారమ్ కావాలని విద్యార్థులు జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు.ఇందుకు జిల్లా కలెక్టర్ స్పందిస్తూ ఎట్టి పరిస్థితులలో మెనూ పాటించాలని, మెనూ ప్రకారం కాకుండా తగ్గించి భోజనం పెట్టినట్లయితే సంబంధితులపై కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు. విద్యార్థులు కోరిన వాటన్నింటిని వారం పది రోజుల్లో ఏర్పాటు చేస్తామని, బాగా కష్టపడి చదువుకోవాలని ఆయన విద్యార్థులకు సూచించారు.అనంతరం జిల్లా కలెక్టర్ పాఠశాల వంటగదిని తనిఖీ చేయడమే కాకుండా, మంగళవారం విద్యార్థులకు వడ్డించే ఆహార పదార్థాలను తనిఖీ చేశారు.కాగా ప్రభుత్వం ఇచ్చిన మెనూ ప్రకారమే అల్పాహారం, భోజనం వడ్డించాలని, ఎక్కడ తగ్గించడానికి వీల్లేదని ,వారం రోజుల్లో పూర్తిస్థాయిలో మార్పు రావాలని, లేనట్లయితే చర్యలు తీసుకుంటామన్నారు. తక్షణమే పాఠశాలకు అవసరమైన మరమ్మతులు చేపట్టాలని, విద్యార్థులు దోమలబారిన పడకుండా తలుపులు, కిటికీలకు జాలీలు ఏర్పాటు చేయాలని, ఎలక్ట్రిక్ పనులను చేయించాలని, పాఠశాలలో తరగతి గదులు, టాయిలెట్స్ అన్నింటికీ మరమ్మతులు చేయించిన తర్వాత కలర్ వేయించాలని, తక్షణమే నోట్ బుక్స్, యూనిఫామ్ పంపిణీ చేయాల్సిందిగా డీఈఓ ను ఆదేశించారు. పాఠశాలలో అవసరమైన లైట్లును సైతం ఏర్పాటు చేయాలని ,చిన్నచిన్న మరమ్మతులు వెంటనే చేపట్టాలని ,ఇవన్నీ వారంలోపు పూర్తి కావాలని ఆయన ఆదేశాలు జారీ చేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ పాఠశాల ఆవరణలో ఉన్న టాయిలెట్స్, మొదటి అంతస్తులో ఉన్న హాల్ ను తనిఖీ చేసి వాటన్నింటినీ ఉపయోగంలోకి తీసుకురావాలని ఆదేశించారు.ఎంఈఓ అరుంధతి, ఇంచార్జ్ స్పెషల్ ఆఫీసర్ ప్రభాకర్ తదితరులు జిల్లా కలెక్టర్ వెంట ఉన్నారు.



## భారత్‌కు ప్రధాని మోదీ

మొదటి పేజీతరువాయి...

'సమ్మిట్ ఆఫ్ ది ఫ్యూచర్' అనే కార్యక్రమంలో మోదీ మాట్లాడారు. తన పర్యటనలో ఉక్రెయిన్ అధ్యక్షుడు వొలోదిమిర్ జెలెన్స్కీ, పాలస్తీనా అధ్యక్షుడు మహమూద్ అబ్బాస్‌తో జరిగిన సమావేశాలతో సహా కీలక ద్వైపాక్షిక సమావేశాల్లో మోదీ పాల్గొన్నారు. ఇక ఇదే పర్యటనలో ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్స్కీతో పాటు నేపాల్, కువైట్, వియత్నాం, పాలస్తీనా అధినేతలతో ద్వైపాక్షిక చర్చలు జరిపారు. ఇక ప్రపంచంలోని ప్రముఖ కంపెనీల సీఈవోలతో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలోనూ ప్రధాని మోదీ పాల్గొన్నారు. దాదాపు నెల రోజుల వ్యవధిలో మోదీ–జెలెన్ స్కీ మధ్య రెండో సమావేశం కావడం విశేషం. ఇక ఇదే పర్యటనలో భారత్ నుంచి అక్రమంగా అమెరికాకు తరలించిన పురాతన వస్తువులను వెనక్కి తీసుకువచ్చేందుకు భారత్ అమెరికా మధ్య ఒప్పందం కుదిరింది. ఈ క్రమంలోనే మరో 297 పురాతన వస్తువులు భారత్‌కు రప్పించనున్నారు. అయితే ఈ పర్యటనలో మోదీని కలవనున్నట్లు అమెరికా అధ్యక్ష బరిలో ఉన్న డొనాల్ ట్రంప్ ప్రకటించినా అది జరగకపోవడం గమనార్హం. మూడు రోజుల అమెరికా పర్యటనను ముగించుకున్న ప్రధాని మోదీ మంగళవారం భారత్‌కు చురుకున్నారు.

## ప్రధాని మోడీ అమెరికా పర్యటన విజయవంతం

### ఎక్స్ వేదికగా శుభాకాంక్షలు తెలిపిన బాబు

**అమరావతి, సెప్టెంబర్ 24 (మనం న్యూస్):** అమెరికా పర్యటన ముగించుకున్న ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ భారత్ కు తిరిగివస్తున్నారు. ఈ సందర్భంగా ఏపీ సీఎం చంద్రబాబు ఆయనకు 'ఎక్స్' వేదికగా శుభాకాంక్షలు తెలిపారు. 'విజయవంతంగా అమెరికా పర్యటన ముగించుకొని భారత్‌కు విచ్చేస్తోన్న ప్రధాని మోదీకి స్వాగతం. ఆయనలాంటి గొప్ప రాజనీతిజ్ఞుడి నాయకత్వంలో పనిచేయడం నా అదృష్టంగా భావిస్తున్నా. ప్రపంచంలో భారత్ స్థానాన్ని బలపరచడంతోపాటు ప్రపంచ నాయకుడిగా ఎదిగారు. దేశాలను, జాతులను ఐక్యం చేయడంలో ప్రధాని కృషి ప్రశంసనీయం. ఐక్యరాజ్య సమితిలో ప్రధాని ప్రసంగం.. రాబోయే రోజుల్లో ప్రపంచవేదికపై మనం పోషించబోయే పాత్రకు సాక్ష్యంగా నిలుస్తోంది'అని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.

## చైనా, భారత్ మధ్య నలిగిపోం

మొదటి పేజీతరువాయి...

మాకు విలువైన మిత్రులే. ఎన్‌పీపీ ప్రభుత్వ హయాంలో మా స్నేహం మరింత బలపడుతుందని భావిస్తున్నాను. అదే సమయంలో ఐరోపా, పశ్చిమాసియా, ఆఫ్రికా దేశాలతో సన్నిహిత సంబంధాలు కోరుకుంటున్నామని తన విదేశాంగ విధానంపై దిసనాయకే కీలక విషయాలు వెల్లడించారు. ప్రాంతీయ ఉద్రిక్తతలు పెరుగుతున్న వేళ శ్రీలంక సార్వభౌమత్వాన్ని కాపాడుకోవడానికి తటస్థ వైఖరి చాలా కీలకమని దిసనాయకే అభిప్రాయపడ్డారు. ప్రపంచ శక్తుల అధిపత్య పోరుకు శ్రీలంక దూరమన్నారు. అదే సమయంలో ఉభయ పక్షాలకు ప్రయోజనకరంగా ఉండేలా దౌత్య, భాగస్వామ్యాలను కుదుర్చుకోవడంపై తాము దృష్టిపెడతామని పేర్కొన్నారు. కాగా, శ్రీలంక నూతన ప్రధానిగా హరిణి అమరసూర్య నియమితులయ్యారు. మంగళవారం ఆమెతో దిసనాయకే ప్రమాణ స్వీకారం చేయించారు. హక్కుల కార్యకర్తగా, యూనివర్సిటీ అధ్యాపకురాలిగా గుర్తింపు పొందిన హరిణి (58).. శ్రీలంక చరిత్రలో మూడో మహిళా ప్రధాని. సిరిమావో బండారు నాయకే (1994–2000) తర్వాత ప్రధాని పదవి చేపట్టిన మహిళా నేత హరిణే. మరో ఇద్దరు ఎన్పీపీ నేతలు మంత్రులుగా నియమితులయ్యారు. దీంతో దిశనాయకేతో పాటు మొత్తం నలుగురితో క్యాబినెట్ కొలువుదీరింది. కాగా, అధ్యక్షుడు దిశనాయకే శ్రీలంక పార్లమెంట్‌ను మంగళవారం రద్దు చేశారు. నవంబరు 14న ఎన్నికలు జరుగుతాయని గెజిట్ జారీ చేశారు.

## శ్రీశైలం జలాశయాన్ని ఖాళీ చేసేస్తున్నారు!

**హైదరాబాద్/అమరావతి, సెప్టెంబరు 24 (మనం న్యూస్):** జలాశయాల్లో నీటిని తొలుత తాగునీటికి, ఆ తర్వాతే సాగునీటికి, చివరిలో జల విద్యుత్ ఉత్పాదనకు వినియోగించాలనేది నిబంధన. అయితే వరదలు తగ్గి.. ఇన్‌ఫ్లో లేనప్పటికీ తెలుగు రాష్ట్రాలు పోటీపడి శ్రీశైలం రిజర్వాయర్‌ను ఖాళీ చేస్తున్నాయి. జల విద్యుత్ ఉత్పత్తి, పోతిరెడ్డిపాడు నుంచి భారీగా నీటి తరలింపుతో జలాశయం వేగంగా ఖాళీ అవుతోంది. ఈ నెల 9న 206.10 టీఎంసీల నీటి నిల్వ ఉండగా... మంగళవారం ఉదయం 163.2 టీఎంసీలు మాత్రమే ఉంది. శ్రీశైలం పూర్తి సామర్థ్యం 215 టీఎంసీలు కాగా మూడు వారాల్లో 52.61 టీఎంసీలను ఖాళీ చేసేశారు. నవంబరు దాకా ప్రాజెక్టులకు వరద ప్రవాహం ఉంటుందని సమాచారం ఉన్నా... కచ్చితంగా వస్తుందో లేదో చెప్పలేని పరిస్థితి. ఎగువన ఆల్మట్టి ప్రాజెక్టుకు వరద పోటెత్తితేనే దిగువన ఉన్న శ్రీశైలంలో నీటిని విద్యుత్ ఉత్పాదనకు వినియోగించుకో వాలి. ఆల్మట్టి నుంచి కేవలం 12 వేల క్యూసెక్కులు, ఆ దిగువన ఉన్న నారాయణపూర్ నుంచి 14,307 క్యూసెక్కుల ఔట్ ఫ్లో మాత్రమే ఉంది. జూరాల నుంచి 18,355 క్యూసెక్కుల ఔట్‌ఫ్లో ఉన్నా ఒక్కచుక్క కూడా శ్రీశైలం జలాశయంలోకి చేరకుండానే మళ్లిస్తున్నారు. ప్రస్తుతం ఒక్క చుక్క కూడా రావడం లేదని ఆంధ్రప్రదేశ్ జలవనరుల సమాచార వెబ్‌సైట్లో గణాంకాలు చూపిస్తుండటం గమనార్హం. వచ్చిన ఇన్‌ఫ్లోను వచ్చినట్లే పోతిరెడ్డిపాడు, కల్వకుర్తి నుంచి మళ్లిస్తుండటం గమనార్హం. భారీగా ఇన్‌ఫ్లో ఉన్న సమయంలో జల విద్యుత్ ఉత్పత్తి చేయాలి. కానీ ఇన్‌ఫ్లో అంతంతమాత్రంగా ఉన్నప్పుడు పోటీపడి జల విద్యుత్ ఉత్పత్తి చేయడం విమర్శలకు తావిస్తోంది. శ్రీశైలం కుడి గట్టు జల విద్యుత్ కేంద్రం నుంచి ఏపీ ఇప్పటిదాకా 766.41 మిలియన్ యూనిట్లు, ఎడమ గట్టు భూగర్భ జల విద్యుత్ కేంద్రం నుంచి తెలంగాణ ఇప్పటిదాకా 1,057 మిలియన్ యూనిట్లు ఉత్పత్తి చేసింది. మంగళవారం శ్రీశైలం ప్రాజెక్టు నుంచి 52 వేల క్యూసెక్కుల నీటిని వదిలారు. శ్రీశైలం నుంచి సాగర్కు 44 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రాగా.. జల విద్యుత్ ఉత్పత్తి చేస్తూ వచ్చింది వచ్చినట్టే దిగువకు వదిలిపెట్టారు. ఆ దిగువన ఉన్న పులిచింతలకు 37 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రాగా.. 36 వేల క్యూసెక్కులు వదిలిపెట్టారు. దాంతో ప్రకాశం బ్యారేజీ నుంచి మంగళవారం 43 వేల క్యూసెక్కులు సముద్రం దిశగా వెళ్లిపోయాయి. తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలు జాగ్రత్తగా వ్యవహరించి.. శ్రీశైలం జలాశయంలో నీటి నిల్వలను పెంచుకోవాలని రైతులు కోరుతున్నారు.

## అందుకే సంజూ, సూర్యను ఎంపిక చేయలేదు!



ప్రతిష్టాత్మక ఇరానీ కప్ 2024 టోర్నీలో బరిలోకి దిగే రెస్టాఫ్ ఇండియా జట్టును భారత సెలెక్షన్ కమిటీ ప్రకటించింది. 15 మంది సభ్యులతో కూడిన వివరాలను మంగళవారం వెల్లడించింది. రెస్టాఫ్ ఇండియా జట్టుకు రుతురాజ్ కెప్టెన్గా ఎంపికవ్వగా.. అభిమన్యు ఈశ్వరన్ అతనికి డిప్యూటీగా వ్యవహరించనున్నాడు. బంగ్లాదేశ్తో రెండో టెస్టుకు సెలెక్ట్ అయిన ధ్రువ్ జురెల్, యశ్ దయాల్ తుది జట్టులో చోటు దక్కించుకోకపోతే రెస్టా ఆఫ్ ఇండియా తరఫున ఇరానీ కప్ ఆడుతారని బీసీసీఐ తమ ప్రకటనలో స్పష్టం చేసింది. సర్ఫరాజ్ ఖాన్ కూడా తుది జట్టుకు ఎంపికవ్వకపోతే ముంబై తరఫున బరిలోకి దిగుతాడని పేర్కొంది. అక్టోబర్ 1 నుంచి 5 వరకు లక్నో వేదికగా రంజీ ట్రోఫీ 2024 ఛాంపియన్ ముంబైతో రెస్టాఫ్ ఇండియా తలపడనుంది. ముంబై జట్టును వెటరన్ బ్యాటర్ అజింక్యా రహానే నడిపించనున్నాడు. ఇటీవల ముగిసిన దులీప్ ట్రోఫీ ప్రదర్శన ఆధారంగా ఈ జట్టును ఎంపిక చేసినట్లు అర్థమవుతోంది. తెలుగు రాష్ట్రాల నుంచి రికీ భుయ్ మాత్రమే రెస్టాఫ్ ఇండియా జట్టుకు ఎంపికయ్యాడు. ఇండియా ఏ తరఫున శతకంతో రాణించిన తిలక్ వర్మకు కూడా అవకాశం దక్కలేదు. దులీప్ ట్రోఫీలో పెద్దగా ప్రభావం చూపని నితీష్ కుమార్ రెడ్డిని కూడా సెలెక్టర్లు పట్టించుకోలేదు. రెస్టాఫ్ ఇండియా జట్టులోకి సీనియర్ ప్లేయర్ చతేశ్వర్ పుజారాను తీసుకుంటారని ప్రచారం జరిగినా.. అతన్ని సెలెక్టర్లు పట్టించుకోలేదు. ఇషాన్ కిషన్కు అవకాశం దక్కగా.. సంజూ శాంసన్ను సెలెక్టర్లు పట్టించుకోలేదు. మరోవైపు సూర్యకుమార్ యాదవ్ కూడా ముంబై జట్టుకు ఎంపికవ్వలేదు. దులీప్ ట్రోఫీలో సత్తా చాటిన అర్షదీప్ సింగ్ను కూడా సెలెక్టర్లు ఎంపిక చేయలేదు. అయితే బంగ్లాదేశ్తో టీ20 సిరీస్ నేపథ్యంలోనే సంజూ, సూర్య, అర్షదీప్ సింగ్, తిలక్ వర్మలను ఇరానీ కప్కు ఎంపిక చేయలేదని తెలుస్తోంది. అక్టోబర్ 6 నుంచి బంగ్లాదేశ్తో టీ20 సిరీస్ ప్రారంభం కానుంది.

### రెస్టాఫ్ ఇండియా

రుతురాజ్(కెప్టెన్), అభిమన్యు ఈశ్వరణ్, సాయి సుదర్శన్, దేవదత్ పడిక్కల్, ధ్రువ్ జురెల్(కీపర్), ఇషాన్ కిషన్, మానవ్ సుతార్, సరాన్ష్, ప్రసిధ్ కృష్ణ, ముఖేష్ కుమార్, యశ్ దయాల్, రికీ భుయ్, శశ్వాత్ రావత్, ఖలీల్ అహ్మద్, రాహుల్ చాహర్.

## కోహ్లీ, బుమ్రా కాదు..
# అతని బ్యాటింగే మాకు భయం



టీమిండియా స్టార్ వికెట్ కీపర్ కమ్ బ్యాటర్ రిషభ్ పంత్పై ఆస్ట్రేలియా కెప్టెన్ ప్యాట్ కమిన్స్ ప్రశంసల జల్లు కురిపించాడు. టీమిండియాలో మ్యాచ్ను మలుపు తిప్పగల ఆటగాడు రిషభ్ పంత్ అని కొనియాడాడు. సుమారు 20 నెలల సుదీర్ఘ విరామం తర్వాత రిషభ్ పంత్ రెడ్ బాల్ క్రికెట్లోకి రీఎంట్రీ ఇచ్చిన విషయం తెలిసిందే. బంగ్లాదేశ్తో చెన్నై వేదికగా జరిగిన తొలి టెస్టులతో సుదీర్ఘ ఫార్మాట్లోకి పునరాగమనం చేసిన పంత్.. సెంచరీతో సత్తా చాటాడు. ఈ మెరుపు శతకంతో ఆస్ట్రేలియా జట్టుకు హెచ్చరికలు పంపాడు. కారు యాక్సిండెంట్ అనంతరం తొలి టెస్టులోనే సెంచరీతో అదరగొట్టిన పంత్.. 'నేను మళ్లీ వస్తున్నా. కాచుకోండి' అంటూ కంగారూలకు సవాల్ విసిరాడు. ఈ ఏడాది నవంబర్లో టీమిండియా బోర్డర్ గవాస్కర్ ట్రోఫీ 2024 కోసం ఆస్ట్రేలియా పర్యటనకు వెళ్లనుంది. అక్కడ 5 టెస్ట్ మ్యాచ్ల సిరీస్ ఆడనుంది. ఇప్పటికే ఈ సిరీస్ గురించి ఇరు జట్ల మాజీ క్రికెటర్లు తమ మాటలతో హైప్ క్రియేట్ చేస్తున్నారు. తాజాగా రిషభ్ పంత్ బ్యాటింగ్ గురించి మాట్లాడిన ఆస్ట్రేలియా కెప్టెన్ ప్యాట్ కమిన్స్ .. ఈ సారి అతన్ని నిశబ్దంగా ఉంచే ప్రయత్నం చేస్తామని చెప్పాడు. అతడికి ఏమాత్రం అవకాశం ఇవ్వమని అన్నాడు. 'మ్యాచ్ను మలుపు తిప్పగల ఆటగాళ్లు ప్రతి జట్టులో ఒకరో ఇద్దరో ఉంటారు. మా టీమ్లో ట్రావిస్ హెడ్, మిచెల్ మార్ష్లు అలా దూకుడుగా ఆడి మ్యాచ్ను లాగేసుకుంటారు. రిషభ్ పంత్ కూడా అలాంటి ఆటగాడే. అతను ఆడే రివర్స్ స్లాప్ షాట్ చాలా ప్రత్యేకం. అతను ఈ మధ్య సూపర్ ఫామ్లో ఉన్నాడు. అయితే.. ఈసారి మేము అతన్ని నిశబ్దంగా మారుస్తాం. అతనికి ఏ మాత్రం అవకాశం ఇవ్వకుండా దూకుడుకు కళ్లెం వేస్తాం' అని కమిన్స్ చెప్పుకొచ్చాడు. ఆస్ట్రేలియా కెప్టెన్ ప్యాట్ కమిన్స్ చెప్పాడంటే ఆ పని చేస్తాడు. గతేడాది వన్డే వరల్ కప్లో అహ్మదాబాద్ అభిమానులను నిశబ్దంగా మార్చేస్తానని తుది పోరుకు ముందు చెప్పాడు. అన్నట్టుగానే విరాట్ కోహ్లీ, శ్రేయస్ అయ్యర్ల వికెట్లు తీసి టీమిండియా పతనాన్ని శాసించాడు. ఆ మ్యాచ్లో భారత్ నిర్దేశించిన 240 పరుగుల లక్ష్యాన్ని ఆస్ట్రేలియా అలవోకగా ఛేదించింది. ట్రావిస్ హెడ్(137), మార్నస్ లబూషేన్(58 నాటౌట్)లు దంచి కొట్టడంతో ఆసీస్ 6 వికెట్ల తేడాతో గెలుపొంది ఛాంపియన్గా నిలిచింది. అయితే ఆస్ట్రేలియా పర్యటన అంటే రిషభ్ పంత్కు పూనకాలు వస్తాయి. ఆసీస్ గడ్డ మీద అతనికి మంచి రికార్డులు ఉన్నాయి. 2020-21లో కంగారూ గడ్డపై పంత్ ఖతర్నాక్ బ్యాటింగ్తో భారత్ను గెలిపించాడు. గబ్బా టెస్టులో అర్ధ శతకం (89 నాటౌట్)తో టీమిండియాను గెలిపించి సరికొత్త చరిత్రను లిఖించాడు. ఇక సిడ్నీ టెస్టులోనూ ఛతేశ్వర్ పూజారాతో కలిసి చిరస్మరణీయ ఇన్నింగ్స్ ఆడాడు. దాంతో, భారత జట్టు 2-1తో సిరీస్ సొంతం చేసుకుంది. ఇప్పుడు.. మరోసారి టీమిండియా నవంబర్లో ఆస్ట్రేలియాకు వెళ్లనుంది. నవంబర్ 22న ఇరు జట్ల మధ్య పెర్త్ వేదికగా జరిగే తొలి మ్యాచ్తో ఐదు టెస్టుల సిరీస్ ప్రారంభం కానుంది. 1992 తర్వాత బోర్డర్ -గవాస్కర్ ట్రోఫీ ఐదు మ్యాచ్ల సిరీస్గా నిర్వహించడం ఇదే తొలిసారి.

## అఫ్గనిస్థాన్ క్రికెటర్కు సర్జరీ.. స్పందించిన పంత్

దక్షిణాఫ్రికాతో వన్డే సిరీస్కు దూరమైన అఫ్గనిస్థాన్ క్రికెటర్ ఇబ్రహీం జద్రాన్ సర్జరీ చేయించుకున్నాడు. ఎడమ మోకాలి గాయంతో బాధ పడుతున్న అతడు తనకు ఇంగ్లండ్లో సర్జరీ విజయవంతం అయిందని చెప్పాడు. మంగళవారం జద్రాన్ సోషల్ మీడియా వేదికగా ఈ విషయాన్ని అభిమానులతో పంచుకున్నాడు. సర్జరీ అనంతరం దవాఖానలో బెడ్ మీద పడుకొని ఉన్న ఫొటోలను అఫ్గన్ ఆటగాడు ఎక్స్ వేదికగా పెట్టాడు. 'మీలో కొందరికి తెలిసే ఉంటుంది. నా మోకాలికి ఈమధ్యే గాయం అయింది. ఈ రోజు సర్జరీ ద్వారా వైద్యులు దాన్ని ఫిక్స్ చేశారు. ఆపరేషన్ విజయవంతం అయింది. ఇక కోలుకోవడం మీదనే నా దృష్టంతా' అని జద్రాన్ తన పోస్ట్లో రాసుకొచ్చాడు. ఆ పోస్ట్ చూసిన పలువురు క్రికెటర్లు 'జద్రాన్ నువ్వు త్వరగా కోలుకోవాలి' అంటూ కామెంట్లు పెడుతున్నారు. జద్రాన్ పోస్ట్ చూసిన భారత వికెట్ కీపర్ రిషభ్ పంత్ సైతం స్పందించాడు. 'తొందరగా కోలుకోవాలి' అంటూ ఈ డాషింగ్ బ్యాటర్ కామెంట్ పెట్టాడు.





రెండేండ్ల క్రితం కారు యాక్సిడెంట్లో గాయపడిన పంత్ కూడా మోకాలి సర్జరీ చేయించుకున్నాడు. సర్జరీ తర్వాత రికవరీ అయిన పంత్.. ఐపీఎల్లో ఎంట్రీ ఇచ్చాడు. ఢిల్లీ క్యాపిటల్స్ కెప్టెన్గా షాన్దార్ ఇన్నింగ్సులు ఆడిన అతడు.. టీ20 వరల్ కప్లో మెరుపు బ్యాటింగ్తో అలరించాడు. ఇక సుదీర్ఘ ఫార్మాట్లో పంత్ సెంచరీతో పునరాగమనాన్ని ఘనంగా చాటాడు. చెపాక్ టెస్టులో బంగ్లాదేశ్పై రెండో ఇన్నింగ్స్లో 109 పరుగులతో చెలరేగి జట్టు విజయంలో భాగమయ్యాడు.

## సత్తా చాటుతాం



ప్రతిష్ఠాత్మక టీ20 ప్రపంచకప్లో సత్తాచాటుతామని భారత మహిళల కెప్టెన్ హర్మన్ప్రీత్ కౌర్ ధీమా వ్యక్తం చేసింది. వచ్చే నెల 3వ తేదీ నుంచి యూఏఈ వేదికగా మొదలవుతున్న మెగాటోర్నీ కోసం మంగళవారం టీమ్ఇండియా బయల్దేరి వెళ్లింది. ఇన్నాళ్లు అందని ద్రాక్షగా ఊరిస్తూ వస్తున్న టీ20 ప్రపంచకప్ను ఈసారైనా ఒడిసిపట్టుకోవాలన్న పట్టుదలతో ఉన్న భారత్ ఆ దిశగా ముందుకెళుతున్నది. యూఏఈకి వెళ్లే ముందు ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కెప్టెన్ హర్మన్ప్రీత్కౌర్తో పాటు చీఫ్ కోచ్ అమోల్ మజుందార్, చీఫ్ సెలెక్టర్ నీతూ డేవిడ్ పాల్గొన్నారు. వాస్తవానికి షెడ్యూల్ ప్రకారం బంగ్లాదేశ్లో టీ20 ప్రపంచకప్ జరగాల్సి ఉన్నా.. అక్కడ నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల కారణంగా టోర్నీని యూఏఈకి మారుస్తూ ఐసీసీ నిర్ణయం తీసుకుంది. మెగాటోర్నీలో భాగంగా భారత్ తమ తొలి మ్యాచ్లో అక్టోబర్ 4న న్యూజిలాండ్తో తలపడనుంది. 2009లో మొదలైన ఈ మెగాటోర్నీలో భారత్ ఇప్పటి వరకు ఒక్కసారే(2020) ఫైనల్ చేరుకోగా, గతేడాది సెమీఫైనల్లోనే నిష్క్రమించింది. ఏండ్లుగా అందకుండా పోతున్న పొట్టి కప్ను ఈసారి ఒడిసిపట్టుకునేందుకు భారత్ తహతహలాడుతున్నది.


### సన్నాహాల్లో ముందున్నాం

టీ20 ప్రపంచకప్పై హర్మన్ప్రీత్కౌర్ స్పందిస్తూ 'యూఏఈలో త్వరలో జరుగబోయే టీ20 వరల్డ్కప్ కోసం ఆసక్తిగా ఎదురు చూస్తున్నాం. ఆసియా కప్లో చేదు అనుభవం తర్వాత మా లోపాలపై ప్రత్యేకంగా దృష్టి పెట్టాం. ముఖ్యంగా ఒత్తిడిని ఎదుర్కొంటూ ఎలా రాణించాలనే దాన్ని ప్రాధాన్యంగా తీసుకున్నాం. దూకుడుకు మారుపేరైనా టీ20ల్లో పరిస్థితుల కు తగ్గట్లు ఆటతీరు మార్చుకోవాల్సి ఉంటుంది. గత టోర్నీలకు భిన్నంగా ఈసారి అన్ని విభా గాల్లో జట్టు సత్తా చాటుతుందన్న నమ్మకం నాకుంది. యువ క్రికెటర్లకు తోడు అనుభవజ్ఞులు ఉండటం జట్టుకు కలిసి రానుంది. జాతీయ క్రికెట్ అకాడమీ(ఎన్సీఏ)లో గత 10 రోజులుగా కఠిన శిక్షణ తీసుకున్నాం. ముఖ్యంగా ఫిట్నెస్, ఫీల్డింగ్లో మెరుగయ్యేం దుకు చెమటోడ్చాం. ఇప్పటి వరకు చాలా మెగాటోర్నీలు ఆడిన అనుభవం నాకుంది. 19 ఏండ్ల వయసు నుంచి ఇప్పటి వరకు చాలా టోర్నీల్లో భాగమయ్యాను. టీ20 ప్రపం చకప్లో ఆస్ట్రేలియా, ఇంగ్లండ్ నుంచి బాగా పోటీ ఎదుర య్యే అవకాశముంది. ఐసీసీ ఈవెంట్లలో మమ్మల్ని ఎలా ఓడించాలో ఆసీస్కు బాగా తెలుసు. కానీ వారిని ఓడించే ఏకైక జట్టు భారత్ అన్న సంగతి వారికి కూడా తెలుసు' అని ఉంది. మజుందార్ మాట్లాడుతూ గత పది రోజులుగా ఎన్సీఏలో ఫిట్నెస్, ఫీల్డింగ్పై బాగా దృష్టి పెట్టామన్నాడు.

## ఆయన ప్రిపరేషన్ అంటారు..



సినిమాతో ప్రేక్షకులకు కొత్త ప్రపంచాన్ని చూపించేందుకు సిద్ధమయ్యారు ఎన్టీఆర్ . ఆయన హీరోగా దర్శకుడు కొరటాల శివ తెరకెక్కించిన ఈ మూవీ సెప్టెంబరు 27న విడుదల కానుంది. ప్రమోషన్స్లో భాగంగా ఎన్టీఆర్ ఇటీవల ముంబయి వెళ్లిన సంగతి తెలిసిందే. ఆ సమయంలో.. అలియా భట్తో ప్రత్యేక ఇంటర్వ్యూలో పాల్గొన్నారు. 'దేవర'తో పాటు తాను కీలక పాత్ర పోషిస్తున్న హిందీ చిత్రం 'వార్ 2' విశేషాలు పంచుకున్నారు. ఆ సినిమా దర్శకుడు అయాన్ ముఖర్జీపై ఆసక్తికర కామెంట్స్ చేశారు. దక్షిణాది సినిమాల సెట్స్లో సరదా వాతావరణం ఉంటుందని, బాలీవుడ్లో దానికి కాస్త భిన్నంగా ఉంటుందని అభిప్రాయపడ్డారు. 'వార్ 2' చిత్రీకరణ గుర్తుచేసుకుంటూ.. ''అయాన్ అనుకున్న దానికి మించి అవుట్పుట్ ఇచ్చేందుకు ప్రయత్నించా. అయాన్ నటుల ప్రిపరేషన్ను ఇష్టపడతారు. కానీ, దానికి నేను పూర్తి భిన్నం. ఓ సందర్భంలో.. సెట్స్లో ఏం జరుగుతోంది? అని అయాన్ సందేహిస్తుంటే.. 'నేను సన్నద్ధమవకుండానే నటిస్తా' అని చెప్పా. సౌత్ ఇండస్ట్రీలో ప్రిపరేషన్ పెద్దగా ఉండదు. రేపు క్రేజీ సీక్వెన్స్ షూటింగ్ ఉన్నా ఎలాంటి టెన్షన్ లేకుండా సరదాగా ఉంటారు'' అని తెలిపారు. గతంలో వచ్చిన 'వార్'కు సీక్వెల్గా రూపొందుతోంది 'వార్ 2'. హృతిక్ రోషన్ మరో ప్రధాన పాత్ర పోషిస్తున్నారు. ప్రస్తుతం ఇటలీలో చిత్రీకరణ జరుగుతోంది. హృతిక్- హీరోయిన్ కియారా అద్వాణీలపై కీలక సన్నివేశాలు షూట్ చేస్తున్నారు. ఎన్టీఆర్ ప్రస్తుతం 'దేవర' ప్రచారంలో ఫుల్ బిజీగా ఉన్నారు. బియాండ్ ఫెస్ట్లో పాల్గొనేందుకు లాస్ ఏంజెల్స్ వెళ్లారు. ఆ ఫెస్టివల్లో ప్రదర్శితం కానున్న తొలి భారతీయ చిత్రంగా 'దేవర' నిలవనుంది. తీర ప్రాంతం నేపథ్యంతో రూపొందిన ఈ సినిమాలో ఎన్టీఆర్ ద్విపాత్రాభినయం చేశారు.



## అందుకే అప్పుడు టెన్షన్ పడ్డా..

'యానిమల్' సినిమాలో నటించి విశేష క్రేజ్ సొంతం చేసుకుంది త్రిప్తి డిమ్రీ . తన అందచందాలతో యూత్ ఆడియన్స్ను కట్టిపడేసింది. ఇటీవల 'బ్యాడ్ న్యూజ్'తో వినోదం పంచిన ఆమె త్వరలో మరోసారి ప్రేక్షకుల ముందుకు రానుంది. రాజ్ కుమార్రావ్ సరసన నటించిన 'విక్కీ విద్యా కా వో వాలా వీడియో' అక్టోబరు 11న విడుదల కానుంది. ఈ సందర్భంగా పాల్గొన్న ఓ ఇంటర్వ్యూలో తనకు డ్యాన్స్ ఇష్టమని తెలిపింది. ఇప్పటి వరకూ డ్యాన్స్ నంబర్ చేయలేదనే లోటు 'మేరే మెహబూబ్' (విద్యా కా వో వాలా వీడియోలోని పాట) తీర్చిందని చెప్పింది. ఆ పాట చిత్రీకరణ జ్ఞాపకాలు గుర్తు చేసుకుంది. ''మేరే మెహబూబ్.. నాకెంతో ప్రత్యేకం. దానికి సచిన్-జిగర్ సంగీతం అందించగా శిల్పా రావ్, సచెత్ టాండన్ ఆలపించారు. గణేశ్ ఆచార్య కొరియోగ్రఫీ చేశారు. అంతకుమించి ఏం కావాలి? డ్యాన్స్ ప్రతిభ నిరూపించే తొలి పాట కావడంతో ముందుగా కాస్త టెన్షన్ పడ్డా. గణేశ్ ఆచార్య, ఆయన టీమ్ సహకారంతో తేలిగ్గా పూర్తి చేశా. 'దేని గురించీ ఆలోచించకుండా పాటను ఆస్వాదిస్తూ నటించు' అని నన్ను ప్రోత్సహించారు. హిట్ సాంగ్ 'టిప్ టిప్ బర్సా పానీ' (మోహ్రా సినిమాలోని సాంగ్.. దానినే 'సూర్య వంశీ'లో రీమిక్స్ చేశారు) చూస్తూ 'మేరే మెహబూబ్'కు రిహార్సల్ చేసేదాన్ని. వాటిలో నటించిన రవీనా టాండన్, కత్రినా కైఫ్ అంత గొప్ప డ్యాన్సర్ని కాదు. అందుకే వారితో పోల్చుకోను. మాధురీ దీక్షిత్ డ్యాన్స్కు నేను పెద్ద అభిమానిని. ఆమె నటించిన అన్ని పాటలకు నేను డ్యాన్స్ చేశా'' అని పేర్కొంది.

## దేవర అల్లు అర్జున్తో తీయాల్సిన కథ కాదు



ఎన్టీఆర్ హీరోగా కొరటాల శివ దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం దేవర. అత్యంత ప్రతిష్ఠాత్మకంగా రూపొందిన ఈ చిత్రం ఈ నెల 27న ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు రానుంది. ఆర్ఆర్ఆర్ తరువాత దాదాపు మూడేళ్ల విరామం గ్యాప్తో విడుదలవుతున్న ఎన్టీఆర్ చిత్రం కావడంతో సినిమా గురించి అందరూ ఎంతో క్యూరియాసిటితో ఎదురు చూస్తున్నారు. అయితే గతంలో కొరటాల శివ దర్శకత్వంలో అల్లు అర్జున్ హీరోగా ఓ సినిమాను అనౌన్స్ చేశారు. అయితే అది కార్యరూపం దాల్చలేదు. అనౌన్స్మెంట్లో భాగంగా సముద్రం దగ్గర అల్లు అర్జున్ నిలబడిన ఓ పోస్టర్ను కూడా విడుదల చేశారు. అయితే చాలా మందిలో ఈ సినిమా దేవర ఆ కథతోనే తెరకెక్కిందా? అనే సందేహాలు వున్నాయి. అయితే దీనిపై కొరటాల శివ క్లారిటి ఇచ్చారు. అల్లు అర్జున్తో అనుకున్న కథకు దేవరకు సంబంధం లేదని తేల్చి చెప్పారు. దేవర కేవలం ఎన్టీఆర్ కోసమే రెడీ చేసిన సబ్జెక్ట్ అని చెప్పారు. మంగళవారం విలేకరులతో మాట్లాడిన ఆయన పలు విషయాలపై స్పందించాడు. 'దేవర అనేది కంప్లీట్ ఫిక్షన్ స్టోరి. ఎక్కడి నుంచో ప్రేరణ పొందిన రాసిన కథ కాదు. రూటేడ్ యాక్షన్ స్టోరిగా రూపొందిన ఈ చిత్రంలో ఇంటర్వెల్ బ్యాంగ్, క్లైమాక్స్ ఎవరూ ఊహించని విధంగా వుంటుది. ఎన్టీఆర్ ఇచ్చిన సపోర్ట్తోనే ఈ రోజు దేవరను ఓ అద్భుతమైన కథగా మలిచాను. ఆయనతో వున్న స్నేహం, అనుబంధం ప్రత్యేకమైనది. నేను సక్సెస్లో వున్నానా? ఫెయిల్యూర్స్లో వున్నానా? అనేది ఆయన పట్టించుకోడు. నా విషయంలో ఆయనకు ఎటువంటి క్యాలిక్లేషన్స్ వుండవు. నా హండ్రెడ్ పర్సెంట్ ఎఫర్ట్ పెట్టి ఈ సినిమా చేశాను. దేవర అనేది ఎన్టీఆర్ కెరీర్లో బిగ్గెస్ట్ మాస్ ఫిలింగా నిలుస్తుంది. పార్ట్ వన్ ఎండింగ్ అందరూ రెండో భాగం గురించి ఎదురుచూసే విధంగా వుంటుంది. కథ డిమాండ్ మేరకు రెండో పార్టును కూడా అనౌన్స్ చేశాం' అన్నారు.




## యూట్యూబర్ హర్షసాయిపై యువతి ఫిర్యాదు.. కేసు నమోదు



యూట్యూబర్గా యువతరానికి దగ్గరైన హర్షసాయిపై ఓ యువతి పోలీసులకు ఫిర్యాదు చేసింది. పెళ్లి పేరుతో తనని మోసం చేశాడని ఆరోపిస్తూ పోలీసులను ఆశ్రయించింది. అడ్వొకేట్తో సహా నార్సింగి పీఎస్కు వెళ్లిన ఆమె.. హర్ష సాయితో పాటు అతడి తండ్రిపైనా ఫిర్యాదు చేసింది. నెటిజన్లకు సుపరిచితమైన హర్షసాయి హీరోగానూ మారాడు. స్వీయ దర్శకత్వంలో 'మెగా' అనే చిత్రం ద్వారా వెండితెరపైకి అడుగు పెడుతున్నారు. మరోవైపు, హర్షసాయిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు వెల్లడించారు. అత్యాచారంతో పాటు, నగ్న చిత్రాలు, వీడియోలతో బ్లాక్మెయిలింగుకు పాల్పడినట్లు యువతి ఫిర్యాదు చేయడంతో 376, 354 ఐపీసీ సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్లు రాజేంద్రనగర్ డీసీపీ తెలిపారు. వైద్య పరీక్షల కోసం బాధితురాలిని ఆసుపత్రికి తరలించినట్లు చెప్పారు.

## గేమ్ చేంజర్ సందడి



రామ్చరణ్ నటిస్తున్న 'గేమ్ చేంజర్' డిసెంబర్ 20న ప్రేక్షకుల ముందుకురానుంది. శంకర్ దర్శకత్వంలో అగ్ర నిర్మాత దిల్రాజు నిర్మిస్తున్న ఈ పొలిటికల్ యాక్షన్ డ్రామా నిర్మాణం నుంచే ప్రేక్షకుల్లో ఆసక్తిని పెంచుతున్నది. భారీ యాక్షన్ హంగులతో దర్శకుడు శంకర్ ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన ప్రచార చిత్రాలకు మంచి స్పందన లభించింది.

ఈ నేపథ్యంలో ఈ సినిమా గురించి ఆసక్తికరమైన పోస్ట్ చేశారు సంగీత దర్శకుడు తమన్. డిసెంబర్ 20న 'గేమ్ చేంజర్' ప్రేక్షకుల ముందుకొస్తున్నదని, ఇప్పటి నుంచి సినిమా రిలీజ్ వరకు వరుసగా అప్డేట్స్ ఉంటాయని తన ఎక్స్ (ట్విట్టర్) ఖాతాలో పేర్కొన్నారు. తమన్ ట్వీట్తో రామ్చరణ్ అభిమానులు ఖుషీ అవుతున్నారు. తాజా సమాచారం ప్రకారం బుధవారం రెండో పాటను విడుదల చేయబోతున్నారని తెలిసింది. ఈ చిత్రంలో రామ్చరణ్ తండ్రీకొడుకులుగా ద్విపాత్రాభినయంలో కనిపించనున్నారు. కియారా అద్వాణీ, అంజలి, సముద్రఖని, ఎస్.జె.సూర్య, శ్రీకాంత్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: ఎస్.తిరుణావుక్కరసు, సంగీతం: తమన్, సంభాషణలు: సాయిమాధవ్ బుర్రా, నిర్మాతలు: దిల్రాజు-శిరీష్, దర్శకత్వం: శంకర్

Printed and Published by **VUPPARI RAMESH KUMAR** on behalf of Navatharam Publications Private Limited, Printed at Sree Seshasai Enterprises Plot No: 98/1, CIE Phase II, Gandhinagar, Quthabullapur Mandal, Medchal-Malkajgiri, Hyderabad-500037.Telangana state and Published From : Samrat Complex, Block A, Flat No : 8A, Saifabad, OPP : A G Office, Beside: Aranya Bhavan, Hyderabad, Pin : 500004, **EDITOR: VUPPARI RAMESH KUMAR**. **RNI Reg No.TELTEL/2016/72952**.